అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

రాహుల్‌వి పిల్ల చేష్టలైతే... మోదీ పెద్దరికం ఎక్కడ?

ఒత్తిడిలో యువత ఆత్మహత్యలు!

ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదికపై నేడు మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 149 | మంగళవారం | 29-04-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా?

- రజతోత్సవ సభలో బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కారు
- అభద్రతాభావంతో మాట్లాడుతున్నారు
- ఆయన చేసిన విధ్వంసంతోనే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం
- గులాబీ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- కెసిఆర్‌వన్నీ శాంపిల్ పథకాలే
- అభివృద్ధి సంక్షేమ పథకాలను చెప్పుకోవడంలో కొంత వెనకబడ్డాం
- రాహుల్ గాంధీకి నాకు మధ్య దూరం పెరిగిందనడం అవాస్తవం
- మీడియా ప్రతినిధులతో 'ఇష్టాగోష్టి'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రాన్ని పదేళ్లు పరిపాలించిన బిఆర్‌ఎస్ పాలకులు రాష్ట్ర ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి ఇప్పుడు ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం చంద్రశేఖర్‌రావు ప్రసంగం పూర్తిగా ప్రభుత్వంపై, కాంగ్రెస్‌పై అక్కసుతో నిండి ఉందని, ఆయన మాటల్లో స్పష్టత కొరవడిందని, కెసిఆర్ అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని సిఎం విమర్శించారు. బిఆర్‌ఎస్ సభలో కెసిఆర్ ప్రసంగంపై సిఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిదులతో సిఎం ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కెసిఆర్ విమర్శలు ఇప్పుడు చేయడం కాదని, అసెంబ్లీకి వచ్చి చేయాలన్నారు. కెసిఆర్ చేసిన విధ్వంసంతోనే రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అవసరాలకు అనుగుణంగా మాజీ సిఎం కెసిఆర్, ప్రధాని మోదీ తమ వైఖరిని మార్చుకుంటున్నారని సిఎం విమర్శించారు. అధికార యంత్రాంగాన్ని ప్రక్షళన చేశామని, కెసిఆర్ మాదిరిగా పథకాలను మొదలుపెట్టి వదిలేయబోనని, కెసిఆర్‌వి అన్నీ శాంపిల్ పథకాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, చేపడుతున్న సంక్షేమ పథకాలను చెప్పుకోవడంలో కొంత వెనుకపడ్డామని, దానిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికార యంత్రాంగాన్ని

> కొంత మంది పార్టీ నాయకులకు పదవులు రాలేదని నోరుజారుతున్నరు.అలాంటి వాళ్లకు అవకాశాలు ఉండవు. ఇష్టానుసారంగా మాట్లాడితే నేతలే నష్టపోతారు. నేను ఇంకా 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటా. కమిట్మెంట్ ఇస్తే చేసి తీరుతా. కెసిఆర్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు వెళ్లి పరామర్శించా. అరెస్టుల విషయంలో తొందరపడితే ఏం జరిగిందో ఎపిలో చూశాం. రాహుల్ గాంధీతో నాకున్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దేశానికి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ వంటి నాయకత్వం అవసరం.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి



## మీ స్పందనేంటీ?

- అశ్లీల కంటెంట్‌పై ఓటిటి, సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్స్‌కు సుప్రీంకోర్టు నోటీసులు
- ఇది 'తీవ్ర ఆందోళనకరం' అని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** 'ఓవర్‌దిటాప్' (ఓటిటి), సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌లో లైంగిక అసభ్యకరమైన కంటెంట్ ప్రసారంపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఇది 'ఒక ముఖ్యమైన ఆందోళన' అని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీనిపై ప్రతిస్పందనను కోరుతూ కేంద్రం, ఓటిటి, సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్స్‌కు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయ్, అగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ ఈ అంశాన్ని పరిష్కరించడం లేదా చర్యలు తీసుకోవడం లెజిస్లేచర్ లేదా ఎగ్జిక్యూటివ్ పరిధిలోకి వస్తుందని తెలిపింది. 'ఇది మా పరిధిలో లేదు. ఇప్పటికే మాపై శాసన లేదా కార్యనిర్వాహక అధికారాలలో జోక్యం చేసుకుంటున్నామన్న ఆరోపణలు చాలా తరువాయి 2లో




## ఉగ్రవాద సంస్థలను పాకిస్తాన్ ఎలా అనుమతిస్తుంది?

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ :** సార్వభౌమ దేశమైన పాకిస్తాన్ గడ్డపై ఉగ్రవాద సంస్థల పని చేసేందుకు ఏ విధంగా అను మతిస్తుందో పాక్ ప్రభుత్వం ఆలోచించుకోవాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఉగ్రవాద సంస్థలు భారతదేశంలోకి జొరబడి ప్రజలను చంపుతుంటే ఏ విధంగా మౌన ప్రేక్షకురాలిగా ఉంటుందని ప్రశ్నించారు. ఈ ఘటన విషయంలో పాకిస్తాన్ బాధ్యతేమిటి అని అన్నారు. న్యూఢిల్లీలో సోమవారం నాడు ఆయన 'ఎఎన్‌ఐ' వార్తా సంస్థతో మాట్లాడుతూ మనం ఇరుగుపొరుగు దేశాలమని, ఇరుగు పొరుగుగా మనకు బాధ్యత ఉంటుందని, ఏదేమైనా ఇరుగుపొరుగుగా జీవించాల్సిందేనని, దీనిపై పాకిస్తాన్ ప్రభుత్వం ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమాజం ఆశిస్తున్నట్లు పాకిస్తాన్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని రాజా నిలదీశారు. భారత భూభాగంలోకి చొరబడి అమాయక ప్రజలను చంపుతున్న ఉగ్రవాద సంస్థలను ప్రోత్సహించడానికి, పోషించడానికి పాకిస్తాన్ భూభాగాన్ని ఏ విధంగా ఉపయోగిస్తారని నిలదీశారు.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయండి 05
సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ లేఖ





## కెనడా పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతం

- 343కుగాను 170 స్థానాలు గెలుచుకున్న పార్టీకి అధికారం
- కెనడా లిబరల్‌పార్టీ పెట్టుబడిగా మారిన ట్రంప్ నోటి దురుసు

**ఒట్టావా :** కెనడా పార్లమెంటుకు కీలకమైన పోలింగ్ ప్రక్రియ సోమవారంనాడు ముగిసింది. ఉదయం 8.30 గటలకు పోలింగ్ ప్రారంభమైంది. మంగళవారం సాయంత్రానికి తొలి ఫలితాలు వెలువడతాయి. మార్క్ కార్నీ అధికారం చేపట్టిన ఆరు వారాలకు ఈ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ట్రంప్ సుంకాల బెదిరింపులు, ఆర్థికపరమైన సమస్యలు, కష్టాలు కెనడాను చుట్టుముట్టిన తరుణంలో ప్రజల తీర్పు అత్యంత కీలకంగా మారనున్నది. కెనడా హౌస్ కామన్స్‌లో ఉన్న 343 స్థానాలకుగాను 170 స్థానాలు గెలుచుకున్నపార్టీకి అధికారం దక్కుతుంది. జస్టిన్ ట్రూడో సారథ్యంలో అధికార లిబరల్‌పార్టీ ప్రతిష్ఠ అడుగంటింది. కానీ ట్రంప్ నోటి దురుసుతనం తర్వాత ప్రజల్లో ఆ పార్టీకి మద్దతు పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని కార్నీ దేశంలో తరువాయి 2లో

## మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు శాంతి చర్చల కమిటీ

- ఏర్పాటు యోచనలో కమిటీ
- ఈ అంశంపై తదుపరి చర్చల బాధ్యత జానారెడ్డి, కేశవరావు చూస్తారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- మాజీ మంత్రి జానారెడ్డితో భేటీ



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు వీలుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక శాంతి చర్చల కమిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై పార్టీలో తదుపరి చర్చల బాధ్యతను మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకులు కె.జానారెడ్డి, మరో సీనియర్ నేత డాక్టర్ కె.కేశవరావు చూస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం మాజీ మంత్రి, పార్టీ తరువాయి 2లో

## తెలంగాణ రాష్ట్రానికి కెసిఆరే విలన్



- పాలనపై చర్చకు ఎక్కడికైనా వస్తాం
- మాజీ సిఎంకు ఫాంహౌజ్ దాటే ధైర్యముందా?
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సవాల్

ప్రజాపక్షం / హైదరాబాద్

'తెలంగాణ మొదటి, చివరి విలన్ కెసిఆర్. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన, 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చర్చకు సిద్ధం. సమయం, వేదిక బిఆర్‌ఎస్ నేతలే నిర్ణయించండి. చర్చకు ఎక్కడికి రమ్మన్న వస్తాం? కెసిఆర్‌కు ఫాంహౌస్ దాటి వచ్చే ధైర్యం ఉందా' అని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ సవాల్ చేశారు. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని నకిలీ గాంధీలు అనడం కెసిఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అని, కెసిఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనడానికి బిజెపిపై కెసిఆర్ రెండు నిమిషాల ప్రసంగమే నిదర్శనమన్నారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో తరువాయి 2లో

## లోకాయుక్త, ఉప లోకాయుక్తల ప్రమాణస్వీకారం

- లోకాయుక్తగా రాజశేఖర్‌రెడ్డి, ఉపలోకాయుక్తగా జగ్జీవన్ కుమార్‌తో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



ప్రజాపక్షం/హైదరాబాద్:

రాజ్ భవన్‌లో లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. సిఎం రేవంత్ రెడ్డి తో పాటు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ క్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లోకయుక్త, ఉప లోకాయుక్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. లోకయుక్తగా జస్టిస్ ఏ. రాజశేఖర్ రెడ్డి, ఉప లోకయుక్త గా జగ్జీవన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. చాలా కాలంగా ఖాళీగా ఉన్న తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉప లోకాయుక్త పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎ.రాజశేఖర్ రెడ్డి, ఉప లోకాయుక్తగా తరువాయి 2లో

## గీత దాటొద్దు




- పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై పార్టీకనుగుణంగా మాట్లాడాలి
- సిడబ్ల్యుసి తీర్మానంతో పాటు పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత, ఎఐసిసి ఆఫీస్ బేరర్ల అభిప్రాయాలు మాత్రమే పార్టీ వైఖరి
- కాంగ్రెస్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై పార్టీ వైఖరికి అనుగుణంగా మాట్లాడాలని లేదంటే మాట్లాడకుండా ఉండాలని తమ నాయకులకు కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. సున్నితమైన ఈ అంశంపై ఇటీవల జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానంతో పాటు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, నాయకులు రాహుల్‌గాంధీ, సంబంధిత ఎఐసిసి ఆఫీస్ బేరర్‌లు వెల్లడించిన అభిప్రాయాలు మాత్రమే పార్టీ వైఖరిగా పరిగణించాలని తెలిపింది. కాంగ్రెస్ నాయకులు విజయ్ వడిత్తివార్, మణిశంకర్ అయ్యర్, శశి థరూర్, తారిఖ్ హమీదా కర్రా, సైఫుద్దీన్ సోజ్‌లు చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ప్రతిపక్షంలో కొందరు నాయకులు 'పాకిస్తాన్ భాష' మాట్లాడుతున్నారని బిజెపి ఆరోపణ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇచ్చింది. పాకిస్తాన్ వ్యూహరచనతో జరిగిన పహల్గామ్ దాడి మన గణతంత్ర విలువలపై ప్రత్యక్ష దాడి అని సిడబ్ల్యుసి పేర్కొంది. నిఘా వైఫల్యాలను, భద్రత లోపాలను సమగ్రంగా పరిశీలించాలని కూడా విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ తరువాయి 2లో

## ఘనంగా 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం

రాష్ట్రపతి చేతుల మీదగా పురస్కారం అందుకున్న నాగేశ్వర్‌రెడ్డి (పద్మవిభూషణ్), బాలకృష్ణ (పద్మ భూషణ్), మాడుగుల నాగఫణిశర్మ (పద్మశ్రీ)



మాడుగుల నాగఫణిశర్మ (పద్మశ్రీ) | బాలకృష్ణ (పద్మ భూషణ్) | నాగేశ్వర్‌రెడ్డి (పద్మవిభూషణ్)

**న్యూఢిల్లీ :** తెలుగు సూపర్‌స్టార్ నందమూరి బాలకృష్ణ (బాలయ్య)సహా ముగ్గురు తెలుగు ప్రముఖులు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా సోమవారంనాడు పద్మ పురస్కారాలు అందుకున్నారు. ఎఐజి ఆసుపత్రి (ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ) చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి (వైద్యరంగం)కి పద్మవిభూషణ్, బాలకృష్ణ (సినీరంగం)కు పద్మభూషణ్, మాడుగుల నాగఫణిశర్మ (సాహిత్యరంగం)కు పద్మశ్రీ పురస్కారాలను రాష్ట్రపతి అందజేశారు. వీరితోపాటు వివిధ కేటగిరీల కింద 71 మంది దేశ ప్రముఖులకు తొలి విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్ దర్బార్‌హాలులో ఘనంగా జరిగింది. వీరిలో మొత్తం నలుగురుకి పద్మ విభూషణ్, తరువాయి 2లో



పర్యాటకులను సురక్షితంగా తిప్పిపంపలేకపోయాం 05
- జమ్మూ కశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన
- పహల్గామ్ దాడికి వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం

## 'శ్రీ చైతన్య' రాంగ్ రూట్

- రిజర్వేషన్ ర్యాంకును జనరల్ ర్యాంకుగా పబ్లిసిటీ
- జెఇఇ మెయిన్స్‌లో 17వ ర్యాంకు ఇంటర్మీడియట్ ఫెయిల్
- ధనార్జనే ధ్యేయంగా అడ్మిషన్ల మార్కెటింగ్


ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి




కరీంనగర్‌లోని శ్రీ చైతన్య కళాశాల రాంగ్ రూట్‌లో వెళ్తోంది. రిజర్వ్‌డ్ కేటగిరీ ర్యాంకును జనరల్ ర్యాంకుగా పబ్లిసిటీ చేసుకుంటోంది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో సదరు ర్యాంకర్ ఫెయిల్ అయినా ధనార్జనే ధ్యేయంగా మార్కెటింగ్ చేస్తోంది. విద్యార్థి ఫెయిల్ అయిన విషయాన్ని యాజమాన్యం దాచిపెట్టి విద్యా ప్రమాణాలను గాలికొదిలేసింది. నాణ్యమైన విద్య పేరుతో తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది. ర్యాంకులను పక్కన పెడితే కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించేంత విద్యను అందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కేవలం ర్యాంకులు, అడ్మిషన్లు , ఫీజులు, ధనార్జనే తరువాయి 12లో

## ఇరిగేషన్ పనులు వేగవంతం చేసి నల్లగొండను సస్యశ్యామలం చేస్తాం

- రాష్ట్రంలో పండించిన బియ్యం విదేశాలకు ఎగుమతి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేపట్టిన అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసి సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం అయన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని బక్కతాయి కుంట వద్ద రూ.20 కోట్ల 22 లక్షల అంచనాతో నిర్మించనున్న బక్కతాయ కుంట లిఫ్ట్ ఇరిగేషన్‌కు, రూ.6 కోట్ల 8 లక్షలతో నిర్మించే తరువాయి 12లో

## విజ్ఞప్తి

రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని రావినారాయణ రెడ్డి కాలనీ, ఫేస్–3లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 400 గుడిసెలు తగలబడటం జరిగింది. ఈ గుడిసెలలో బడుగు బలహీనవర్గాల ప్రజలు గుడిసెలు వేసుకొని బ్రతుకుతున్నారు. ఈ అగ్ని ప్రమాదం వలన వారి నిత్యావసర వస్తువులు, దాచుకున్న డబ్బులు, బట్టలు, పిల్లల విద్యా సర్టిఫికేట్స్ అన్ని కాలీ బూడిదైనాయి. వారందరూ దిక్కుతోచని స్థితిలో నిరాశ్రయులై వున్నారు. వీరికి మానవతాదృక్పథంతో వస్తురూపంలోనైన, డబ్బు రూపంలోనైన సహకారం అందించాలని విజ్ఞపి. దాతల వివరాలు ఎప్పటికప్పుడు ప్రచురించబడును

ఫోన్‌పే: 9866996737
(రవీంద్రాచారి, భాగ్యమ్మ)

– ఆందోజు రవీంద్రాచారి,
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



# ప్రపంచం
WORLD NEWS

## మే 7న కొత్త పోప్ ఎన్నిక సమావేశం

**లండన్ :** రోమన్ క్యాథలిక్స్ మతగురువును ఎన్నుకునేందుకు మే ఏడో తేదీన కార్డినల్స్ రహస్య సమావేశం జరుగుతుంది. ఈ తుది ఫలితాలు వెల్లడి కావడానికి సుమారు మూడు రోజులు సమయం పట్టవచ్చు. సిస్టైన్ ఛాపెల్ గదిలో జరిగే ఈ రహస్య సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుండి వచ్చే 135 మంది కార్డినల్స్ పాల్గొంటారు. కార్డినల్స్ అంతర్గత సమావేశం ఒక్కసారి ప్రారంభమైన తర్వాత కొత్త పోప్ ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకూ బాహ్య ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధాలు ఉండవు. వారంతా రహస్య బ్యాలెట్ ద్వారా కొత్త పోప్‌ను ఎన్నుకుంటారు. కార్డినల్స్ మొత్తం నాలుగుసార్లు కొత్త పోప్‌ను ఎన్నుకునేందుకు ఓటింగ్ చేసే అవకాశం ఉంటుంది. కొత్త పోప్ ఎన్నిక విజయవంతంగా పూర్తికాగానే వాటికన్ సిటీలో బయట పొగ గొట్టం నుండి తెల్లటి పొగ వెలువడుతుంది. పోప్ ఎన్నిక జరిగిందనడానికి ఇది సూచన. ఎన్నికల జరగకపోతే నల్లటి పొగ చిమ్నీ నుండి వస్తుంది. ఈ విషయం తెలుసుకోవడం కోసం బయట ఎంతోమంది ఆతృతగా ఎదురుచూస్తూ ఉంటారు.

### మే 8 నుండి 10 వరకూ

# ఉక్రేన్‌లో రష్యా కాల్పుల విరమణ



**మాస్కో :** ఉక్రేన్‌లో రెండు రోజుల పాటు రష్యా కాల్పుల విరమణ ప్రకటించింది. కుర్స్క్‌ను విముక్తి చేశామని, స్వాధీనం చేసుకున్నామని రష్యా ప్రకటించిన నేపథ్యంలో మే 8వ తేదీ అర్ధరాత్రి నుండి మే 10వ తేదీ అర్ధరాత్రి వరకూ ఉక్రేన్‌లో కాల్పుల విరమణ చేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. మాతృభూమికోసం జరిగిన గొప్ప యుద్ధంగా దీనిని ఆయన అభివర్ణించారు. 1942–45లో జర్మనీతో జరిగిన గొప్ప యుద్ధంతో కుర్స్క్‌లో జరిగిన యుద్ధాన్ని పుతిన్ పోల్చి చెప్పారు. అల్‌జజీరా వార్తాసంస్థ ఈ విషయం ప్రకటించింది. ఎందుకంటే మే తొమ్మిదో తేదీన రష్యాలో విజయోత్సవ సభ జరుగుతున్నది. ఈ సభకు ఉత్తర కొరియా సర్వాధినేత కిమ్ జోంగ్ కూడా హాజరవుతున్నారు. బహుశా ఆరోజున రెండు దేశాల సైనికులు ఉమ్మడి కవాతులు నిర్వహించి విజయోత్సవంలో పాల్గొంటారు. కుర్స్క్‌ను విముక్తి చేయడంలో ఉత్తర కొరియా సేనలు గొప్ప పాత్ర నిర్వహించాయని పుతిన్ ప్రశంసించారు. ఇక ఈ విజయోత్సవం తర్వాత ఎప్పుడైనా ఉత్తర కొరియా సేనలు రష్యా నుండి వైదొలగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కిమ్ జోంగ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌తో జరిగిన యుద్ధంలో మరణించిన ఉత్తర కొరియా వీరోచిత సైనికుల స్మృత్యర్థం ఒక స్మారక చిహ్నం నిర్మిస్తామని ప్రకటించారు. ఈ యుద్ధంలో పాల్గొన్న సైనికుల కుటుంబాలకు తమ దేశం ఎంతో ప్రాధాన్యం ఇచ్చి వారికి ప్రత్యేక రక్షణలు ఇస్తుందని కిమ్ చెప్పారు.

**క్రిమియా అచ్చంగా రష్యాకే?**

యుద్ధ ఒప్పందంలో భాగంగా క్రిమియా ప్రాంతాన్ని రష్యాకు స్వాధీనం చేసేందుకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరిస్తారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్రేన్‌లో శాంతి ఒప్పందానకి జెలెన్‌స్కీ, పుతిన్ చాలా చేరువలో ఉన్నారని ట్రంప్ కలవరిస్తున్న తరుణంలో ఆయన ఈ మేరకు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకసార్లు జెలెన్‌స్కీ ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించారు. వాటికన్‌సిటీలో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల సందర్భంగా జెలెన్‌స్కీతో ట్రంప్ సమావేశమై ఈ ఒప్పందం గురించే ఎక్కువగా చర్చించి ఉంటారని భావిస్తున్నారు. మరోవైపు జెలెన్‌స్కీ నుండి ఏదైనా శుభవార్త వస్తుందని రష్యా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నది. రష్యాతో ప్రత్యక్ష చర్చలకు ఉక్రేన్ ఏవైనా సంకేతాలిస్తుందని ఎదురుచస్తున్నట్లు రష్యా అధికార ప్రతినిధి దీమ్రీ పెస్కోవ్ చెప్పారు. వారు కనీసం ఏవైనా చర్యలన్నా తీసుకోవాలన్నారు. లేకపోతే ట్రంప్ ద్వారానైనా పరోక్ష సంకేతాలు వస్తాయని ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.



# ఉక్రేన్ యుద్ధంలో పాల్గొన్నాం

### కిమ్ ధృవీకరణ
### మీ త్యాగాలు ఎన్నటికీ మరచిపోం : పుతిన్



**మాస్కో :** ఉక్రేన్ చెర నుండి కుర్స్క్ ప్రాంతాన్ని విముక్తి చేసేందుకు తమ సైనిక బలగాలను రష్యాకు అండగా పంపామని ఉత్తరకొరియా ప్రభుత్వం సోమవారంనాడు అధికారికంగా మొదటిసారి ధృవీకరించింది. ఆదివారంనాడు రష్యా ప్రకటించింది. కుర్స్క్ ప్రాంతాన్ని విముక్తి చేయడంలో ఉత్తర కొరియా సైనికులు ఎంతగానో సహాయం అందజేశారని, వారి భాగస్వామ్యంతో రష్యా సైన్యాలు ఈ విజయం సాధించాయని మొదటిసారి రష్యా బహిరంగ ప్రకటన చేసిన ఒక రోజు తర్వాత ఉత్తర కొరియా కూడా దానిని ధృవీకరించింది. అదేవిధంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ కూడా ఒక ప్రకటనలో ఉత్తర కొరియాకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉక్రేన్ చేసిన త్యాగాలను ఎన్నటికీ రష్యా మరచిపోదని పేర్కొన్నారు. రష్యా భూభాగాన్ని తమ మాతృభూమిగా భావించిన ఉత్తర కొరియా సైనికులు ప్రాణ త్యాగాలతో రష్యాను రక్షించేందుకు కృషి చేశారని వెబ్‌సైటులో ఒక ప్రకటన పోస్టు చేశారు. ఉత్తరకొరియా హీరోయిజాన్ని, వారి త్యాగాలను రష్యా ప్రజలు ఎన్నటికీ మరచిపోరని పేర్కొన్నారు. ఈ విధంగా ఉక్రేన్–రష్యాలు పరస్పరం బహిరంగ ప్రకటనలతో ప్రశంసించుకున్నాయి. చారిత్రకంగా రష్యా–ఉత్తరకొరియా మధ్య ఉన్న బంధం గత ఏడాది సైనిక ఒప్పందంతో మరింత బలపడింది. ఐతే కుర్స్క్ ప్రాంతాన్ని విముక్తి చేశారన్న విషయాన్ని ఉక్రేన్ తిరస్కరించింది. ఇంకా పోరాటం కొనసాగుతోందని పేర్కొంది. తొలుత వెలువడిన సమాచారం ప్రకారం, ఉక్రేన్ యుద్ధంలో పాల్గొనేందుకు కిమ్‌జోంగ్ ప్రాథమికంగా 14,000 మంది సైన్యాలను పంపారు. ఐతే సుమారు 4,000 మంది కొరియా సైనికులు యుద్ధంలో మరణించారని జెలెన్‌స్కీ చెప్పారు. ప్రాణనష్టం తర్వాత మరో 3,000 మంది సైనికులను ఉక్రేన్‌పై యుద్ధానికి ఉత్తర కొరియా తరలించింది. అమెరికా ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం ఉక్రేన్ యుద్ధంలో 1,200 మంది ఉత్తర కొరియా సైనికులు మరణించారని అంచనా. కానీ అటు ఉత్తర కొరియాగానీ, ఇటు రష్యాగానీ ఎంతమంది ఉత్తర కొరియా సైనికులు యుద్ధంలో పాల్గొన్నారన్న విషయం ఇప్పటివరకూ ప్రకటించలేదు. ఉక్రేన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో ఉత్తర కొరియా సైన్యాలు, చైనా సైన్యాలు రష్యాకు సహకరిస్తున్నాయని, ఈ రెండు దేశాల సైన్యాలూ రష్యా తరపున యుద్ధంలో పాల్గొంటున్నాయని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అనేకసార్లు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను రష్యా ఏనాడూ ఖండించలేదు. కానీ చైనా మాత్రం ఉక్రేన్ అధ్యక్షుడు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. తమ దేశం ఎప్పుడూ శాంతికి, ప్రాదేశిక సమగ్రతలకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది.

## వచ్చే ఏడాది జూన్‌లోపు బంగ్లా ఎన్నికలు

### మహ్మద్ యూనుస్

**ఢాకా :** వచ్చే ఏడాది జూన్ లోపు బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయని ఆ దేశా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు మహ్మద్ యూనుస్ చెప్పారు. మొన్నటివరకూ దేశంలో ఎన్నికలు వచ్చే జనవరిలోపు లేదా డిసెంబరు లోపు అని చెబుతూ వచ్చిన యూనుస్ ఇప్పుడు కొత్తరాగం అందుకున్నారు. ఎన్ని సంస్కరణలను ఎక్కువమంది అంగీకరిస్తున్నారు లేదా అంగీకరించడంలేదు అనే విషయంపైనే ఎన్నికల గడువు ఆధారపడి ఉంటుందన్నారు.

సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధన పరిధి ఎక్కువగా ఉంటే ఎక్కువ సమయం పడుతుందన్నారు. ఈ పరిధిని కుదించగలిగితే రాబోయే డిసెంబరు నెలలోనే ఎన్నికలు జరుగుతాయని అల్ జజీరా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యూనుస్ చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడితే వచ్చే ఏడాది జూన్ లోపు పార్లమెంటు ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. దేశంలో పార్లమెంటుకు తదుపరి జరిగే ఎన్నికలు బంగ్లాదేశ్ చరిత్రలో ఎన్నడూలేనంత అత్యుత్తమ స్థాయిలో నిర్వహించాలని సంకల్పించామనీ, అందుకు తగినట్లు ఏకాభిప్రాయసాధన, ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అవామీలీగ్‌ను ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతిస్తున్నారా? అని ప్రశ్నించగా ఆ విషయం తనకు తెలియదనీ, ఇప్పటివరకూ వారు స్పందించలేదనీ, దీనిపై ఎన్నికల సంఘం ఇతరులు ఎలా స్పందిస్తారో చూడాలన్నారు. తాతాల్కి ప్రభుత్వ పాలనాగడువు పూర్తయిందా? అని ప్రశ్నించగా తాత్కాలిక ప్రభుత్వమే ఇప్పటికీ ఇంకా తమ సమస్యలకు ఒక మంచి పరిష్కారంగా ఉందని ప్రజలు భావిస్తున్నారన్నారు. తాత్కాలిక ప్రభుత్వం పదవిలో ఉండకూడదని ఎవ్వరూ కోరుకోవడంలేదన్నారు.

## పిఎల్ఒ కొత్త నాయకుడు హుస్సేన్ అల్ షేక్

**రమల్లా :** పాలస్తినా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ వయోవృద్ధుడైపోతూ ఉండటంతో తన స్థానంలో కొత్త నాయకుడి పేరును ఆయన ప్రతిపాదించారు. తన తర్వాత వారసుడుగా ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా హుస్సేన్ అల్ షేక్‌ను నియమించారు. దీర్ఘకాలంగా హుస్సేన్ షేక్ ఆయన వద్ద పనిచేస్తూ అపార అనుభవం గడించారు. ఐతే పాలస్తినా లిబరేషన్ ఆర్గనైజేషన్ తరపున ఆయనే ఖచ్చితంగా తదుపరి అధ్యక్షుడు అవుతాడన్న హామీ కూడా ప్రస్తుత పరిస్థితులలో లేదు. ఐతే ఆయన అధ్యక్ష బాధ్యతలు చేపట్టే విషయంలో ప్రధాన పోటీదారుడుగా ముందుపీఠిన ఉండే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుత అధ్యక్షుడు అబ్బాస్‌కు 89 సంవత్సరాల వయసు. పాలస్తినా ప్రజలకు నిజమైన అధీకృత వ్యవస్థగా ప్రపంచవ్యాప్తంగా పిఎల్ఓకు గుర్తింపు ఉంది. పిఎల్ఒ కార్యనిర్వాహకవర్గంలో 16 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో అల్ షేక్ కూడా ఒకరు. మరోవైపు గాజాలో ఆహార కొరతవల్ల ప్రజలు కరువు పరిస్థితుల్లోకి వెళ్ళిపోయారు. మార్చి రెండో తేదీ నుండి పాలస్తినాలోకి ఆహారం, ఇతర సరఫరాలు రాకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటున్నది. పాలస్తినాలో 20 లక్షలమంది ప్రజలు బయట దేశాల నుండి వచ్చే ఆహార సరఫరాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

## యెమెన్‌లో అమెరికా దాడి

### 68 మంది ఆఫ్రికా శరణార్థులు మృతి

**సనా :** యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా అమెరికా చేసిన తాజా దాడుల్లో 68 మంది మరణించారు. ఐతే వీరంతా ఆఫ్రికాకు చెందిన వలస శరణార్థులు. వీరందరికీ హౌతీలు శరణార్థ శిబిరంలో ఆశ్రయం కల్పించారు. అమెరికా సోమవారం చేసిన దాడుల్లో ఈ వలస ప్రజలు మరణించారు. హౌతీల ఆధీనంలో ఉన్న వాయువ్య యెమెన్‌లో జరిగిన ఈ దాడుల్లో మరో 40 మంది గాయపడ్డారు. ధ్వంసమైన భవంతులు, ఆ శిథిలాల్లో మరణించి పడి ఉన్న ప్రజలు, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలిస్తున్న దృశ్యాలను అల్ మషీరా ఛానల్ చూపించింది. ఐతే ఈ చర్యపై ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగం, అమెరికా సైనికవర్గాలు వెంటనే ఎలాంటి ప్రకటనలూ చేయలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఆదేశాల మేరకు మార్చి 15వ తేదీ నుండి యెమెన్‌లోని హౌతీలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటివరకూ 800 హౌతీ లక్ష్యాలను దెబ్బతీశామని అమెరికా సైన్యం ప్రకటించిన కొద్ది గంటలకే హౌతీలవైపు నుండి ఈ వార్తలు వెలువడ్డాయి. ఇదిలా ఉండగా బీరూట్ లక్ష్యంగా ఇజ్రాయెల్ కూడా సోమవారంనాడు దాడులు చేసింది.



**ఇజ్రాయెల్ దాడిలో 27 మంది మృతి**

గాజాలో ఇజ్రాయెల్ సోమవారం చేసిన దాడుల్లో 27 మంది మరణించారు. ఏప్రిల్‌నెలలో ఇజ్రాయెల్ సైన్యం విరామం లేకుండా రోజువారీ దాడులు చేస్తూ కనీసం 20 లేదా 30 మంది పాలస్తీనియన్లను చంపుతున్నది. మరోవైపు మార్చి రెండో తేదీ నుండి ఇజ్రాయెల్ సైన్యం అమలు చేస్తున్న ఆంక్షల కారణంగా గాజా ప్రాంతంలో ఇరవై లక్షలమంది ప్రజలు నీరు, ఆహారం లేక అల్లాడుతున్నారు. వారు ఆహారంకోసం వేటాడుతున్నారు. బయట నుండి సరఫరాలు రాకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుపడి కరువు పరిస్థితులు సృష్టించింది. ఇది ఇజ్రాయెల్ యుద్ధ వ్యూహంలో ఒక భాగమని పాలస్తినా ప్రభుత్వం విమర్శించింది.

## కెసిఆరే విలన్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి కెసిఆర్‌కు గుండెల్లో గుబులు మొదలైందన్నారు. కెటిఆర్, హరీష్‌రావు, కవిత ఆడుతున్న మూడు ముక్క లాటతో కెసిఆర్‌కు మతి భ్రమించిందని, తెలంగాణ రాజకీయాల్లో కెసిఆర్ శకం ముగిసిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పోతే దరిద్రం పోయిందని ప్రజలు ఆనందం గా ఉన్నారన్నారు. కెసిఆర్ హయంలో తెలంగాణ అన్ని రంగాల్లో విధ్వంసం పాలైందని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కెసిఆర్ కుటుంబం దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, దేశ చరిత్రలో అతి తక్కువ కాలంలో ఎక్కువ దోచుకున్న కుటుంబం కెసిఆర్‌దేనని విమర్శించారు. తెలంగాణలో ఆర్థిక విధ్వంసం సృష్టించి పలాయనం చిత్తగించిన కెసిఆర్ మాటల్ని ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చిన కెసిఆర్‌కు జన్మభూమి పేరిట తెలంగాణ పేరు పలకడం విడ్డూరమన్నారు. ఉద్యమ జెండాను దింపితే రాళ్లతో కొట్టి చంపండి అన్న కెసిఆర్‌కు పదేళ్లలో అమరవీరులు త్యాగం, ఉద్యమకారులు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ బిక్షతో కెసిఆర్ సిఎం అయ్యారని, తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం, తెలంగాణ సెంటి మెంట్‌ను వాడుకోవడం కెసిఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రైతుబంధు పేరుతో దళారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూములు కెసిఆర్ అండ్ కో అప్పనంగా దోచిపెట్టారన్నారు.

లాభాల్లో ఉన్న తెలంగాణాను రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన కెసిఆర్‌ను ప్రజలు క్షమించరన్నారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, రజతోత్సవ సభలో జనాల కంటే విస్కీలు ఎక్కువ ఉన్నాయని, సభలో అసలు మహిళలే కనిపించలేదని, వరంగల్ సభలో కెసిఆర్ ప్రసంగంలో పసలేదని, బిసి కుల గణన, ఎస్‌సి వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కెసిఆర్ ఎందుకు నోరు మెదపలేదని మహేష్‌కుమార్ ప్రశ్నించారు. కుటుంబ కొట్లాట వేగలేక రజతోత్సవ సభ పేరిట కెసిఆర్ హంగామా చేసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. టిఆర్ఎస్ పార్టీ పేరులోంచి తెలంగాణ పదాన్ని తొలగించినపుడు కన్నతల్లిని జన్మభూమిని మించిన స్వర్గం లేదనే మాట కెసిఆర్‌కు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బిజెపిపై కెసిఆర్ విమర్శలు నెమలి పిచ్చంతో కొట్టినట్లు ఉందని మహేష్‌కుమార్ అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కుట్ర పన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయన్నారు. కెసిఆర్ ప్రసంగంతో బిజెపి, బిఆర్ఎస్ ఒకటేనని మరోసారి రుజువైందన్నారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చి జాతీయ స్థాయిలో రాష్ట్రంలో అస్తిత్వం కోల్పోయిన కెసిఆర్ అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని దోచుకుని బిజెపికి సాగిలపడి రాష్టానికి తీవ్ర అన్యాయాలు చేశారన్నారు. కెసిఆర్ పది ఏళ్లలో చేయాలేనిది కాంగ్రెస్ 15 నెలల్లో చేసి చూపిందని, బిఆర్ఎస్ పదేళ్లలో 60 వేల ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో 60 వేల కుపైగా ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల గణన, ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, సన్న బియ్యం పంపిణీని అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలతో మహిళలు సంతోషంగా ఉన్నారని, అందుకే మహిళలు బిఆర్ఎస్ మీటింగ్‌కు రాలేదన్నారు.

## మీ స్పందనేంటీ?

(మొదటి పేజీ తరువాయి)

మోపబడుతున్నాయి అని జస్టిస్ బిఆర్.గవాయ్ జ్యుడీషియరీపై ఇటీవలి ఆరోపణల దాడులను స్పష్టంగా ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరై తన వాదనలు వినిపించారు. ప్రభుత్వం దీనిని వ్యతిరేక వ్యాజ్యంగా పరిగణించడం లేదని ధర్మాసనానికి స్పష్టం చేశారు.'దయచేసి ఇక్కడ పర్యవేక్షించండి. 'వాక్‌స్వాతంత్ర్యాన్ని సమతుల్యం చేసే ఆర్టికల్ 19 (2) ఏదైతే ఉందో దాని పట్ల తగిన జాగ్రత్త వహించడం ద్వారా మేము బయటకు వస్తాం' అని తుషార్ మెహతా అన్నారు.

కొన్ని విషయాలు అసభ్యకరమైనవే కాకుండా 'వికృతమైన వక్రబుద్ధితోకూడినవి' కూడా అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. దీనికి సంబంధించి కొన్ని నిబంధనలు ఉనికిలో ఉన్నప్పటికీ మరికొన్ని ఆలోచనలు కూడా ఉన్నాయన్నారు. పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాది విష్ణు శంకర్ జైన్ వాదిస్తూ ఇది విరుద్ధ వ్యాజ్యం కాదని, ఓటిటి, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌లో లైంగిక అసభ్యకరమైన కంటెంట్ ప్రసారంపై నిషేధం విధించాలని లేవనెత్తిన 'ఒక తీవ్రస్థాయి ఆందోళన' అని అన్నారు. ఆ కంటెంట్‌ను ఎలాంటి తనిఖీలు లేకుండా, పరిమితులు విధించకుండా ప్రదర్శించబడుతున్నాయని పిటిషనర్ల న్యాయవాది విష్ణు శంకర్ జైన్ చెప్పారు. దీనిపై జస్టిస్ బిఆర్.గవాయ్ స్పందిస్తూ 'మిస్టర్ సొలిసిటర్, దీనిపై మీరు ఏదో ఒకటి చేయాలి' అని మెహతాకు చెప్పారు.

సొలిసిటర్ జనరల్ మాట్లాడుతూ ఈ రోజుల్లో పిల్లలు వీటిని ఎక్కువగా బహిర్గతం చేస్తున్నారని చెప్పారు. కొంత కంటెంట్ వికృతంగా ఉన్న మాట వాస్తవమేనని అంగీకరిస్తూ గౌరవనీయ వ్యక్తులు కూడా కలిసి కూర్చుని చూడలేరని తుషార్ మెహతా ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కార్యక్రమాలు కేవలం 18ఏండ్ల వయసు పైబడిన వారికి మాత్రమే కానీ వాటిని నియంత్రించలేకపోతున్నామన్నారు. ఈ సందర్భంగా ధర్మాసనం పిల్లలు సెల్‌ఫోన్లు వాడటాన్ని ప్రస్తావించింది. 'వారు (పిల్లలు) బాగా సెల్‌ఫోన్లకు అలవాటు పడ్డారు. వారు సరైన వెబ్‌సైట్‌కు చేరుకుంటే మంచిదే' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి సమాధానమిచ్చారు. ధర్మాసనం 'ఆ విషయమై చివరితేదీన' మనం పిటిషనర్ల న్యాయవాది జైన్‌కు చెప్పాము. ఇది లెజిస్లేచర్ లేదా ఎగ్జిక్యూటివ్‌కు సంబంధించినది' అని గుర్తుచేసింది. ఇటీవల ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్, బిజెపిఎంపి నిషికాంత్ దూబె ఇరువురూ న్యాయవ్యవస్థ శాసన, కార్యనిర్వాహక వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్నదని న్యాయవ్యవస్థపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయడాన్ని ధర్మాసనం స్పష్టంగా ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది.అనంతరం కేంద్రానికి, ఓటిటి, సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్స్, ఇతరులకు నోటీసులు జారీచేయాలన్న పిటిషన్ల అభ్యర్థనలపై స్పందించాలని నోటీసులు జారీచేయనున్నట్లు ధర్మాసనం చెబుతుండగా ఇతరులకు నోటీసులు జారీచేయాల్సిన అవసరం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి విన్నవించగా వారిని కోర్టు ముందు ఉండనివ్వండి అని జస్టిస్ బిఆర్.గవాయ్ చెప్పారు. వారిపై కూడా సామాజిక బాధ్యత ఉంది కదా అని జస్టిస్ గవాయ్ అన్నారు.

## ఎన్నికలు ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

ఆకస్మిక ఎన్నికలు ప్రకటించారు. కెనడాదేశాన్ని అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని, కెనడాదేశ ప్రజలు అందుకు ఎంతగానో సుముఖంగా ఉన్నారనీ ట్రంప్ అధికారంలోకి వచ్చాక నోరుపారేసుకున్నారు. దీంతో ఈ ఎన్నికల ప్రచారంలో అధికారపార్టీ దీనిని ప్రధానాంశంగా చేసుకుని ప్రయోజనం పొందుతున్నది. కెనడా ప్రజలు దేశ ఐక్యతారాగం వినిపిస్తున్నారు.

2015 నుండి రెండు విడతలుగా అధికారంలో కొనసాగుతున్న లిబరల్‌పార్టీ ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఈ ఏడాది జనవరిలో పదవికి రాజీనామా చేశారు. ఐతే 2023 నుండి దేశంలో పుంజుకుంటున్న కన్జర్వేటివ్‌పార్టీ ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత వెనకబడింది. ట్రంప్ ప్రకటనల జోరుతో లిబరల్ పార్టీ ఒపీనియన్ పోల్స్‌లో భారీస్థాయిలో ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మార్చుకుని తన రేటింగ్ పెంచుకోవడం ప్రారంభించింది. అందువల్ల ఈ పార్టీకే ఎన్నికల్లో ఎక్కువ గెలుపు అవకాశాలు కనిపిస్తున్నాయని అంచనావేస్తున్నారు. కన్జర్వేటివ్‌పార్టీ తరపున పియర్ పోయిలీవ్రే, ఫెడరల్ పొలిటికల్ పార్టీ బ్లాక్ క్యుబెకోయిస్ పార్టీ తరపున వైవ్స్–ఫ్రాంకోయిస్ బ్లాంఛెట్‌లు ప్రధానమంత్రి పదవికోసం మార్క్ కార్నీతో పోటీపడుతున్నారు. 2021 సెప్టెంబరులో జరిగిన ఫెడరల్ ఎన్నికల్లో లిబరల్‌పార్టీ (ఎల్‌పిసి) కి 160 సీట్లు, 32.62 శాతం ఓట్లు లభించగా ప్రస్తుతం ఆ పార్టీ తరపున 152 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు. గత ఎన్నికల్లో 119 స్థానాలు గెలుచుకున్న కన్జర్వేటివ్‌పార్టీ (సిపిసి) ఈసారి గట్టి పోటీ ఇస్తోంది. బ్లాక్ క్యుబెకోయిస్‌పార్టీ (క్యూబి) కి 2021లో 32 సీట్లు మాత్రమే లభించాయి. ప్రస్తుత ప్రధానమంత్రి మార్క్ జోసెఫ్ కార్నీ ఆర్థిక రంగ నిపుణుడు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల ప్రకటన చేశారు. ట్రంప్‌కు తగిన గుణపాఠం చెబుతామని ప్రతిజ్ఞ చేశారు.

## మాపై నిందలా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్షళన చేశామని, అధికారుల విషయంలో కొంత సమన్వయం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు అధికారులు సంపాదన మార్గంగా ఉన్నారని, అలాంటి వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా వివిధ అంశాలపై పట్టు ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. భూభారతి, ధరణి అంశాలపై నవీన్ మిట్టల్‌కు పూర్తి అవగాహన ఉందని సిఎం ఉదహరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారుఎంఎల్‌ఎలు ప్రజల్లోకి వెళ్ళండి

కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు ప్రజల్లోకి వెళ్లాలని, వారు వెళితేనే ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళతాయని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సిఎల్‌పిలో చెప్పినా ఎంఎల్‌ల పనితీరు మారలేదని, ఎంఎల్‌ఎలు హైదరాబాద్ చుట్టూ తిరగడం సరైంది కాదన్నారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయని అన్నారు. తనను నమ్మిన వారికి వెన్నంటి ఉంటానని, నమ్మని వారి బాధ్యత తనపై ఉండదన్నారు. కొంత మంది పార్టీ నాయకులకు పదవులు రాలేదని నోరుజారుతున్నారని, అలాంటి వాళ్లకు అవకాశాలు ఉండవని, ఇష్టానుసారంగా మాట్లాడితే నేతలే నష్టపోతారని సిఎం హెచ్చరించారు. తాను ఇంకా 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటానని, కమిట్మెంట్ ఇస్తే చేసి తీరుతానన్నారు. అద్దంకి దయాకర్కు ఎంఎల్‌సి ఇస్తానని చెప్పానని, అనుకున్న ప్రకారమే ఇప్పించానన్నారు. కెసిఆర్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు తాను వెళ్లి పరామర్శించానని, ఎవరూ చావును కోరుకోరు కదా అన్నారు. అరెస్టుల విషయంలో తొందరపడితే ఎపిలో ఏం జరిగిందో చూశామని సిఎం వ్యాఖ్యానించారు.

## శాంతి చర్చల కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ నాయకులు, 2005లో నక్సలైట్లతో జరిపిన చర్చలలో క్రియాశీల పాత్ర పోషించిన కె.జానారెడ్డితో సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కేశవరావు కూడా పాల్గొన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చల పునరుద్దరణ, కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రక్రియకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలు, ఆపరేషన్ కగార్ తదితర కీలక అంశాలపై సిఎం రేవంత్‌రెడ్డి వారితో చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో మావోయిస్టులతో శాంతి చర్చల పునరుద్ధరణ, కాల్పుల విరమణ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులతో చర్చలు జరిగినప్పుడు హోంమంత్రిగా పనిచేసిన జానారెడ్డి అనుభవాన్ని ఈ సందర్భంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. శాంతి చర్చల కమిటీ ప్రతినిధులతో ఆదివారం జరిగిన సమావేశంలోనే జానారెడ్డి సలహాలు తీసుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే తాజా భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో శాంతి చర్చల సమయంలో ఉమ్మడి ఎపి కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా ఉన్న దిగ్విజయ్ సింగ్‌తో కూడా సిఎం రేవంత్ ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. మావోయిస్టుల సమస్యను కేవలం శాంతిభద్రతల సమస్యగా కాకుండా సామాజిక సమస్యగా పరిగణిస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

**ఆపరేషన్ కగార్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి**

'ఆపరేషన్ కగార్'పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని, ఈ విషయంపై పార్టీలో జాతీయ విధానం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జానారెడ్డిలతో శాంతి చర్చలపై సమావేశం అనంతరం ఆయన తనను కలిసిన మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ సరిహద్దుల్లో గత కొన్ని రోజులుగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలపై రేవంత్‌రెడ్డి తీవ్రంగా అభ్యంతరం తెలిపారు.

రేవంత్‌రెడ్డితో ఆదివారం భేటీ అయిన శాంతి చర్చల కమిటీ సభ్యులు మావోయిస్టులతో శాంతి చర్చలు, ఆపరేషన్ కగార్‌కు సంబంధించిన పలు విషయాలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయడానికి తమ కేబినెట్‌లోని మంత్రులతో చర్చించిన తర్వాతే ఓ నిర్ణయానికి వస్తామని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## గీత దాటొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరామ్ రమేశ్ మాట్లాడుతూ సిడబ్ల్యుసి 2025 ఏప్రిల్ 24న సమావేశమై పహల్గామ్‌లో దారుణ ఉగ్రదాడిపై తీర్మానం చేసిందని గుర్తు చేశారు. అదే రోజు సాయంత్రం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు పార్టీ అభిప్రాయాలను వ్యక్తం చేశారని తెలిపారు. కొంత మంది కాంగ్రెస్ నాయకులు తామంతట తాముగా మీడియాతో మాట్లాడారని, వారు కాంగ్రెస్ అభిప్రాయాలను ప్రతిబింబించలేదని చెప్పారు. అత్యంత సున్నితమైన ప్రస్తుత సమయంలో సిడబ్ల్యుసి తీర్మానం, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ అభిప్రాయాలు, అధీకృత ఎఐసిసి ఆఫీస్ బేరర్ల అభిప్రాయాలు మాత్రమే పార్టీ వైఖరిగా భావించాలని పేర్కొన్నారు. ఈ మేరకు జైరామ్ రమేశ్ సోమవారం నాడు తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. తరువాత ఆయన పిటిఐతో మాట్లాడుతూ పరిస్థితులను బట్టి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు పార్టీ వైఖరిని తెలియపరుస్తుంటారని, ఇతర నాయకులు పార్టీ వైఖరిని వ్యక్తం చేయాలని లేదంటే సున్నితమైన ఈ అంశంపై వ్యాఖ్యానించకుండా ఉండాలని అన్నారు.

## అవార్డుల ప్రదానోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

పదిమందికి పద్మభూషణ్ పురస్కారాలు అందజేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితర ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది జనవరి 25వ తేదీన కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాలకు చెందిన మొత్తం 139 మంది దేశ ప్రముఖులకు పద్మ అవార్డులు ప్రకటించగా, మిగిలినవారికి మలి విడతలో అందజేస్తారు. మరణించిన ప్రముఖులు సుజుకీ మోటార్స్ మాజీ అధిపతి ఒసాము సుజుకీ (పద్మ విభూషణ్), ప్రముఖ గాయకుడు పంకజ్ ఉద్ధాస్ (పద్మభూషణ్), బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్‌మోదీ (పద్మభూషణ్)ల తరపున వారి బంధువులకు ఈ పురస్కారాలు అందజేశారు. మలయాళ రచయిత, చిత్ర దర్శకుడు ఎం.టి.వాసుదేవన్ నాయర్ (మరణానంతరం)కు పద్మవిభూషన్ అవార్డు లభించింది. ప్రముఖ నటుడు శేఖర్ కపూర్, వాయులీన కళాకారుడు లక్ష్మీ నారాయణ సుబ్రమణియం, మాజీ హాకీ ఆటగాడు పి.ఆర్.శ్రీజేశ్,తమిళ నటుడు ఎస్.అజిత్‌కుమార్, పంకజ్ పటేల్ (ఛైర్మన్, జైడస్ లైఫ్ సైన్సెస్),భారత్–అమెరికన్ ఇంజనీరు వినోద్ ధామ్‌లకు పద్మవిభూషణ్ పురస్కారాలు అందజేశారు.

## ప్రమాణస్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

బిఎస్ జగ్జీవన్ కుమార్, హెచ్‌ఆర్‌సి ఛైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్, హెచ్‌ఆర్‌సి సభ్యులుగా శివాడి ప్రవీణ, బి.కిషోర్ను నియమించింది. ఈ మేరకు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా వీరి నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలకు గత శనివారం గవర్నర్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే



# జనరల్

STATE & REGIONAL NEWS

## ఎంసిఆర్‌హెచ్ఆర్‌డి వైస్ చైర్‌పర్సన్‌గా శాంతికుమారి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మరో రెండు రోజుల్లో (ఈనెల 30న) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ పొందనున్న శాంతికుమారిని హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిఆర్‌హెచ్ఆర్‌డి) వైస్ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమించింది. ఎంసిఆర్‌హెచ్ఆర్‌డి డైరెక్టర్ జనరల్ (డిజి)గా అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(పొలిటికల్) కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈనెల 30వ తేదీతో పదవీవిరమణ పొందనుండగా, కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుత ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. దీంతో పదవీవిరమణ పొందుతున్న శాంతికుమారిని ఎంసిఆర్‌హెచ్ఆర్‌డి వైస్ ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

## భూదాన్ భూముల కుంభకోణంలో..
# కదులుతున్న డొంక



రియల్టర్ల ఇళ్లపై ఇడి దాడులు
ఐఎఎస్, ఐపిఎస్, బిఆర్‌ఎస్ నేతలపై ఆరోపణలు
తెలంగాణలో బయటపడ్డ అతి పెద్ద కుంభకోణం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూదాన్ భూముల కుంభకోణం కేసులో డొంక కదులుతోంది. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు సోమవారం రంగారెడ్డి, హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్ల ఇళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్, యాకుత్‌పురా ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో అనేక కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను ఇడి అధికారులు సేకరించారు. ఈ కేసులో ఇడి అధికారులు రూ.1.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు రూ.2.89 కోట్లు విలువైన బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. దాడుల సమయంలో పాతబస్తీలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇడి దాడులని తెలియగానే అంద రు ఊపిరి పీల్చుకున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న 103 ఎకరాల భూదాన్ భూముల అక్రమ విక్రయాలకు సంబంధించినది. ఈ భూములు అసలు బూదాన్ యజ్ఞ బోర్డు ఆధీనంలో ఉండగా, అవి అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించబడ్డాయి. ఈ భూముల విలువ అనేక కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ఈ ఉదంతంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు, ప్రైవేట్ దెవలపర్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ భూముల విక్రయాల్లో నకిలీ పత్రాలు సృష్టించి, అవి ప్రభుత్వ భూములుగా చూపించి, ప్రైవేట్ కంపెనీలకు విక్రయించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఐఎఎస్ అధికారి డి. అమోయ్ కుమార్, అప్పటి తహసీల్దార్ ఆర్.పి. జ్యోతి, ఆర్డీవో వెంకటాచారి తదితరులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అలాగే బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ మర్రి జనార్దన్ రెడ్డి, వంశీరాం బిల్డర్స్ సుబ్బారెడ్డి, ఇతర దెవలపర్లు కూడా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇడి ఇప్పటికే వారికి నోటీసులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఈ కేసులో జోక్యం చేసుకుని, భూదాన్ భూముల విక్రయాలపై స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసింది. అలాగే, ప్రభుత్వం ఈ కేసును పరిశీలించడానికి ముగ్గురు ఐఎఎస్ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. భూదాన్ యజ్ఞ బోర్డు కూడా స్వతంత్ర విచారణ ప్రారంభించి, సంబంధిత భూములపై పట్టా పాస్‌బుక్‌లను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

ఈ కేసు ప్రస్తుతం విచారణలో ఉంది. ఇడి, భూదాన్ యజ్ఞ బోర్డు, తెలంగాణ హైకోర్టు చర్యల ఆధారంగా, భవిష్యత్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. రంగారెడ్డి జిల్లా నాగారం పరిధిలోని సర్వే నంబర్ 181, 182లో ఉన్న 102.2 ఎకరాల భూదాన్ భూములపై వివాదం నెలకొంది. ఈ భూముల్లో 50 ఎకరాలు భూదాన్ బోర్డుకు చెందినవిగా పేర్కొనబడినప్పటికీ, అవి ఖాదురున్నీసా అనే మహిళ పేరుతో రిజిస్ట్రేషన్ చేయబడినట్లు ఇడి గుర్తించింది. ఈ ప్రక్రియలో ఆర్డీవో, తహసీల్దార్, ఇతర అధికారులు అన్యాయంగా వ్యవహరించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇడి దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**భూములు కొనుగోలు చేసిన అధికారుల పూర్తి జాబితా**

1) బత్తుల హేమలత (C/o బత్తుల శివధర్ రెడ్డి ఐపిఎస్ 20 గుంటలు)
2) ప్రియాంక రతన్ (C/o దివంగత రాజీవ్ రతన్ ఐపిఎస్ 16 గుంటలు)
3) రవి గుప్త (ఐపిఎస్ 16 గుంటలు)
4) ముదిరెడ్డి నితీష్ రెడ్డి (S/o మహేందర్ రెడ్డి ఐపిఎస్ 20 గుంటలు)
5) తాటిపర్తి పావని రావు (C/o టి.ప్రభాకర్ రావు ఐపిఎస్ 16 గుంటలు)
6) రేఖ షరాఫ్ (C/o ఉమేష్ షరాఫ్ ఐపిఎస్ 16 గుంటలు)
7) రాజర్షి సాహా (ఐపిఎస్ 8 గుంటలు)
8) స్వాతి లక్రా (ఐపిఎస్ 16 గుంటలు)
9) మిట్టీ సతితి సుహానా (C/o మిట్టీ శ్రీనిబసు 8 గుంటలు)
10) నందిని మాన్ (C/o విక్రమ్ సింగ్ మాన్ ఐపిఎస్ 8 గుంటలు)
11) డాక్టర్ జ్ఞాన్ ముద్ర (C/o సోమేష్ కుమార్ IAS 20 గుంటలు)
12) బి.కె. రాహుల్ హెగ్డే (స్వయం8 గుంటలు)
13) సవ్యసాచి ప్రతాప్ సింగ్ (C/o గోవింద్ సింగ్ 8 గుంటలు)
14) జి. ఓం అనిరుధ్ (C/o సుధీర్ బాబు ఐపిఎస్ నాట్ స్పెసిఫైడ్)
15) ఇందు రావు కావేటి (C/o లక్ష్మీ నారాయణ రావు కావేటి 16 గుంటలు)
16) న్యాలకొండ సింధు రెడ్డి (C/o న్యాలకొండ ప్రకాష్ రెడ్డి20 గుంటలు)
17) ఐశ్వర్య రాజ్(C/o వికాస్ రాజ్ 20 గుంటలు)
18) వెన్నవెల్లి రాధిక(C/o కమలాసన్ రెడ్డి 16 గుంటలు)
19) రీతా సుల్తానా (C/o సందీప్ కుమార్ సుల్తానా 20 గుంటలు)
20) వసుంధర సిన్హా (C/o అంజనీ కుమార్ 20 గుంటలు)
21) ముత్యాల వినీల (C/o స్టీఫెన్ రవీంద్ర ఐపిఎస్ 8 గుంటలు)
22) అజిత్ కుమార్ మొహంతి (C/o ఖేస్త్రబాసి మొహంతి 20 గుంటలు)
23) నవీన్ మిట్టల్ (సెల్ఫ్ 20 గుంటలు)
24) సౌమ్య మిశ్రా (సెల్ఫ్ 16 గుంటలు)
25) రాహుల్ బుసి రెడ్డి (S/o బి. జనార్దన్ రెడ్డి ఐఎఎస్ 16 గుంటలు)
26) తరుణ్ జోషి (సెల్ఫ్ ఐపిఎస్ 16 గుంటలు)
27) పీర్ల వరుణ్ (పీర్ల విశ్వ ప్రసాద్ 16 గుంటలు)
28) తోట శ్రీనివాసరావు (S/o తోట సాయి బాబా ఐపిఎస్ నాట్ స్పెసిఫైడ్)
29) కొండూరు శ్రీనాథరాజు (S/o కొండూరు సత్యనారాయణ 20 గుంటలు)
30) మహేష్ భగవత్ (సెల్ఫ్16 గుంటలు)
31) రేణు గోయల్ (కమాండర్ జితేందర్ కుమార్ గోయల్ 20 గుంటలు)
32) అజయ్ జైన్ (సెల్ఫ్ 20 గుంటలు)
33) అమిత కుమార్ (C/o అనిల్ కుమార్ 20 గుంటలు)

## మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు
## రూ.10 వేల వేతనం వెంటనే అమలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు రూ.10 వేల వేతనం వెంటనే అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వంతీసుకువస్తున్న 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20వ తేదీన జరిగే సమ్మెలో వంట కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం సోమవారం హైదరాబాద్ లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేమపావని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కేవలం రూ.3వేలు మాత్రం వేతన ఇవ్వడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వమైతే కేవలం రూ.600లు మాత్రమే ఇస్తున్నారని, ప్రధాన మంత్రి అన్నీ మాట్లాడుతారు కానీ వంట కార్మికులు వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యులు ఈ అంశాన్ని కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కనీస వేతనాలు అందించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. గత 8 నెలలుగా వంట బిల్లుల, అల్పాహారం బిల్లులు, వేతనాలు, కోడి గుడ్ల బిల్లులు, పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలన్నారు. మేడే సందర్భంగా ఏఐటియుసి జెండాలను ఆవిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణకుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటాల రాములు, తోపునూరి చక్రపాణి, కార్యదర్శులు ధర్ముల రామ్మూర్తి, మీస లక్ష్మణ్, ముంతాజ్, నిమ్మటూరి రామకృష్ణ, పోలప్పోలు వెంకటేష్, రాష్ట్ర సమితి సభ్యులు, పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, జాడే నాందేవ్, పద్మ, సరస్వతి, సుమలత, యశ్వంత్, ఇస్రు, రేఖ, కాంతమ్మ, సోఫియా, సంఘీత, సరిత, సాయమ్మ, లక్ష్మీ , పాల్గొన్నారు.

## మూడు నెలల్లో 250 మంది మావోయిస్టులు లొంగుబాటు

ఐజి చంద్రశేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ సరిహదుల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోందని నార్త్ జోన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో మావోయిస్టుల ఉనికి పెద్దగా లేదని అన్నారు. ఆపరేషన్ కగార్ ప్రభావం కూడా తక్కువే అని చెప్పారు. మూడు నెలల్లో 250 మావోయిస్టులు లొంగిపోయారని స్పష్టం చేశారు. అయినా ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులో తెలంగాణ పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. ఇటీవల వరుసగా లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించామని అన్నారు. వారు తిరిగి మావోయిస్టు పార్టీ వైపు పోకుండా ఉండేందుకు నిఘా పెట్టామని తెలిపారు. సరిహద్దులో పెట్రోలింగ్‌తో పాటు తనిఖీలు విస్తృతం చేశామని తెలిపారు.

## ‘ఆపరేషన్ కగార్’ను తక్షణమే నిలిపివేయాలి

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి : బి.వి.రాఘవులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తున్న మారణ హోమాన్ని తక్షణమే నిలిపివేయాలని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బలగాలు మావోయిస్టులపై కొనసాగిస్తున్న ఈ హత్యా కాండను తీవ్రంగా ఖండిస్తున్నామని, మావోయిస్టుల చర్చల ప్రతిపాదికన మేరకు ఆ పార్టీ ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలను జరపాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో సోమవారం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ చివరి మావోయిస్టును చంపేదాకా వదిలిపెట్టబోమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం అప్రజాస్వామికమన్నారు. సైన్యం తమ సొంత ఆస్తిగా ఆయన మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని, మావోయిస్టులతో తక్షణమే శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసీలపై జరుగుతున్నదాడిని ఆపేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 370 పేజీల ఎన్‌డిఎస్‌ఎ నివేదిక తీవ్రమైన లోపాలను, పలు కీలక అంశాలను ఎత్తిచూపిన ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అందులో దానిపై సమగ్రంగా చర్చించాలని కోరారు. జనాభా ప్రాతిపదిక డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలతో పాటు పంజాబ్, పలు రాష్ట్రాలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇది జనాభా నియంత్రణను విజయవంతంగా చేపట్టిన రాష్ట్రాలను నేరం చేసినట్టుగా చూపి సీట్లు తగ్గించడమే అవుతుందని, డీలిమిటేషన్ వెనుక బిజెపి రాజకీయ లబ్ది ఉందని విమర్శించారు. ఆయా రాష్ట్రాల్లో ఇప్పుడున్న నిష్పత్తి ప్రకారం ఎంపి సీట్ల నుపెంచాలన్నారు.

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక తరగతుల వారిని సామాజిక అణచివేతలకు, సాంఘిక బహిష్కరణకు గురిచేస్తున్న విడిసిలపై రాష్ట్ర ప్రభు త్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాళ్లరాంపూర్లో రూ.5లక్షలు ఇవ్వలేదనే కారణంతో గీతకార్మికులను వీడీసీ గ్రామ బహిష్కరణ చేయడం, దేవాలయంలోకి రాకుండా అడ్డుకోవడం క్షమించరాని నేరమన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ పరిధిలో 700 మంది పేదలకు ప్రభుత్వం ఇండ్ల పట్టాలిచ్చిందని, వాటిలోకి పేదలు వెళ్లకుండా ఆర్‌ఎఫ్ సి యాజమాన్యం అడ్డుకోవడం సరిగాదని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదలకు న్యాయం చేయాలని కోరారు.

## బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుండి కిష్టాపురం వరకు నీరు అందించాలి

సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చెందాలి: సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం దృఢసంకల్పంతో కృషి చేస్తుందని అదేవిధంగా కరువు కాటకాలు ఫ్లోరైడ్ మహమ్మారితో వెనుకబడ్డ మునుగోడు నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్మించనున్న అదనపు బ్లాక్‌లకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సత్యం పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి మునుగోడు మండలం కిష్టాపురం చెరువు వరకు 15కిలోమీటర్లు కెనాల్ ద్వారా సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు నిర్మాణంలో ప్రతిపాదన ఉందన్నారు. ప్రాజెక్టు ప్రతిపాదన ప్రకారం కృష్టాపురం చెరువు వరకు బ్రాహ్మణ ప్రాజెక్టు కెనాల్ ద్వారా నీరు అందించడం ద్వారా ఆప్రాంతంలో ఉన్న ఐదు గ్రామాలలో వేల ఎకరాల భూమి సాగుతో పాటు ప్రజలకు తాగునీరు అందించిన వారు అవుతారని అందుకు ప్రభుత్వం కిష్టాపురం వరకు వెల్లంల ప్రాజెక్టు నీరు అందించాలని కోరారు. అదేవిదంగా ఉమ్మడి నల్లగొండలో జిల్లా కలెక్టరేట్‌లో ప్రజలకు కావలసినటువంటి సౌకర్యం కోసం అదనపు భవనాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం అభినందనీయం అన్నారు. పరిపాలన అనేది చాలా ముఖ్యమైంది ప్రభుత్వ పనుల కోసం వస్తున్న ప్రజలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండదంతో పనులు సులువుగా సాగుతాయని ఆ దిశగా అదనపు భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్న జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డిలకు వ్యక్తిగతంగా, జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ వస్తే ప్రజలు ఏదైతే ఆశించామో ప్రజల ఆలోచనలను అమలు చేయదంలో గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని పెండింగ్ ప్రాజెక్టులో పూర్తి చేయడంలో తీవ్రమైన అన్యా యం చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ చేరే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంకు వివిధ ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చిన ప్రజలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు లేకపోవదంతో ఆయా ప్రాంతాలలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని వారందరికీ ప్రభుత్వం ఇండ్ల స్థలాలకు పట్టలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అదేవిధంగా నిర్మాణంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారికి ఇవ్వాలని కోరారు.

## కెసిఆర్ తప్పల మీద తప్పలు చేశారు: మాజీ ఎంపి విహెచ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ తప్పుల మీద తప్పులు చేశారని మాజీ ఎంపి వి.హనుమంతరావు ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో కెసిఆర్ పదేళ్లు డిక్టేటర్ పాలన చేశారని తెలిపారు. పార్టీలో ఉన్న వాళ్ళు వెళ్ళిపోతారేమో అని భయపడి కెసిఆర్ వరంగల్‌లో బిఆర్‌ఎస్ సభ పెట్టారని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్‌పై కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా..? అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. కెసిఆర్‌ను ప్రజలు తిరస్కరించడం వల్లనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రగతి భవన్, సెక్రటేరియట్ కట్టాలనే మంచి ఆలోచన కెసిఆర్‌కి వచ్చింది, కానీ ప్రజలను ఎవ్వరిని అక్కడికి రానివ్వలేదన్నారు. అప్ కి బార్ కిసాన్ సర్కార్ అని మహారాష్ట్ర వెళ్లి కెసిఆర్ కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఏం గతి పట్టిందో ఆయన తెలుసుకోవాలన్నారు. హర్యానా, పంజాబ్ వెళ్లి డబ్బులు పంచి వచ్చాడని కూడా ఆరోపించారు. ఆయన హయంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేశారని హనుమంతరావు గుర్తు చేశారు. యూత్ కాంగ్రెస్‌లో కెసిఆర్, చంద్రబాబు నా దగ్గర పని చేశారని వాళ్లకు సిఎం అయ్యే అవకాశాలు వచ్చాయని తనకు రాలేదని అన్నారు.

## మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ ముస్తాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం మరో అంతర్జాతీయ వేడుకలకు సిద్ధం అవుతోంది. 72వ మిస్ వరల్డ్ 2025 పోటీలకు ఆతిథ్యం ఇవ్వడానికి హైదరాబాద్ నగరం అన్ని ఏర్పాట్లు శరవేగంగా పూర్తి చేస్తోంది. మే 7వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు నగరంలో ఈ ప్రతిష్ఠాత్మకమైన అందాల పోటీలు జరగనున్నాయి. ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 140 దేశాలకు చెందిన అందమైన మహిళలు తరలిరానున్నారు. పోటీలో పాల్గొనే కంటెస్టెంట్స్ మే 6,7 తేదీల్లో హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. కాగా మిస్ వరల్డ్ పోటీల ప్రాముఖ్యతను చాటేందుకు ప్రస్తుత మిస్ వరల్ క్రిస్టినా పిస్కోవాతో పాటు మిస్ ఇండియా 2023 విజేత నందిని గుప్తా ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పోటీలు ప్రారంభం కావడా నికి కేవలం 8 రోజులే సమయం ఉండటంతో, ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. నగరంలో అంతర్జాతీయ స్థాయికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గ్రాండ్ ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచంలోని అందమైన మహిళలందరూ ఒకే వేదికపై సందడి చేయనున్న ఈ పోటీలు హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకురానున్నాయి. ఈ అద్భుతమైన వేడుక కోసం నగర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదికపై నేడు మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) ఇచ్చిన నివేదికపై మంగళవారం ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనుంది. రాష్ట్ర సచివాలయంలో ఉదయం 11 గంటలకు ఇరిగేషన్ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదికలోని అంశాలను మీడియాకు వెల్లడించనున్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయగా మేడిగడ్డ బ్యారేజీ అభివర్ణించారని, అయితే అది వారి హయాంలోనే పనికి రాకుండా పోయిందని, ఇందుకు సంబంధించి ఎన్‌డిఎస్‌ఎ తన తుది నివేదికలో పొందపర్చిన పూర్తి అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించనున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## టిజిఇఆర్‌సి సభ్యులుగా రఘు కంచర్ల, చెరుకూరి శ్రీనివాసరావు నియామకం

ఉత్తర్వులు జారీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టిజిఇఆర్‌సి) సభ్యులుగా రఘు కంచర్ల, (టెక్నికల్) చెరుకూరి శ్రీనివాస రావు(ఫైనాన్స్)లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా తెలంగాణ విద్యుత్ ఉద్యమంలో కె.రఘు ముఖ్యపాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన టిజెఎసిలో కన్వీనర్‌గా పని చేశారు. చత్తీస్‌గడ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం వల్ల జరిగే నష్టాన్ని, విద్యుత్ రంగంలో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వ లోపాలను, నిర్లక్ష్యాలను ఎత్తి చూశారు. అందుకు ఆయనపై బదిలీ వేటు వేసింది. గిరిజన ప్రాంతాల్లో మినీ హైడ్రాల్ పవర్ ప్రాజెక్ట్‌లను చేపట్టారు. విద్యుత్ రంగానికి సంబంధించి తెలంగాణలో విద్యుత్ రంగం పట్ల నిర్లక్ష్యం, తెలంగాణ విద్యుత్ రంగ అభివృద్ధి, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్ట్‌పైన విశ్లేషణల పుస్తకాలను రచించారు.

# ఉద్యోగ సర్వీస్‌ను కాపాడుకోవాలి

నూతన ఇంజనీర్లకు మంత్రి సీతక్క పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్తగా వచ్చిన ఉద్యోగాన్ని సర్వీస్ మొత్తం కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. జిహెచ్‌ఎంసిలో నూతనంగా నియామకమై వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ల రెండవ బ్యాచ్ కింద ఆరురోజుల శిక్షణ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియాలో జరిగిన ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఇంజనీర్లకు అవసరమైన జిహెచ్‌ఎంసికి సంబంధించిన కార్యకలాపాలపై సీనియర్ ఇంజనీర్లు, ఉన్నతాధికారులు, రిటైర్డ్ ప్రొఫెసర్‌ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. కాలేజీల నుండి డైరెక్ట్‌గా ఉద్యోగంలోకి వచ్చినందున అపారమైన భవిష్యత్ ఉంటుందని మంత్రి అన్నారు. వచ్చిన ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రజలకు మంచి సేవలను అందించాలన్నాని మంత్రి సీతక్క వారికి సూచించారు. పేదరిక నిర్మూలనా సంస్థ సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో ఇంజనీరింగ్ అధికారుల పాత్ర గణనీయమైనదన్నారు. రోడ్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణాలు, పేదలకు నిర్మించేగృహ నిర్మాణాలతో పాటుగా, స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా నిర్మించబోయే ప్రతి భవన నిర్మాణం ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుతాయన్నారు. ఒక గురుతరమైన బాధ్యతను నిర్వహించే ఈ పనులన్ని ఇంజనీరింగ్ అధికారులుగా నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల రిక్రూట్ చేసుకున్న ఇంజనీరింగ్ అభ్యర్థులందరికీ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ద్వారా శిక్షణ ఇస్తున్నందుకు తమకు ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఫ్యాకల్టీలు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ నరేష్, నాగ మల్లేశ్వర రావు పాల్గొన్నారు.

# ఉనికి కోసమే బిఆర్‌ఎస్ సభ



కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన ఉనికిని కాపాడుకునేందుకే వరంగల్‌లో బిఆర్‌ఎస్ వజ్రోత్సవ సభను పెట్టిందని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఎద్దేవ చేశారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కెసిఆర్ తెలంగాణ నినాదం నుండి వెనక్కి తగ్గాలని అనుకున్న సమయంలో ఆయన్ని లేపింది కాంగ్రెస్ నేతలే అని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన జరగాలి అని మా పార్టీ నేతలే వెనక నిలబడి నడిపించారు. కాంగ్రెస్ నాయకత్వం వెనకాల లేకుంటే కేసీఆర్ దీక్ష జరిగేది కాదు.. ఇది వాస్తవం విమర్శ కోసం చెప్పడం లేదన్నారు. కెసిఆర్ పదేళ్లు సిఎంగా పని చేశారు... చాలా అనుభవజ్ఞులు అయితే తన ప్రసంగంలో గతాన్ని మర్చిపోయి మాట్లాడారన్నారు.రాహుల్ గాంధీ పై కెసిఆర్ మాట జారాదన్నారు. కాంగ్రెస్‌లో డుప్లికేట్ గాంధీలు అనడం ఆశ్చర్యంగా అనిపించిందన్నారు. కెసిఆర్ అంటే నాకు గౌరవం ఉంది.. పరిపూర్ణత చెందిన నాయకుడు అని నేను భావిస్తా .. కానీ ఈ వయసులో ఇంత దిగజారి మాట్లాడుడం అవసరమా..? అని ప్రశ్నించారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్, రాజన్న సిరిసిల్ల.**

సీల్డ్ కొటేషన్స్ — తేదీ : 26.04.2025

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట పట్టణములో ఒక్క(1) పనికి అంచనా విలువ: రూ.31.00 లక్షలు సాండ్ నిధుల నుండి చేయుటకు గాను సీల్ కొటేషన్స్ కోరడమైనది స్వీకరించు తేది: 28-04-2025 నుండి తేది: 01-05-2025, తదుపరి వివరముల కొరకై రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయత్ రాజ్ కార్యాలయములో సంప్రదించగలరు.

సం/- జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్ రాజన్న సిరిసిల్ల

DIPR R.O. No. : 908-PP/CL/ADVT/1/2025-26, Date: 28-04-2025

**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**
గూడెం గ్రామము,దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.

Rc.No.SSSD/132/2025 — బహిరంగ వేలము ప్రకటన-3 — తేదీ : 28.04.2025

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! మంచిర్యాల జిల్లా, దండేపల్లి మం॥, గూడెం గ్రామము యందలి శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము వద్ద ఈ క్రింద తెలిపిన వేలము తేది: 06.05.2025 మంగళవారం రోజున ఉదయం గం.11:00లనుండి దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మరియు హాజరు సభ్యుల సమక్షములో దేవాలయ కార్యనిర్వహణాధికారిచే దేవస్థాన కార్యాలయము నందు బహిరంగ వేలము నిర్వహించబడును.

| క.సం. | బహిరంగ వేలము వివరములు | ధరావత్తు సొమ్ము | కాల పరిమితి |
|---|---|---|---|
| 1. | టెంకాయలు అమ్ముకొను హక్కు | రూ. 1,00,000/- | తేది: 19.06.2025 నుండి తేది: 18.06.2026 వరకు |
| 2. | కిరాణం మరియు ఆటబొమ్మలు అమ్ముకొనుహక్కు | రూ. 50,000/- | తేది: 15.06.2025 నుండి తేది: 14.06.2026 వరకు |
| 3. | వంట చెరకు, పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | రూ. 50,000/- | |
| 4. | టీ, టిఫిన్స్ అమ్ముకొను హక్కు | రూ. 20,000/- | |

కావున ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి ఆధార్ కార్డు ఇచ్చి బహిరంగ వేలము పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాను. ఇట్టి వేలము పాట షరతులు వేలము పాటకు ముందు చదివి వినిపించబడును. ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 929-PP/CL/ADVT/1/2025-26, Date: 28-04-2025

ప్రజాపక్షం
మంగళవారం, ఏప్రిల్ 29

# గుభాళింపు తగ్గిన గులాబీ

భారతీయ (ఇంతకుపూర్వం 'తెలంగాణ') రాష్ట్ర సమితి వ్యవస్థాపక రజతోత్సవ బహిరంగ సభ ఒకనాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రోద్యమానికి పటుగొమ్మలాంటి వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఆదివారం సాయంత్రం కోలాహలంగా జరిగింది. అయితే 14 ఏళ్లు ఉద్యమపార్టీగా, దాదాపు దశాబ్దకాలం పాలక పార్టీగా విరాజిల్లిన తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) 2023(అసెంబ్లీ), 2024(లోక్‌సభ) ఎన్నికల షాక్ నుంచి తేరుకుని కాలు చెయ్యి కూడదీసుకునే తొలి ప్రయత్నంగా ఈ సభను చూడవచ్చు. అధినాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మళ్లీ జనంలోకి రావటానికి దీన్ని అంకురార్పణగా భావించవచ్చు. 'నేను మళ్లీ బయలుదేరుతా' అని ఆయనే స్వయంగా ప్రకటించారు కూడా. బిఆర్ఎస్ అధికారానికి దూరమైనా గణనీయమైన ఓటు బలం ఉంది. నాయకుని వాగ్ధాటిలో కరకుదనం తగ్గినా జనాకర్షకశక్తి అట్లనే ఉంది. డబ్బుకు కొదవలేదు. పట్టుదలతో జన సమీకరణ చేశారు. ఈ సభ ఆ పార్టీ కార్యకర్తలకు టానిక్కులా పనిచేస్తుంది – సందేహం లేదు. ఎల్కతుర్తిలో సభా ప్రారంభం గంట ఆలస్యమై చీకట్లు కమ్ముకున్నా, అనేక గంటలముందు సభాస్థలికి చేరుకున్న తండోపతండాల జనాలు ఓపిగ్గా తమ నేతకోసం ఎదురుచూస్తున్నా నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలతో కాలక్షేపం అందించారేగాని వేదికనలంకరించిన 500మంది నాయకులలో ఎవరూ ప్రసంగించటానికి సాహసించలేదు. రజతోత్సవ ప్రారంభోత్సవ సభను కేవలం కెసిఆర్‌కు రిజర్వు చేశారు.

కెసిఆర్ గంటపాటు చేసిన ప్రసంగంలో ఓ 5–6 నిముషాలు మినహా సమయాన్నంతా తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేయటానికి, తమను అధికారం నుంచి ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారపట్టటానికి ఉపయోగించారు. అందువల్ల తొలి సగభాగానికి సభికులనుంచి స్పందన కరవైంది. ఆ విషయాన్ని గ్రహించిన కెసిఆర్, 'ఇక వస్తున్నా – మీకు కావలసింది చెబుతా' అనగానే హర్షధ్వానాలు. ఇక 18మాసాల కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. నెం.1 రాజకీయ స్థానంకోసం ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న పోటాపోటీ రాజకీయంలో రాష్ట్రానికి 'నెంబర్ 1 విలన్ కాంగ్రెస్' అని కెసిఆర్ ముద్ర వేశారు. అంటే తమ ప్రథమ శత్రువు కాంగ్రెస్ అని తేల్చిపడేశారు. 8 లోక్‌సభ సీట్లు, దాదాపు 34శాతం ఓట్లు పొంది, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంకోసం అర్రులు చాస్తూ, కేంద్ర నాయకుల ప్రత్యక్ష మార్గదర్శకంలో కుల, మత విభజనలకు ఆజ్యం పోస్తున్న బిజెపి పట్ల తమ వైఖరిని నాలుగుమాటల్లో తేల్చిపారేశారు. '...భ్రభ్రాజమానం–భజగోవిందం'అన్నారు. బిజెపి రాష్ట్రానికి ఏమిచ్చింది. 150 మెడికల్ కాలేజీల్లో మోదీ ప్రభుత్వం ఒక్కటైనా తెలంగాణకు ఇచ్చిందా? ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇచ్చిందా?' 11 ఏళ్లలో 11 రూపాయలు తెచ్చారా? అని ప్రశ్నించి వదిలేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన విమర్శ ప్రధానంగా దాని సంక్షేమ వాగ్దానాలు – వాటి అమలులో వైఫల్యంపై సాగింది. వాగ్దానాలు నెరవేర్చలేక ప్రతిదానికీ బిఆర్ఎస్‌ని నిందిస్తూ కాలం గడుపుతున్నారని అన్నారు. సంవత్సరంన్నర గడిచిపోయింది. ఒక్క కొత్త ప్రాజెక్టు అయినా నిర్మించారా అంటూ తాము మూడేళ్లలో చేబట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులను ప్రస్తావించారు. నల్లాల నీళ్లు ఇచ్చుడులో విఫలం, కరెంటు ఇచ్చుడులో విఫలం, రైతు రుణమాఫీలో, రైతు బంధు, రైతు బీమా అమలులో విఫలం అని దెప్పిపొడిచారు. ఒక్కొక్క కాంగ్రెస్ వాగ్దానాన్ని ప్రస్తావిస్తూ అమలు చేశారా అంటూ సభికులను ప్రశ్నించారు. తాము రాత్రింబవళ్లు కష్టపడి నిర్మించుకున్న బంగారు తెలంగాణను నాశనం చేస్తున్నారని వాపోయారు.

సుపరిపాలన అందించి, ప్రజలకు ఇన్ని సత్కార్యాలు అందజేస్తే వారెందుకు 'ఇక చాలు మీ పాలన' అంటూ మూడోసారి అధికారం నిరాకరించారో – మాటమాత్రంగానైనా కెసిఆర్ ప్రస్తావించలేదు. కాకపోతే కాంగ్రెస్ పార్టీ శుష్కవాగ్దానాలతో ప్రజలను మోసం చేశారనే ధ్వని ఆయన ప్రసంగంలో అంతర్లీనంగా సాగింది. కాంగ్రెస్ పాలకపార్టీ, బిఆర్ఎస్ ముఖ్య ప్రతిపక్షపార్టీ గనుక వాటిమధ్యనే వైరం ప్రధానంగా ఉంటుంది. అయితే దక్షిణాదిపై పట్టుకు వ్యూహాలు పన్నుతున్న బిజెపి ప్రమాదాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే – తర్వాత చింతించి లాభం ఉండదు, ఆలోచించాలి. ఇది బిఆర్ఎస్ రజతోత్సవ సంవత్సరం గనుక జిల్లాల్లో జరిపే సభలు కూడా ఇదే బాణీలో సాగుతాయి. ఇందులో కొత్తేమీ లేదు – రోజూ ముఖ్యనాయకులు వినిపిస్తున్నదే. కాని పార్టీని ఓటర్లు తిరస్కరించేందుకు దారితీసిన కారణాలపై అంతర్మథనం, ఆత్మవిమర్శ ఎక్కడ, ఎప్పుడు? రాజకీయ పార్టీకి ఇది అవసరం. 'మా తలుకు తగ్గలా, వాళ్ల మోసంలో జనాలు పడ్డారు' అనుకుంటూ, నిందిస్తూ పోతే భవిష్యత్ చీకటికావచ్చు. తస్మాత్ జాగ్రత్త.

# రాహుల్‌వి పిల్ల చేష్టలైతే...మోదీ పెద్దరికం ఎక్కడ?



ఎం. కోటేశ్వరరావు

రామాయణంలో రాముడికి ప్రఖ్యాతి ఎలా వచ్చిందంటే ప్రధాన కారకుడు రావణ పాత్రధారి అని కొందరు అంగీకరించకపోవచ్చు. సీత గీత దాటకపోతే రామకథే లేదు అన్నవారు కూడా ఉన్నారు. అలాగే రాహుల్ గాంధీకి బిజెపి నేతలు, వారి కనుసన్నలలో నడిచే మీడియా పెద్ద ఎత్తున ప్రచారం కల్పిస్తున్నదంటే అతిశయోక్తి కాదు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నాటికి అంతకు ముందు లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే పెద్ద సంఖ్యలో ఓట్లు పెరగటం, సాయంత్రం 5.30 నుంచి 7.30 మధ్యలో 65లక్షల ఓట్లు పోల్ కావటం గురించి గతంలో చేసిన విమర్శలు లేదా ఆరోపణలనే రాహుల్ గాంధీ మరోసారి చేశారు. అది అమెరికాలోని బోస్టన్ నగరంలో పునశ్చరణ చేయటాన్ని బిజెపి తప్పు పడుతూ దేశద్రోహం అన్నట్లుగా దాడికి దిగింది. మన గడ్డమీద ఎన్నయినా అనుకోవచ్చుగానీ విదేశాల్లో మన రాజ్యాంగ సంస్థలను విమర్శించటం ఏమిటి అంటూ మనోభావాలను ముందుకు తెచ్చింది. దేవుడు నైవేద్యం తినడని పూజారికి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అలాగే రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యం, వాటి మీద దాడి చేయటంలో బిజెపి తీరు అనితర సాధ్యం. ఎన్నికల కమిషనర్లు, ప్రధాన కమిషనర్ నియామక కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉన్న పద్ధతిని మార్చి సిజె స్థానంలో కేంద్ర మంత్రిని పెట్టారు. అంటే ముగ్గురిలో రెండు ఓట్లు అధికారంలో ఉన్న వారికి ఉంటాయి గనుక ఇష్టం వచ్చిన వారిని నియమించుకోవచ్చు, అలాంటి వారు ఎలా పని చేస్తారో వేరే చెప్పనవసరం లేదు. రాహుల్ గాంధీ చెప్పినట్లు అలా నియామకం పొందిన వారు రాజీపడక ఏం చేస్తారు, నియమించిన వారికి వ్యతిరేకంగా వ్యవహరించగలరా ? వారేమైనా టిఎన్ శేషన్ వంటి చండశాసనులా?

ఈ పూర్వరంగంలోనే ఎన్నికల కమిషన్ రాజీపడుతున్నదని, వ్యవస్థలోనే లోపం ఉన్నదని రాహుల్ గాంధీ బోస్టన్‌లో చేసిన వ్యాఖ్యలను బిజెపి వివాదం కావించింది.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, పోలింగ్ గురించి ఎన్నికల కమిషన్ గతంలోనే తన చర్యను సమర్ధించుకున్నది. మొత్తం 9.7కోట్ల మంది ఓటర్ల గురించి కేవలం 90 అప్పీళ్లు మాత్రమే వచ్చినందున జాబితా సరైనదే అని ఎన్నికల కమిషన్ సమర్ధించుకుంది, 30లక్షల మంది కొత్త ఓటర్లు నమోదైతే ఆ స్థాయిలో ఫిర్యాదులు రాలేదెందుకని ఎదురు ప్రశ్నించింది.రెండు గంటల సమయంలో 65లక్షల ఓట్లు వేయటం ఎలా సాధ్యమని రాహుల్ గాంధీ ప్రశ్న, వీడియో చిత్రాలను కూడా అడిగేందుకు వీల్లేకుండా చట్టాలను సవరించారని పేర్కొన్నారు. వీటికి సమాధానం లేదు. రిగ్గింపు ఎప్పుడు ఎలా చేస్తారో మనకు తెలియదా !

రాహుల్ గాంధీవి పిల్లచేష్టలని, విదేశీ గడ్డ మీద ఆధారం లేని ఆరోపణలు చేస్తున్నట్లు బిజెపి ధ్వజమెత్తింది. విదేశీ పర్యటనల్లో విమర్శలు చేయటం కొత్త కాదు, గతంలో కూడా చేశారు. ఆ మాటకు వస్తే వయసులో పెద్దమనిషి, ఒక ప్రధానిగా నరేంద్రమోదీ చేసిందేమిటి ? పెద్దలు నడిచిన బాటనే పిల్లలూ అనుసరిస్తారు. ఒక రాజకీయ నేత తన ప్రత్యర్ధి పార్టీ లేదా ప్రభుత్వం, వ్యవస్థల గురించి స్వదేశంలో విమర్శించి విదేశాల్లో పొగడాలా, ఆ పని చేస్తే సమావేశాలకు వచ్చిన వారు గడ్డి పెట్టరా లేదా నేను మాట్లాడను అని నోరుమూసుకోవాలా ? నరేంద్రమోదీ అదే చేశారా ? కాంగ్రెస్‌ను స్వదేశంలో విమర్శించినట్లే విదేశాల్లోనూ ధ్వజమెత్తారు. ఆ పార్టీనే కాదు, అవినీతిదేశం అంటూ జాతి పరువునే తీశారు.

### మోదీ అవాకులు – చవాకులు

2015లో జర్మనీ వెళ్లినపుడు కాంగ్రెస్ పార్టీ వదలివెళ్లిన చెత్తనంతా శుద్ధి చేయాల్సి ఉందని మోదీ చెప్పారు. భారత్ అంటే కుంభకోణాల దృశ్యమని, దాన్ని తాను నైపుణ్య దేశంగా మార్చనున్నట్లు కెనడాలో చెప్పారు. ఓమన్‌లో కూడా అదే చెప్పారు. కాంగ్రెస్ పాలనా కాలమంతా కుంభకోణాల మయమని, తప్పుడు పాలనా పద్దతులను సరిదిద్దేందుకు తాను ఎంతో కష్టపడుతున్నట్లు చెప్పుకున్నారు. గత జన్మల్లో ఏ పాపం చేశామో భారత్‌లో పుడుతున్నామని జనాలు చెప్పుకుంటున్నారని దక్షిణ కొరియా సియోల్‌లో మోదీ సెలవిచ్చారు.ఇలాంటి పరిస్థితిలో తెలివైన వారు దేశం వదిలేసి వేరే చోటకు పోదామని అనుకున్నారు అలాగే వెళ్లారు.ఇప్పుడు నేను గట్టి విశ్వాసంతో చెప్పగలను, అన్ని జీవన రంగాలకు చెందిన ఆ తెలివైన వారు, ప్రముఖ శాస్త్రవేత్తలు కూడా వారు విదేశాల్లో పెద్ద మొత్తాలను సంపాదిస్తున్నప్పటికీ వారంతా తిరిగి రావటానికి, తక్కువ ఆదాయాలకు కూడా సిద్దపడి భారత్‌లో స్థిరపడటానికి రావాలని చూస్తున్నారని మోదీ చెప్పారు. చైనాలోని షాంఘై నగరంలో భారత సంతతి సమావేశంలో మాట్లాడుతూ గతంలో మీరు భారత్ గురించి సిగ్గుపడేవారు, ఇప్పుడు (తాను ప్రధాని అయిన తరువాత) దేశం గురించి గర్వపడుతున్నారన్నారు. ప్రతిపక్షం మీద ధ్వజం, స్వంతడబ్బా ప్రతిచోటా కనిపిస్తుంది. 2014లో ఎన్నిక తరువాత న్యూయార్క్ పర్యటనలో మీరు ఓట్లు వేసి ఉండకపోవచ్చుగానీ ఫలితాలు వచ్చినపుడు మీరంతా పండగ చేసుకున్నారని ప్రవాస భారతీయులతో చెప్పారు. ప్రధానిగా 70దేశాలు తిరిగారని 50చోట్ల తన ప్రత్యర్ధుల మీద రాజకీయ దాడి చేశారని పరిశీలకులు చెబుతున్నారు. అప్పుడు అది విదేశీ గడ్డా స్వదేశీ అడ్డా అన్నది గుర్తుకు రాలేదా ? రాహుల్ గాంధీ కూడా అదే బాటలో నడుస్తూ విమర్శలు చేస్తున్నారు. తేడా ఏమిటంటే మోడీ మాట్లాడిన వాటిని గోడీ మీడియా పెద్దగా ప్రచారంలో పెట్టలేదు, చర్చల రచ్చ చేయలేదు, అంతే ! మీరు ఎక్కడికి వెళితే అక్కడికి మా నెట్‌వర్క్ వస్తుందనే హచ్ కుక్క ప్రకటన మాదిరి నరేంద్రమోడీ ఏ విదేశ పర్యటన చేస్తే తాము కూడా ఒక సీనియర్ నేతను అక్కడకు పంపుతామని, అక్కడేమైనా తప్పుడు ప్రచారం, ఆరోపణలు చేస్తే అదే స్థాయిలో సమాధానం చెబుతామని, దేశాన్ని కించపరుస్తూ,ప్రతిపక్షం మీద ఆరోపణలతో మాట్లాడుతున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోదీ అని 2015లోనే కాంగ్రెస్ నేత ఆనందశర్మ విమర్శించారు. మోదీ ప్రధానిగా దేశాలు తిరుగుతున్నారు తప్ప ఆర్ఎస్ఎస్ ప్రచారక్ లేదా బిజెపి ప్రతినిధిగా కాదన్నారు.



### విచక్షణ లోపించిన వ్యాఖ్యలు

రాజ్యాంగ వ్యవస్థలను కించపరుస్తున్నారంటూ రాహుల్ గాంధీ మీద ధ్వజమెత్తుతున్న బిజెపి నేతలు ఏం చేస్తున్నారో దేశంతో పాటు ప్రపంచమంతా చూస్తోంది. అత్యున్నత న్యాయస్థానం తీర్పులనే వారు సవాలు చేస్తున్నారు. పార్లమెంటు సుప్రీం అంటూ ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ మరోసారి వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి, గవర్నర్లు తమ దగ్గరకు వచ్చిన బిల్లుల మీద మూడు నెలల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని లేకుంటే వాటిని ఆమోదించినట్లు పరిగణించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఉపరాష్ట్రపతి విమర్శించారు. అది ప్రజాస్వామిక శక్తులపై అణుక్షిపణి వంటిదని వర్ణించారు. సుప్రీం కోర్టుకు అలాంటి అధికారం లేదన్నారు. రాజ్యాంగం ప్రకారం చట్టసభలు ఆమోదించిన బిల్లులను తిప్పి పంపే అధికారం రాష్ట్రపతి, గవర్నర్లకు ఉంది. అయితే వాటిని తిరిగి చట్టసభలు మరోసారి ఆమోదించి పంపితే చట్టాలుగా ఆమోద ముద్రవేయటం తప్ప తిరస్కరించే అధికారం లేదు. అయితే రాష్ట్రపతి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు నెలల తరబడి తిప్పి పంపకుండా ప్రభుత్వాలను ఇబ్బందులు పెడుతున్న పూర్వరంగంలో తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఆ తీర్పు ఇచ్చింది. న్యాయవ్యవస్థ సూపర్ పార్లమెంటుగా వ్యవహరించజాలదని జగదీప్ తప్పుపట్టారు. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత రాష్ట్రపతి, గవర్నర్లదైతే, రాజ్యాంగం ప్రకారం పాలన సాగుతున్నదా లేదా అన్న భాష్యం చెప్పేందుకు సుప్రీం కోర్టుకు అధికారం ఉంది.చట్టసభలు చేసిన నిర్ణయాలను కాదనే హక్కు లేదు గానీ, అవి నిబంధనల మేరకు జరుగుతున్నాయా లేదా అన్నది నిర్ణయించవచ్చు. ఇప్పుడు వక్ఫ్ సవరణ చట్టం గురించి సుప్రీం కోర్టు విచారిస్తున్నది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దాని పరిధికి మించినా లేక ప్రభుత్వానికి ఇష్టం లేకపోయినా షాబానో తీర్పు మాదిరి పార్లమెంటులో బిల్లు పెట్టి దాన్ని రద్దు చేసే దమ్ము బిజెపి కేంద్ర ప్రభుత్వానికి ఉందా అన్నది సమస్య. ఉపరాష్ట్రపతి చెప్పినట్లుగా దేశానికి పార్లమెంటు, రాష్ట్రాలకు అసెంబ్లీలు ఉన్నతం, అవి ఆమోదించిన బిల్లులను నెలల తరబడి గవర్నర్లు తొక్కిపట్టటాన్ని ఏమనాలి, తానే స్వయంగా అలాంటి పనికి పాల్పడింది గుర్తులేదా, అప్పుడు అసెంబ్లీ సుప్రీం అన్న జ్ఞానం మేల్కో లేదా ?

ఉపరాష్ట్రపతి సుప్రీం కోర్టు మీద ధ్వజమెత్తటంతో కాబోయే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ సున్నితంగా బిజెపి నేతలకు చురకలు అంటించారు. పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్‌లో హింస కారణంగా అక్కడకు పారామిలిటరీని పంపాలంటూ రాష్ట్రపతికి ప్రవర్తకాది లేఖ జారీ చేయాలన్న పిటీషన్‌పై స్పందించారు. ఇప్పటికే మేము కార్యనిర్వహణ పరిధిని ఆక్రమిస్తున్నామన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నాం. అందువలన ఈ వినతిని తిరస్కరిస్తున్నామని ప్రకటించారు.కోర్టు పేరుతో పశ్చిమబెంగాల్లో కేంద్ర బలగాలను దించాలన్న ఎత్తుగడ పిటీషనర్ వినతిలో ఉంది.మమతా బెనర్జీని సమర్ధించనవసరం లేదుగానీ విష్ణు శంకర్ జైన్ అనే న్యాయవాది ఈ పిటీషన్‌కు ముందు రాష్ట్రపతి పాలన విధించాలని 2021లో కూడా కేసు వేశారు. పార్లమెంటూ కాదు, కార్యనిర్వాహక వ్యవస్థా కాదు రాజ్యాంగమే ఉన్నతమైనదని జగదీప్ ధంకర్ వ్యాఖ్యల మీద రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ స్పందించారు. సిబల్ ప్రస్తుతం సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, గతంలో కేంద్రమంత్రిగా పనిచేశారు.

### దూబేపై చర్య ఏదీ?

నోటి తుత్తర బిజెపి నేతల్లో నిషికాంత్ దూబే ఒకరు. వక్ఫ్ చట్ట సవరణ చెల్లుతుందా లేదా అన్నదాని గురించి విచారణ జరుపుతున్న సుప్రీం కోర్టు దేశంలో మత యుద్ధాలను రెచ్చగొడుతున్నదని, తన హద్దులను దాటుతున్నదని నోరుపారవేసుకున్నాడు. తరువాత ఎన్నికల కమిషన్ మాజీ ప్రధాన అధికారి ఎస్‌వై ఖురేషీ ముస్లిం కమిషనర్ తప్ప ఎన్నికల కమిషనర్ కాదని వదరుబోతుతనంతో మాట్లాడారు.దూబే వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని బిజెపి ప్రకటించటం ఒక నాటకం తప్ప మరొకటి కాదు. అలా ప్రకటించిన తరువాతే ఖురేషీ గురించి మాట్లాడాడు. ఎందుకంటే వక్ఫ్ చట్టాన్ని ఖురేషీ విమర్శించారు.తానుగా అధికారికంగా చేయలేని వ్యాఖ్యలను దూబే వంటి వారితో బిజెపి చేయించటం దానికి వెన్నతో పెట్టిన విద్య. దూబే అంతటితో ఊరుకోలేదు, దేశం హిందువులదని, గిరిజనులు, జైనులు, బౌద్దులు వారితో కలసి ఉన్నారని కూడా సెలవిచ్చారు. రెచ్చగొట్టే మాటలు మాట్లాడటానికి దూబె పెట్టింది పేరు, అగ్రనేతల మనసులో ఉన్నదాన్ని వెల్లడించిన దూబే మీద ఎలాంటి చర్య ఉండదని, తప్పనిసరైతే ఏదో మమఅనిపిస్తారని ఒక ఎంపి వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. సుప్రీం కోర్టు గురించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను కోర్టు ధిక్కరణ నేరం కింద దూబేపై చర్యలు తీసుకోవాలని వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్న వారి తరఫు లాయర్ అనాస్ తన్వీర్ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి లేఖ రాశారు, బిజెపి చర్యతీసుకుంటుందా ?

# ప్రపంచంలో మూడోస్థానం ఎవరికోసం?

ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అని ప్రగల్భాలు పలుకుతున్న ప్రస్తుత పాలకులు ఇకనైనా ప్రజల వాస్తవ పరిస్థితిని గమనించి, ఈ ఆర్థికాభివృద్ధి వాపా (లేక) బలుపా అని బేరిజు వేసుకుని ముందుకు సాగడం ఉత్తమం... ఎందుకంటే ఇటీవల ప్రపంచవ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సంస్థలు వివిధ అంశాలపై ప్రకటించిన అనేక ర్యాంకులు పరిశీలిస్తే, మన భారతదేశ వాస్తవ అభివృద్ధి కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది.. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల' సాధనలో మన దేశం 109వ స్థానంలో నిలిచింది. మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో 134వ స్థానం, సంతోష సూచికలో 126వ స్థానంలో, ఆకలి సూచిలో 105వ స్థానంలో, అవినీతిలో 96వ స్థానంలో, పోషకాహారలోపంలో 111వ స్థానం లో, మహిళా రక్షణలో 128వ స్థానంలో, మల్టీ డైమెన్షనల్ పోవర్టీ లో 126వ స్థానంలో, లింగ సమానత్వంలో 129వ స్థానంలో, తలసరి ఆదాయంలో 124వ స్థానంలో, అక్షరాస్యత రేటు 80% శాతం లోపు, నిరుద్యోగం దాదాపు 5% శాతంతో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి... ఇటువంటి పరిస్థితుల్లో భారత్ ఐదొవ ఆర్థిక వ్యవస్థగా మారటం వల్ల భారతదేశానికి ముఖ్యం గా పేద, మధ్య తరగతి ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏమిటి...!? ఇది మన అందరిని వెంటాడుతున్న ప్రశ్న...ఈ ప్రశ్నకు బదులేది...!? నేటి పాలకులు సమాధానం చెప్పాలి...

> ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల' సాధనలో మనదేశం 109వ స్థానంలో నిలిచింది. మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో 134వ స్థానం, సంతోష సూచికలో 126వ స్థానంలో, ఆకలి సూచిలో 105వ స్థానంలో, అవినీతిలో 96వ స్థానంలో, పోషకాహారలోపంలో 111వ స్థానం లో, మహిళా రక్షణలో 128వ స్థానంలో, మల్టీ డైమెన్షనల్ పోవర్టీ లో 126వ స్థానంలో, లింగ సమానత్వంలో 129వ స్థానంలో, తలసరి ఆదాయంలో 124వ స్థానంలో, అక్షరాస్యత రేటు 80% శాతం లోపు, నిరుద్యోగం దాదాపు 5% శాతంతో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి... ఇటువంటి పరిస్థితుల్లో భారత్ ఐదొవ ఆర్థిక వ్యవస్థగా మారటం వల్ల భారతదేశానికి ముఖ్యం గా పేద, మధ్య తరగతి ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏమిటి...!? ఇది మన అందరిని వెంటాడుతున్న ప్రశ్న...ఈ ప్రశ్నకు బదులేది...!? నేటి పాలకులు సమాధానం చెప్పాలి...

నేటికీ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.. అనేక విశ్వవిద్యాలయాలు అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు లేక విలవిలలాడుతున్నాయి.. దాదా పు ప్రపంచంలోనే ప్రాముఖ్యత కలిగిన వంద విశ్వవిద్యాలయాల్లో మనదేశం నుంచి ఒకటి లేకపోవడం గమనార్హం.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాల పూర్తి అవుతున్నా, నేటికీ వివిధ ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు సుమారు 70 కోట్ల మందికి పంచుతూ, కనీసం ఒకపూట భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుంది అని ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు పరిశీలిస్తే, తేటతెల్లం అవుతుంది.. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ, పేద మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుంది. ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు మండుతున్నాయి. ఎక్కడ చూసినా నిరుద్యోగం తాండవిస్తుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వలసల భారతంగా ఉంది. ఇటువంటి పరిస్థితు ల్లో దేశం త్వరలో 'మూడో ఆర్థిక వ్యవస్థగా' మారి నా ఎవరికి లాభం!?.... కేవలం ఈ అభివృద్ధి అంతా కొందరి బడా పారిశ్రామిక వేత్తలు, సంస్థలకు చెందినదిగా గుర్తించాలి.. కార్పోరేట్ వ్యక్తుల అభివృద్ధే దేశాభివృద్ధిగా చెబుతూ పాలకులు ప్రజలను నమ్మించడం ఇకనైనా మానాలి.

దేశానికి అన్నం అందించే అన్నదాతల ఆర్తనాదాలు పాలకులకు వినబడడం లేదు. రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు కనపడటం లేదు.. కేవలం నాలుగు రహదారులు, ఆరు విమానాశ్రయాలు, పది పదంతస్తుల ఆకాశహార్మ్యాలు నిర్మించి, యాభై, డెభై అడుగుల విగ్రహాలు , సందర్శించే దేవాలయాలు, ఆకర్షించే కుంభమేళా వంటివి చేయడం ద్వారా దేశంలో పేదరి కం తగ్గుతుందా...!? పాలకులారా ఆలోచన చేయండి... ప్రశ్నించే గొంతుకలను అణచివేయ దం ద్వారా వాస్తవాలు ఎల్ల కాలం దాచలేరు.. గతంలో 8% శాతం, 9% శాతం ఉన్న జిడిపి, నేడు 5 నుంచి 6 మధ్య కదలాడుతుంది అని గ్రహించాలి.. ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. ట్రంప్ తీసుకుంటున్న టారిఫ్ నిర్ణయాలతో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇకనైనా పాలకులు పారిశ్రామిక రంగా నికి, వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వాలి. గతంలో కంటే కొన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినా, కీలక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఉంది.. 'చైనా' వలే స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. నినాదాలు కాదు సరైన నిర్ణయాలు తీసుకోవడం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు ఊబిలో కూరుకు పోకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలి.. కుల, మత, వర్గ, భాష, లింగ వివక్షతలు తొలగించడానికి కృషి చేయాలి. భారత రాజ్యాంగ ఆశయాలు ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక విధానానికి అనుగుణంగా పాలన చేయాలి. అంకెలు, సంఖ్యలు చూసి మురిసిపోవడం మానాలి. వాస్తవంగా దేశ ప్రజలు తలసరి ఆదాయం పెరిగి, ఆయురారోగ్యాలతో, సంతోషంగా 'ఫిన్లాండ్ వలే ఉండే విధంగా చూసుకోవాలి.. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంటే దేశ ప్రజలు అందరూ సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి... అంతేకాని కొందరు బడా పారిశ్రామిక సంస్థలు, వేత్తలు, కార్పోరేట్ వ్యక్తుల బిలియనీర్ల సంపదే, దేశ అభివృద్ధి అని నమ్మి, దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారింది అని చెప్పి మురిసిపోవడం చాలా ప్రమాదకరం అని గ్రహించాలి... డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు 'దేశ ప్రజలు అందరి అభివృద్ధే, దేశాభివృద్ధి' అని నమ్మి ముందుకు సాగడం ఉత్తమం.

ఐ.ప్రసాదరావు, 6305682733

# ఒత్తిడిలో యువత ఆత్మహత్యలు!




మేకిరి దామోదర్
573666650

మన దేశ భవిష్యత్తు యువతరం చేతిలోనే ఉంది. ఏ దేశ ప్రగతికైనా సమర్థ యువ మానవ వనరులే కీలకం. అలా వారు వర్తమానమనే అపురూప బహుమానాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కసారి కోల్పోతే తిరిగి తెచ్చుకోలేని శక్తి సామర్థ్యాలు, కాలం విలువ తెలుసుకొని యువత మసులుకోవాలి. ప్రపంచంలో దేన్నైనా కొనగలం ఒక్క సమయాన్ని తప్ప. అందుకే యువతరం ఆధునిక టెక్నాలజీ మాయలో స్మార్ట్ ఫోన్లో కాలం వృధా చేయడమో, డ్రగ్స్‌కో, మద్యానికో, ఈజీ మనీకోసం బెట్టింగ్ జూదం లాంటి వ్యసనాలకు బానిస కారాదు! విద్యార్థులకు, యువతకు చదువు సంపద ఒక్కటే జీవితం కాదు. నీకంటూ ఏదో ఒక నైపుణ్యం కలిగి ఉంటావు. అదేమిటో తెలుసుకో ఆత్మవిశ్వాసంతో ఆచరించిన మరుక్షణం నీకు తిరగుండదని గట్టిగా నమ్మండి. ఈ రోజుల్లో సామాజిక స్పృహ, మానవీయ విలువల్ని పెంచే మంచి వ్యక్తుల అవసరం ఎంతో ఉంది. మీ శక్తి సామర్థ్యాలేమిటో తెలుసుకొని లక్ష్యాన్ని ముద్దాడాలి. ప్రభుత్వాలు వారిలో నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, స్వయం ఉపాధితో ఇంకొందరికి జీవనోపాధి కల్పించాలి. తద్వారా మెరుగైన ఆర్థిక ప్రగతికి దోహద పడాలి. అలా నైతిక విలువలతో సామాజిక బాధ్యతతో మెలిగేలా తయారు చేయాలి. ఇతరుల నమ్మకాలను, విలువలను గౌరవించినప్పుడే సమాజం శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రగతి పథం లో పయనించడానికి సాధ్యమౌతుంది. ఇలాంటి వేళ 'యువతరం ఎదుర్కొనే సమస్యలను పరిశీలిద్దాం' ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక చుట్టు ముడుతున్న ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, సామాజిక ఆర్థిక పరిస్థితులు తదితర కారణాలతో యువత మానసిక ఆందోళన, ఒత్తిడికి గురవుతోందని 'యంగ్ లైవ్స్ ఇండియా' అధ్యయనం వెల్లడించింది.

గత నాలుగైదేళ్లలో పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ మానసిక అనారోగ్య లక్షణాలు పెరుగుతున్నాయని తెలిపింది. సర్వేలో పాల్గొన్న యువతలో దాదాపు 59 శాతం మంది, ఏదో ఒక సమస్యతో ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు వివరించింది. తెలుగు రాష్ట్రాల్లోని యువతలో ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యం పై ఈ అధ్యయనం నిర్వహించారు.

'నివేదికలో వెల్లడైన అంశాలు'..ఎపితో పోలిస్తే తెలంగాణ యువతలో ఒత్తిడి, ఆందోళన, నిరాశ లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి. ఉన్నత వర్గాలతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఈ పరిస్థితులు ఎక్కువ. పేదరికం, తల్లిదండ్రుల్లో తక్కువ అక్షరాస్యత, వెనుకబడిన అణగారిన వర్గాల కుటుంబాల్లోని యువత ఎత్తుకు తగిన బరువు లేక బలహీనంగా ఉన్నారు. ఆహార అభద్రత పరిస్థితులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. చదువుకున్న, ధనిక కుటుంబాల్లోని యువతలో ఊబకాయం లక్షణాలు ఉన్నాయి. పోషకాహార సమస్యలున్న కుటుంబాలు 38శాతం ఉన్నట్లు వెల్లడయింది. ఎత్తుకు తగిన బరువు లేని యువత, అదే సమయంలో అధిక బరువుతో బాధపడుతున్న యువత సమానంగా ఉన్నారు. యువతలో మధుమేహం, గుండె సంబంధిత తదితర నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల కారణంగా మరణాల రేటు ఆందోళన కలిగిస్తుంది. 22 ఏళ్ల యువతలో 21 శాతం మంది, 29 ఏళ్ల యువతలో 13 శాతం మంది ఊబకాయం, అధిక బరువు సమస్యలతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితులు యువతలో హృద్రోగ సమస్యల పెరుగుదలకు కారణమవుతున్నాయి. తెలంగాణలో హృద్రోగ సంబంధిత ముప్పు 22 ఏళ్ల యువతలో 7.94శాతం ఉంటే, 29 ఏళ్ల యువతలో 15.51 శాతం ఉంది. ఏపీలో 22 ఏళ్ల యువతలో 9.22 శాతం ఉంటే, 29 ఏళ్ల యువతలో 22.73శాతం ఉంది. మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు 2021లో ప్రతి లక్ష మందిలో 1974 మంది ఉంటే.. ఇప్పుడు మరో 11 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. సర్వేలో పాల్గొన్న యువతలో దాదాపు 15శాతం మందిలో స్వల్ప, మధ్య స్థాయి మానసిక ఆందోళన, నిరాశ లక్షణాలు కనిపించాయి. వీరిలో ప్రతి 10 మందిలో 6గురు సమస్యలతో ఒత్తిడికి గురవుతున్నట్లు అధ్యయనం గుర్తించింది.



### మానసిక ఆరోగ్యం శాతాల్లో...

మధ్య స్థాయి ఒత్తిడి 22ఏళ్ల యువతలో ఎపి 54.13/తెలంగాణ 67.97/.. 29ఏళ్ల యువతలో ఎపిలో 51.85/ తెలంగాణలో 71.34/ మానసిక ఆందోళన 22 ఏళ్ల యువతలో ఏపీలో 5.96/ తెలంగాణలో 14.84/.. 29 ఏళ్ల యువతలో ఎపిలో 10.93/ తెలంగాణలో 20.52/ నిరాశ, నిస్పృహ 22 ఏళ్ల యువత ఎపిలో 7.14/ తెలంగాణలో 14.53/.. 29 ఏళ్ల యువతలో ఎపిలో 7.04/ తెలంగాణలో 17.26...

ఇలా మానసిక ఒత్తిడిలో యువతరం ఉన్నారని యంగ్ లైవ్స్ ఇండియా అధ్యయనం వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అలా ఉంటే... మన దేశంలో మానసిక సమస్యలతో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. 2020–22 మధ్య కాలంలో ఇలా ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య ఏకంగా 44శాతం పెరిగిందని జాతీయ నేర రికార్డుల బ్యూరో(ఎన్ సీ ఆర్ బీ) తెలిపింది. ఇలా మానసిక ఆరోగ్యం బాగాలేక ప్రాణాలు తీసుకుంటున్న ప్రతి ఐదుగురిలో ముగ్గురు 1845 సంవత్సరాల మధ్య వయస్కులు కావడమే గమనార్హం. మానసిక అనారోగ్యంతో ఏటా పెరుగుతున్న బలవన్మరణాలు 18–45 సంవత్సరాల వయసులోనే అధికం. ఇంకా వెలుగులోకి రాని మహిళల ఆత్మహత్యలు ఉంటున్నవి. నానాటికి ఆత్మహత్య రేటు పెరుగుతోంది..

మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు18–45 సంవత్సరాల మధ్య వయస్కులేనని ఎన్ సీ ఆర్ బీ నివేదిక తెలిపింది. 2018 తో పోలిస్తే 2022లో దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య 27శాతం పెరిగింది. దీనితో పాటే ప్రతి లక్ష జనాభాకు ఆత్మహత్య రేటు కూడా పెరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూటీవో) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా 7.2 లక్షల మందికి పైగా ఆత్మహత్య చేసుకుంటున్నారు.15 – 29 సంవత్సరాల మధ్య వయస్సున్న వారిలో మరణాలకు మూడో అతి పెద్ద కారణం 'ఆత్మహత్యే'. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న ఆత్మహత్యలలో 73శాతం పేద, ఓ మోస్తరు ఆదాయం కలిగిన దేశాల్లో జరుగుతున్నవే. ఈ పరిణామాల దృష్ట్యా 2017లో కేంద్ర ప్రభుత్వం మానసిక ఆరోగ్య రక్షణ చట్టాన్ని రూపొందించింది. ఎలాంటి వివక్షకు తావు లేకుండా నాణ్యమైన మానసిక ఆరోగ్య సేవలు ప్రజలందరికీ అందుబాటులో ఉంచ డం దీని ప్రధాన లక్ష్యం.. అయితే ఇది సరిగా అమలు కావడం లేదు, పైగా ఆత్మహత్య చేసుకున్న వారి వివరాలు సేకరించడం, దానిని వర్గీకరించడంలో కూడా పరిమితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మహిళల ఆత్మహత్యలు చాలా వరకు వెలుగులోకి రావడం లేదు.ప్రపంచ దేశాల్లోనే యువ జనాభా ఎక్కువ కలిగిన దేశం మనది. ఆ యువ శక్తికి మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం చాలా ముఖ్యం. అది చేజారితే యవతరం ఏది సాధించలేదు. యువత మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రభుత్వాలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ దేశ ప్రగతికి తోడ్పడేలా పాలన విధానాలు ఉండాలి. 'నష్టం జరిగిన తర్వాత సలహా ఇవ్వడం అంటే! మరణానంతరం మందు ఇవ్వడం లాంటిదే. ఈ విశ్వంలో విలువ కట్టలేనిది ఏదైనా ఉందంటే అది 'ప్రాణం' ఒక్కటే.

కావున యువత నిరాశ, నిస్పృహకు లోను కాకూడదు. మిమ్మల్ని అవహేళన చేసిన వాళ్లే మీ గురించి గొప్పగా చెప్పుకునే రోజులు వస్తాయని గట్టిగా నమ్మాలి.. మీ జీవితాన్ని చక్కదిద్దుకోవాలి. యువత సన్మార్గంలో వెళ్తే అంతకంటే పెద్ద బహుమతి మరొకటి ఉండదు. ప్రభుత్వాలు అందుకు సంపూర్ణ సహకారం అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## హజ్ యాత్రికులకు నుసుక్ కార్డ్ తప్పనిసరి

**న్యూఢిల్లీ :** ముస్లింల పవిత్ర హజ్ యాత్రకు ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. హజ్ కోసం వెళ్లే తొలి బ్యాచ్ యాత్రికులు ఈనెల 29న లక్నో ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరనున్నారు. ఈ నేపథ్యంలోనే భారత హజ్ కమిటీ యాత్రికులకు మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని సమయాల్లో తప్పనిసరిగా నుసుక్ కార్డ్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. దీంతో పాటుముఖ్యమైన పత్రాలు, గుర్తింపు కార్డులు వెంట తీసుకెళ్లాలని చెప్పింది. 'యాత్రికల వద్ద నుసుక్ కార్డ్ లేకపోతే సౌదీ అరేబియా ప్రభుత్వం నిలిపివేస్తుంది. మక్కా, మదీనా, మీనా, అరాఫత్ స్థానిక అధికారులు యాత్రికులను అడ్డుకుంటారు. ఇలాంటి ఇబ్బందులు పడకూడదంటే తప్పనిసరిగా నుసుక్ కార్డ్‌ను తమ వద్దే ఉంచుకోవాలి' అని ఉత్తర్‌ప్రదేశ్ హజ్ కమిటీ కార్యదర్శి ఎస్‌పి తివారీ తెలిపారు. యాత్రికుల సౌకర్యం కోసం హజ్ సువిధ 2.0 అనే యాప్‌ను రూపొందించామని, దీనిని గూగుల్, యాపిల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని హజ్‌కమిటీ చెప్పింది. విమానంలోని సౌకర్యాలతో పాటు వీసా సంబంధిత వివరాలు ఉంటాయని తెలిపింది. మక్కాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్, జిపిఎస్, ప్రార్థనా సమయం, ఫిర్యాదులు, బ్యాగేజీ ట్రాకింగ్ లాంటి వివరాలు ఉంటాయని వెల్లడించింది.

## ఫ్రాన్స్‌తో భారత్ ఒప్పందం : నౌకాదళానికి 26 రఫేల్ యుద్ధ విమానాలు



**న్యూఢిల్లీ :** భారత నౌకాదళానికి అత్యాధునిక రఫేల్ మెరైన్ యుద్ధ విమానాలు సమకూర్చేందుకు ఫ్రాన్స్‌తో కేంద్ర ప్రభుత్వం ఒక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం కింద రూ.64,000 కోట్లు భారత ప్రభుత్వం ఖర్చుపెడుతున్నది. ఈ మేరకు 26 రఫేల్ యుద్ధ విమానాలను దశలవారీగా 2030 నాటికి ఫ్రాన్స్ ప్రభుత్వం భారత నావికాదళానికి అందజేస్తుంది. భారత్‌–ఫ్రాన్స్ దేశాలు ఎవరి జోక్యం లేకుండా ప్రభుత్వస్థాయిలో ఈ ప్రత్యక్ష ఒప్పందం చేసుకున్నాయని రక్షణమంత్రిత్వశాఖ సోమవారంనాడు ప్రకటించింది. భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఫ్రాన్స్ సాయుధబలగాల మంత్రి సెబాస్టియన్ లెకోర్నూ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. సంతకాలు చేసిన ప్రతులను రెండు దేశాలకు చెందిన రక్షణశాఖ ఉన్నతాధికారులూ ఇచ్చిపుచ్చుకునానరని రక్షణమంత్రిత్వశాఖ పేర్కొంది.

ఈ ఒప్పందం ప్రకారం ఈ యుద్ధ విమానాల విడిభాగాలను కలిపి విమానాలు తయారు చేయడం, వాటిని నిర్వహించడం, మరమ్మతులు చేయడం, ఇంజన్లను ఓవరాయిలింగ్ చేయడం. సెనర్స్‌ను రెడీగా ఉంచడం వంటివన్నీ భారతదేశంలోనే చేస్తారు. అదేవిధంగా ఈ ఒప్పందం ప్రకారం ఈ యుద్ధవిమానాల సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా భారత్‌కు బదిలీ చేయడానికి తద్వారా దేశీయ ఆయుధాలను సమీకృతం చేయడానికి వీలుగా ఒప్పందం చేసుకున్నారు. ఐఎన్‌ఎస్ విక్రాంత్ వంటి భారీ యుద్ధ నౌకలపైనుండి ఈ యుద్ధ విమానాలను ప్రయోగిస్తారు. ఫ్రాన్స్‌కు చెందిన రక్షణరంగ దిగ్గజం దస్సాల్ట్ ఏవియేషన్ సముద్రయుద్ధ ప్రయోజనాలకు అనుగుణంగా ఈ రాఫెల్ యుద్ధ విమానాలను తయారు చేస్తుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జాతీయ భద్రతపై పనిచేసే మంత్రివర్గ కమిటీ సమావేశం తర్వాత ఫ్రాన్స్‌తోఈ భారీ రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం జరిగింది. 2023 జులైనెలలో భారత రక్షణమంత్రిత్వ శాఖ ఈ భారీ ఒప్పందానికి సంబంధించిన ప్రాథమిక ఆమోదానికి సమ్మతి తెలియజేసింది. దీనికిముందుగా అనేకవిడతలుగా చర్చలు జరిగాయి. ఈ ఒప్పందం కింద భారత నౌకాదళం మరింత బలోపేతం అవుతుంది. అదేవిధంగా నౌకా దళానికి వీటి వినియోగంలో ఎలాంటి సమస్యలూ రాకుండా ఇతర రకాలుగా అనేక విడిభాగాలను కూడా సరఫరా చేస్తారు. వీటి పనితీరును చాలా స్పష్టంగా నిర్ధారించేందుకు అనేక విధాలుగా పరీక్షలు చేసి అందజేస్తారు. ఇప్పటికే ఈ యుద్ధ విమానాలను భారతదేశం ఉపయోగిస్తోంది. కాకపోతే సముద్ర యుద్ధ అవసరాలకు అనుగుణంగా వీటిలోకొద్దిగా మార్పులుంటాయి. అదేవిధంగా ఈ ఒప్పందంవల్ల భారత వాయుసేన, నౌవికాదళం రెండూ ఉమ్మడిగా పనిచేయడానికి యుద్ధ కార్యకలాపాలు, వ్యూహాలు, దాడులు ఉమ్మడిగా నిర్వహించడానికి వీలు కలుతుంది. కొత్తగా యుద్ధ విమానాల సేకరణవల్ల ఉమ్మడి కార్యకలాపాల సామర్థ్యం ఇనుమడిస్తుంది. భారత విమాన వాహక నౌకల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. రక్షణవ్యవస్థకు కొత్తబలం, జవజీవాలు కలుగుతాయి.

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయండి

### పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ లేఖ



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రవాద దాడిపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సిపిఐ ఎంపి పి. సందోష్ కుమార్ లేఖ రాశారు. పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చడం వల్ల పార్టీలకు అతీతంగా సభ్యులంతా కలిసి ఉగ్రవాడి మృతులకు సంతాపం తెలియజేయడానికి, దేశ సంకల్పాన్ని వ్యక్తపరచడానికి వీలు కల్పిస్తుందని రాజ్యసభ ఎంపి అన్నారు. ఈ దాడి బాధితుల బంధువులకు తీవ్ర దుఃఖాన్ని కలిగించడమే కాకుండా దేశ సామూహిక మనస్సాక్షిని కూడా కదిలించిందన్నారు. ఈ క్లిష్ట సమయాల్లో ప్రజా గళాన్ని వినిపించే పార్లమెంటులో ప్రగాఢ దుఃఖాన్ని వ్యక్తపరచడానికి, బాధితులకు నివాళులర్పించడానికి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించడానికి సంఘీభావంగా కలిసి రావడం అత్యంత అవసరమని అన్నారు. ఈ విషాదం తీవ్రత దృష్ట్యా వీలైనంత త్వరగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలను విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఈ ప్రత్యేక పార్లమెంట్ సమావేశం పార్టీలకు అతీతంగా సభ్యులు ఒకే గొంతుతో మృతులకు సంతాపం తెలియజేయడానికి, దేశ సంకల్పాన్ని వ్యక్తపరచడానికి, ఉగ్రవాద చర్యల ద్వారా మనకు హాని కలిగించడానికి ప్రయత్నించే వారిపై భారతదేశం ఐక్యంగా, స్థితిస్థాపకంగా, దృఢంగా ఉందని స్పష్టమైన, బలమైన సందేశాన్ని పంపడానికి వీలు కల్పిస్తుందని సందోష్ కుమార్ లేఖలో పేర్కొన్నారు. ప్రజల స్ఫూర్తి, ఆకాంక్షలను ప్రతిబింబించడానికి, రాజకీయ విభజనలకు అతీతంగా ముందుకెళ్లాలన్నారు. జాతీయ సంతాప సమయంలో ప్రజాస్వామ్య అత్యున్నత వేదిక నుండి సకాలంలో సమష్టిగా సంఘీభావం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తన అభ్యర్థనను పరిశీలించాలని పార్లమెంటరీ వ్యవహారాలశాఖమంత్రిని కోరారు.

## రెచ్చగొడుతున్న పాక్ సైన్యం


### పూంచ్, కుప్వారా జిల్లాల్లో ఎల్‌ఓసి వెంబడి కాల్పులు వరుసగా నాల్గోరోజూ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లో పహల్గామ్‌లో ఉగ్రదాడి తరువాత భారత్, పాక్ మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. అయితే పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. వరుసగా నాల్గోవ రోజు కూడా కాల్పులకు పాల్పడింది. పూంచ్, కుప్వారా జిల్లాల్లో ఎల్‌ఓసి వెంట పాకిస్తాన్ దళాలు కాల్పులకు తెగబడ్డాయని ఆర్మీ అధికారులు సోమవారం తెలిపారు. ఏప్రిల్ 27–28 రాత్రి, కుప్వారాష పూంచ్ జిల్లాలకు ఎదురుగా ఉన్న ప్రాంతాలలో ఎల్‌ఓసి వెంబడి పాకిస్తాన్ ఆర్మీ పోస్టులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపాయని రక్షణశాఖ ప్రతినిధి చెప్పారు. అయితేపాక్ కాల్పులపై భారత దళా లు వేగంగా, సమర్థవంతంగా స్పందించాయన్నారు. ఎవరికీ నష్టం వాటిల్లినట్లు వార్తలు అందలేదన్నారు. పాకిస్తాన్ సైన్యం గురువారం రాత్రి, అలాగే ఏప్రిల్ 2526, ఏప్రిల్ 26–27 మధ్య రాత్రులలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి ఉన్న వివిధ భారతీయ స్థానాలపై కాల్పులు జరిపింది. భారత సైన్యం దీటుగా సమాధానం చెబుతోంది. పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను వేటాడతామని భారత్ ప్రకటించిన నేపథ్యంలో పాకిస్తాన్ సైన్యాన్ని హై అలర్ట్‌లో ఉంచారు. పహల్గామ్ దాడితో సరిహద్దు సంబంధాల దృష్ట్యా, భారత్ గత బుధవారం 65 ఏళ్ల నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, అట్టారీ భూ సరిహద్దు క్రాసింగ్‌ను మూసివేయడం, పాకిస్తాన్ సైనిక దళాలను బహిష్కరించడం వంటి శిక్షాత్మక చర్యలను ప్రకటించింది. అట్టారీ భూ సరిహద్దు ద్వారా దేశంలోకి ప్రవేశించిన పాకిస్తానీయులను మే 1 నాటికి వెళ్లిపోవాలని భారత్ ఆదేశించింది. దీని ప్రతిస్పందనగా, పాకిస్తాన్ గురువారం అన్ని భారతీయ విమానయాన సంస్థలకు తన వైమానిక స్థలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. న్యూఢిల్లీతో వాణిజ్యాన్ని నిలిపివేసింది. సింధు జలాల ఒప్పందాన్ని భారతదేశం సస్పెండ చేయడాన్ని పాకిస్థాన్ తిరస్కరించింది. ఒప్పందం ప్రకారం పాక్‌కు చెందిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి తీసుకునే ఏవైనా చర్యలు 'యుద్ధ చర్య'గా పరిగణించబడతాయని పేర్కొంది. పహల్గామ్ దాడిపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, ప్రధాని నరేంద్రమోడీ గురువారం హంతకులను భూముపై ఏ మూలకు ఉన్నా వెంబడిస్తామని చెప్పారు. ప్రతి ఉగ్రవాదిని, వారికి మద్దతు ఇచ్చేవారిని గుర్తించి, ట్రాక్ చేసి శిక్షిస్తామని ప్రకటించారు.

## దేశ గౌరవానికి హాని సమయంలో బీహార్‌లో మోడీ ఎన్నికల ప్రసంగమా?

### ప్రధాని మోడీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శనాస్త్రాలు



**జైపూర్ :** పర్యాటకులను బలిగొన్న పహల్గామ్ ఉగ్ర దాడిపై చర్చించేందుకు ఏర్పాటైన అఖిల పక్ష సమావేశానికి హాజరు కానందుకు ప్రధానినరేంద్రమోడీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం తూర్పారపట్టారు. జైపూర్‌లో 'సంవిధాన్ బచావో' ర్యాలీలో ఖర్గే ప్రసంగిస్తూ, 'దేశ గౌరవానికి హాని కలిగినప్పుడు మీరు (ప్రధాని మోడీ) బీహార్‌లో ఎన్నికల ఉపన్యాసం ఇస్తుండడం దేశం దురదృష్టం' అని అన్నారు. 'అన్ని పార్టీల నేతలు అఖిల పక్ష సమావేశానికి హాజరయ్యారు. కానీ ప్రధాని మోడీ ఆ సమావేశానికి రాకపోవడం శోచనీయం. బీహార్ ఏమైనా దూరంగా ఉన్నదా? ప్రధాని అఖిల పక్ష సమావేశానికి వచ్చి, ప్రభుత్వ ప్రణాళికను వివరించి ఉండవలసింది. ఆయనకు మా నుంచి కావలసిన సహాయం ఏమిటి?' అని ఖర్గే పేర్కొన్నారు. ప్రధానిపై మరింతగా ఖర్గే విరుచుకుపడుతూ 'మోడీ ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత ఇచ్చారు. అటువంటి వ్యక్తులు దేశాన్ని బలహీనపరుస్తారు. 56 అంగుళాల ఛాతీ కుంచించుకుపోయింది' అని విమర్శించారు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో ఉత్తర ప్రదేశ్‌ను గుజరాత్‌గా మార్చడానికి 56 అంగుళాల ఛాతీ కావాలని అన్న సంగతి విదితమే. దేశమే సర్వోన్నతం కనుక ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నా తాము మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించినట్లు ఖర్గే తెలియజేశారు. 'దేశం సర్వోన్నతం, ఆ తరువాతే పార్టీలు, మతం వస్తాయి. దేశం కోసం అంతా సమైక్యం కావాలి' అని ఆయన పేర్కొన్నారు, కాంగ్రెస్ సమైక్యత గురించి మాట్లాడుతుంటే బిజెపి దానిని విడదీయడం గురించి మాట్లాడుతుంటుందని ఆరోపించారు. 'ఈ దేశంలో రాజ్యాంగం సుప్రీం. మన ప్రజాస్వామ్యం రాజ్యాంగం కింద నడుస్తుంటుంది' అని చెప్పారు. కాంగ్రెస్ నాయకులపై దాడులపైన, దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపైన ప్రభుత్వాన్ని ఖర్గే తీవ్రంగా విమర్శిస్తూ, 'కాంగ్రెస్ వృద్ధి చెందుతున్నప్పుడల్లా ఈ వ్యక్తులు దానిని అణచివేయజూస్తుంటారు. మేము అణచివేతకు గురయ్యేవారం కాము' అని అన్నారు. బిజెపి నేతలు ప్రతి ఒక్కరినీ బలహీనపరచజూస్తున్నారని, కానీ ప్రజలపై 'తప్పుడు' కేసులు బనాయించడం ద్వారా వారు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచజాలరని ఖర్గే అన్నారు.

## ఢిల్లీ జెఎన్‌యు విద్యార్థి సంఘం ప్రెసిడెంట్‌గా నితీష్ విజయం

### ఎబివిపి అభ్యర్థి శిఖా స్వరాజ్‌ని ఓడించిన ఎఐఎస్‌ఎ అభ్యర్థి నితీష్

### నాలుగింటిలో 3 సెంట్రల్ ప్యానెల్ పోస్టుల్లో 'వామపక్ష' అభ్యర్థులదే గెలుపు

**న్యూఢిల్లీ :** ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఢిల్లీలోని జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్సిటీ స్టూడెం ట్స్ యూనియన్ (జెఎన్‌యుఎస్‌యు) ఎన్నికలలో వామపక్ష అభ్యర్థులు విజయం సాధించి జెఎన్‌యులో మరోసారి తమ పట్టును నిలబెట్టుకున్నారు. సెం ట్రల్ ప్యానెల్ పోస్టులు నాలుగింటిలో వామపక్ష అభ్యర్థులు మూడింటిని కైవసం చేసుకున్నారు. అయితే జెఎన్‌యు విద్యార్థి సంఘం ఎన్నికలలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ), డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (డి.ఎస్.ఎఫ్) ఒకే కూటమిగా పోటీచేసి అధ్యక్ష, ఉపాధ్యక్ష, జనరల్ సెక్రటరీ పోస్టులను గెలుచుకోవడం విశేషం. ఋఇదిలాఉంటే ఆర్ఎస్ఎస్ అనుబంధ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి)జెఎన్‌యులో9సంవత్సరాలసుదీర్ఘకాలవిరామం తర్వాత జాయింట్ సెక్రటరీ పోస్ట్‌ను గెలుచుకుని ఎట్టకేలకు తమ ఉనికిని ప్రదర్శించారు. ఈ ఏడాది జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో వామపక్ష కూటమిలో చీలిక కనిపించింది. ఏఐఎస్‌ఏ, డిఎస్‌ఎఫ్ ఒకే కూటమిగా పోటీచేశాయి. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, బిర్సా అంబేద్కర్ ఫూలే స్టూడెంట్స్ అసోసియేషన్ (బిఏపిఎస్ఏ), పిఎస్ఏలతో సంకీర్ణాన్నిఏర్పరచుకున్నాయి.ఏప్రిల్ 25(శుక్రవారం)న జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. జెఎన్‌యుఎస్‌యు ఎలక్షన్ కమిషన్ వెల్లడించిన ఎన్నికల ఫలితాల ప్రకారం ఏఐఎస్‌ఏకు చెందిన నితీష్‌కుమార్ 1,702 ఓట్లతో జెఎన్‌యుఎస్‌యు ప్రెసిడెంట్‌గా గెలుపొందారు. నితీష్ సన్నిహిత పోటీదారు ఎబివిపికి చెందిన శిఖా స్వరాజ్ 1,430 ఓట్లను సాధించి రెండవ స్థానంలో నిలువగా, ఎస్‌ఎఫ్ఐ మద్దతు ఇచ్చిన తయబ్బా అహ్మద్ 918ఓట్లను సాధించి మూడవ స్థానాన్ని దక్కించుకున్నారు. ఏఐఎస్‌ఏతో జతకట్టిన డిఎస్‌ఎఫ్ అభ్యర్థి మనీషా 1,150 ఓట్లను సాధించి జెఎన్‌యుఎస్‌యు వైస్ ప్రెసిడెంట్‌గా విజయం సాధించారు. ఎబివిపిఅభ్యర్థి నిట్టు గౌతమ్‌పై మనీషా గెలుపొందారు. నిట్టు గౌతమ్‌కు 1,116 ఓట్లు లభించాయి. జనరల్ సెక్రటరీగా డిఎస్‌ఎఫ్‌కు చెందిన మున్‌తెహా ఫాతిమా1,520ఓట్లను సాధించి ఎబివిపి అభ్యర్థి కునాల్ రాయ్‌పై గెలుపొందారు. కునాల్‌రాయ్ 1,406 ఓట్లను సాధించారు. అయితే ఎబివిపి అభ్యర్థి వైభవ్ మీనా 1,518 ఓట్లు సాధించి జెఎన్‌యుఎస్‌యు జాయింట్ సెక్రటరీ పదవిని దక్కించుకున్నారు. వైభవ్ మీనా ఏఐఎస్‌ఏకు చెందిన నరేష్ కుమార్‌పై గెలుపొందారు. జాయింట్ సెక్రటరీ పదవికి పోటీపడిన నరేష్‌కుమార్‌కు 1,433ఓట్లు లభించగా ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (పిఎస్‌ఏ) అభ్యర్థి నిగమ్‌కుమారి1,256ఓట్లుదక్కించుకునిమూడోస్థానంలో నిలిచారు.

## నీట్ యుజి పరీక్ష నిర్వహణపై కేంద్రం అలర్ట్

**న్యూఢిల్లీ :** వైద్య విద్య కోర్సులో ప్రవేశాల కోసం ఉద్దేశించిన నీట్ యుజి పరీక్షను మే 4న పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పరీ క్ష సందర్భంగా ఎటువంటి లోపాలకు తావులేకుండా అన్నిరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని కలెక్టర్లు, ఎస్‌పిలతో వరుస సమావేశాలను నిర్వహిస్తోంది. గతేడాది నీట్ పరీక్ష పేపర్ లీక్ అవ్వడం, ఇతర అవాంతరాల కారణంగా పలుపరీక్షలు రద్దవ్వడంతో కేం ద్రం ఈసారి పటిష్ట చర్యలు చేపట్టింది. 'నీట్ యుజి పరీక్షను సజావుగా నిర్వహించడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కలెక్టర్లు,ఎస్పీలతో వరుస సమావేశాలు జరిగాయి. భద్రత, నిర్వహణ గురించి జిల్లా స్థాయి సమన్వయ కమిటీలను ఏర్పాటు చే శారు. కేంద్రాల వద్ద ఎన్‌టిఎ నియమించిన భద్రతతో పాటు జిల్లా పోలీసుల బహుళ స్థాయి తనిఖీలుఉంటాయి. ప్రశ్నాపత్రాలు, ఒఎంఆర్ షీట్లు వంటి సామగ్రి రవాణా పూర్తిగా గోప్యంగా పోలీసుల పర్యవేక్షణలో జరుగుతుంది. లీకేజీ, ఛీటింగ్‌ను అడ్డుకునేందుకు కోచింగ్ సెంటర్లు, డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లను పోలీసులు పర్యవేక్షిస్తారు.

## 16 పాక్ యూట్యూబ్ చానెళ్లను నిషేధించిన కేంద్రం

### భారత్‌పై విషం కక్కుతున్న పాక్ చానళ్లు.. డాన్, జియో న్యూస్ వంటి యూటూబ్ వార్తా చానెళ్లపై నిషేధం.. పహల్గామ్ దాడిపై బిబిసి వార్తకు కూడా ఖండన



**న్యూఢిల్లీ :** భారత్ గురించి 'తప్పుడు, రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను' ప్రసారం చేస్తున్నాయనే ఆరోపణపై 16 పాకిస్తానీ యూ ట్యూబ్ చానెళ్లను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని, అదే సమయలో పహల్గామ్ దాడిపై బిబిసి ప్రసారం చేసిన వార్తకు కూడా కేంద్రం తీవ్ర స్థాయిలోఅభ్యంతరం వ్యక్తం చేసిందని అధికారులు సోమవారంవెల్లడించారు. జమ్మూకాశ్మీర్‌లోని పర్యాటక పట్ట ణం పహల్గామ్ మైదాన ప్రాంతంలో ఈ నెల 22ప ఉగ్ర దాడి నేపథ్యంలో కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ (ఎంహెచ్‌ఎ) సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నది. ఆ దాడిలో పర్యాటకులతో సహా 26 మంది వ్యక్తులు హతులైన విషయం విదితమే. ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొన్న బిబిసి ప్రసారం చేసే వార్తలను విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) పర్యవేక్షించనున్నదని అధికారులు తెలిపారు. కేంద్రం నిషేధించిన పాక్ యూట్యూబ్ చానెళ్లలో డాన్ న్యూస్, ఇర్షాద్ భట్టి, సమా టివి, ఎఆర్‌వై న్యూస్, బిఒఎల న్యూస్, రఫ్తార్, ది పాకిస్తాన్ రెఫరెన్స్, జియో న్యూస్, సమా స్పోర్ట్స్, జిఎన్‌ఎన్, ఉజెయిన్ క్రికెట్, ఉమర్ చీమాఎక్స్‌క్లూజివ్, ఆ స్మా షిరాజి, మునీబ్ ఫారూఖ్, సునో న్యూస్, రజీనామా ఉన్నాయి. జ మ్ముకశ్మీర్ పహల్గామ్ ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో భారత్‌పైన, సైన్యం,భద్రతాసంస్థలపైన రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన అంశాలను, అసత్య, తప్పుదోవ పట్టించే కథనాలను ప్రసారం చేస్తున్నందుకుపాకిస్తానీ యూట్యూబ్ చానెళ్లను హో మ్ మంత్రిత్వశాఖ సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని అధికారులు వివరించారు.

### బిబిసి భారత్ అధిపతికి విదేశాంగశాఖ లేఖ

పహల్గామ్‌లో ఇటీవలి భీకరఉగ్ర దాడికి సంబం ధించి ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ బిబిసి ప్రచురించిన ఒక కథనంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ దాడిని 'తీవ్రవాదుల దాడి'గా అభివర్ణించడాన్ని కేంద్రం ఆక్షేపిస్తూ, బిబిసి పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తోందని ఆరోపించింది. విదేశాంగ శాఖ ఈ మేరకు బిబిసి భారత్ విభాగం అధిపతి జాకీ మార్టిన్‌కు లేఖ రాసింది. 'కశ్మీర్‌లో దాడి తరువాత భారతీయులకు వీసాలను పాకిస్తాన్ రద్దు చేసింది' అనే శీర్షికతో బిబిసి ప్రచురించిన కథనంలో పహల్గామ్ ఘటనను ఉగ్రవాద చర్యగా పేర్కొనడానికి బదులు 'మిలిటెంట్ దాడి' అని ప్రస్తావించడంపై కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది వాస్తవాలను వక్రీకరించడమేనని, బాధితుల పట్ల అగౌరవాన్ని సూచిస్తుందని కేంద్రం తన లేఖలో పేర్కొన్నది. ఉగ్ర దాడి తీవ్రతను తగ్గించి చూపే యత్నం చేశారని ప్రభుత్వం విమర్శించింది. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని బిబిసికి సూచిస్తూ, ఈ నెల 22న పహల్గామ్‌లో జరిగిన దాడికి సంబంధించిన పూర్తి వివరాలను కూడా విదేశాంగ శాఖ తన లేఖతో పాటు పంపింది. 'ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొనడంపై బిబిసికి ఒక లేఖ పంపడమైంది. ఎంఇఎ విదేశీ ప్రచార విభాగం బిబిసి వార్త పంపే తీరును పర్యవేక్షించనున్నది' అని అధికారి ఒకరు తెలియజేశారు. ఆ రోజు పట్టపగలు, రద్దీగా ఉన్న ప్రాంతంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఆ ఘటనను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి కూడా.

## పర్యాటకులను సురక్షితంగా తిప్పి పంపలేకపోయాం..

### జమ్ము కశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన



**జమ్మూ :** పహల్గామ్ సమీపం బైసరన్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన కాల్పుల హత్యాకాండను వ్యతిరేకిస్తూ జమ్మూ కశ్మీరు శాసనసభ సోమవారంనాడు ఒక తీర్మానం చేసింది. రాష్ట్రానికి అతిథులుగా వచ్చిన పర్యాటకులకు తమ ప్రభుత్వం రక్షణ ఇవ్వలేకపోయిందనీ, వారికి కాపాడుకోలేకపోయిందని శాసనసభలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీరు ప్రజలు అసాధారణరీతిలో వీధుల్లోకి వచ్చి ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేశారని, మృతుల కుటుంబాలకు సంఘీభావం ప్రకటించి సంతాపాలు తెలియజేశారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జమ్మూ కశ్మీరుకు రాష్ట్రప్రతిపత్తిని పునరుద్ధరించమని తాను కేంద్రాన్ని కోరలేననీ, మరో సందర్భం చూసి అడుగుతాననీ అన్నారు. దేశ వ్యాప్తంగా వెళ్ళి చదువుకుంటున్న కశ్మీరీ విద్యార్థులు, వివిధ ప్రాంతాలలో పర్యటనలు చేస్తున్న కశ్మీరీయుల భద్రతకు పూర్తి భరోసా ఇవ్వాలని, వారి భద్రతకు, గౌరవ మర్యాదలకు భంగం కలగకుండా వేధింపులు లేకుండా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు భరోసా ఇవ్వాలని కూడా తీర్మానంకోరింది.సంయమనంపాటించి హింసనువిద్వేషాన్నితిరస్కరించాలనిఅన్నిపార్టీలకు, సంస్థలకు, సంఘాలకు, పౌర గ్రూపులకు, మత విభాగాలకు, జర్నలిస్టులకు విజ్ఞప్తి చేసింది. శాంతిరక్షణకుకృషిచేయాలనిఅసెంబ్లీ తీర్మానం కోరింది. ఇలాంటి దాడులు గతంలో చాలా జరిగాయనీ, కానీ గడచిన రెండు దశాబ్దాలలో జరిగిన అతిపెద్ద సంఘటన ఇదేనని ఆయన పేర్కొన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి ఘటనను చర్చించేందుకు జమ్మూ కశ్మీరు శాసనసభ అత్యవసర ప్రత్యేక సమావేశం నిర్వహించింది. పలువురు ఎంఎల్‌ఎలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. దాడిని వ్యతిరేకిస్తూ జమ్మూ కశ్మీరు ఉపముఖ్యమంత్రి సురిందర్ చౌధరి తీర్మానం ప్రవేశపెట్టారు. మూజువాణీ ఓటు ద్వారా తీర్మానం ఆమోదం పొందింది. ఈనెల 22న పహల్గామ్‌లో జరిగిన హత్యాకాండలో 26 మంది పర్యాటకులు బలయ్యారు. వీరిలో ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. మృతులకు శాసనసభ తొలుత నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించింది. సంతాప తీర్మానం చేసింది. ''శాంతి వాతావరణాన్ని పెంపొందించేందుకు, అభివృద్ధికి, అన్ని వర్గాల ప్రజలను మేళవించిసర్వసమ్మిళితమైన పురోగతిని సాధించేందుకు తిరుగులేని చిత్తశుద్ధిని జమ్మూ కశ్మీరు శాసనసభ ప్రకటిస్తున్నది. మతసామరస్యాన్ని దెబ్బతీసే ఉగ్రవాదుల దుశ్చర్యలను ఓడిస్తామని కృతనిశ్చయం ప్రకటిస్తున్నాం, జమ్మూకశ్మీరు ప్రగతి, దేశ ప్రగతికి కట్టుబడి ఉన్నాం'' అని తీర్మానంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి ఇళ్ళకు పంపడంలో తమ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.''జమ్మూకశ్మీరులో భద్రత బాధ్యతరాష్ట్రంలో ఎన్నికైన ప్రభుత్వానిది కాదు, కానీ బాధ్యతగా భావిస్తున్నాం, ఈ ఉగ్రవాద దాడి అవకాశాన్ని అసరాగా తీసుకుని జమ్మూ కశ్మీరుకు రాష్ట్రప్రతిపత్తి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ ప్రస్తుత విషాద సమయంలో అడగదలచుకోలేదు,మరో సందర్భంలో అడుగుతాం, అడగడం మానుకోం, ఇలాంటి పరిస్థితుల్లో నేను ఏ విధంగా రాష్ట్రప్రతిపత్తి పునరుద్ధరించమని కేంద్రాన్ని ఒత్తిడి చేయగలను? అని ఆయన అన్నారు. బైసరన్‌లో దాడి ఘటన కొత్తదేమీ కాదు, కానీ 21 సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇలాంటి ఘటన జరిగింది. ఇలాంటి దాడులన్నీ మా దృష్టిలో గత చరిత్ర, కానీ దురదృష్టవశాత్తూ, పహల్గామ్‌లో ఈ దాడి పునరావృతమైంది, ఈ విధమైన దాడి మళ్ళీ ఎప్పుడు జరుగుతుందన్న విషయం మనకు తెలియదు, మరణించినవారి కుటుంబాలకు మాటలద్వారా నేను ఓదార్పు ఇవ్వలేను, నాకు మాటలు కరువయ్యాయి'' అని ఆయన అన్నారు.

## ముంబయి దాడిలో ఉగ్రవాది రాణాకు 12 రోజులు ఎన్‌ఐఎ కస్టడీ



**న్యూఢిల్లీ:** ముంబైలో ఉగ్రవాద దాడుల సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణాకు ఢిల్లీ కోర్టు 12 రోజులపాటు ఎన్‌ఐఎ (జాతీయ దర్యాప్తు సంస్థ) కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్‌ఐఎ ప్రత్యేక న్యాయమూర్తి చందర్‌జిత్ సింగ్ ఈ ఉత్తర్వు ఇచ్చారు. ఇంతకు ముందు 18 రోజులు ఎన్‌ఐఎ కస్టడీలో ఉంచుతూ ఇచ్చిన గడువు పూర్తి కావడంతో మరో 12 రోజులు గడువు పొడిగించారు. వివిధ సాక్ష్యాలను ఇంకా రాబట్టాల్సి ఉందని ఎన్‌ఐఎ అధికారులు కోర్టుకు తెలియజేశారు. ఎన్‌ఐఎ తరపున సీనియర్ న్యాయవాది దయన్ క్రిష్ణన్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేంద్ర మాన్‌లు వాదిస్తుండగా, నిందితుడు రాణా దర్యాప్తుకు సహకరించడం లేదు. న్యాయవాది పీయూశ్ సచ్‌దేవ రాణా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన ఢిల్లీ లీగల్ సర్వీస్ అథారిటీకి చెందినవారు. ముంబైలో దాడులతోపాటు అనేక దాడులకు అతడు సూత్రధారిగా ఉన్నాడనిఇ అధికారులు కోర్టుకు తెలియజేశారు. రాణాకు వైద్యపరీక్షలు చేయాలని కోర్టు తొలుత ఆదేశించింది. ప్రతి రెండు రోజులకూ తన లాయర్‌ను కలుసుకునేందుకు అతడికి అనుమతి లభించింది.

SHRIRAM Finance | వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP25X 8375 | VASU MADIKONDA | TATA ACE | 2013 |
| 2 | TS03EM 6678 | KOMMIDI VENU | I10 GRAND 2ND GEN MAGNA DIESEL | 2015 |
| 3 | TS25C 5819 | DARMENDAR RASAMALLA | JOHN DEERE 5042 | 2019 |
| 4 | TS24G 1092 | SRIKANTH KOMMU | ERTIGA ZDI BS4 DIESEL 7 SEATER | 2013 |

AUCTION DATE : 03-05-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426



# జనరల్
STATE & REGIONAL NEWS

## తెలుగుభాషా నైపుణ్యం ఉండాల్సిందే

**న్యూఢిల్లీ :** తెలంగాణలో సివిల్ జడ్జీ పోస్టుకు అర్హత సంపాదించాలంటే తెలుగుభాషలో నైపుణ్యం ఉండాల్సిందేనని సుప్రీంకోర్టు పేర్కొంది. తెలుగు భాషలో నైపుణ్యం ఉండాల్సిందేనంటూ 2023లో చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మషితో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. తెలుగులో భాషా నైపుణ్యం ఉన్నవారికే ఈ పోస్టు ఇవ్వాలంటూ రెండేళ్ళ 2024లో జారీ చేసిన నోటీసు ప్రకారం సివిల్ జడ్జీ పోస్టుకు దాఖలు చేశారు. కానీ తెలుగుభాష తెలియదన్న కారణంగా ఆయనను తిరస్కరించారు. దీంతో ఆ న్యాయవాది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2023 నాటి తెలంగాణ జ్యుడీషియల్ (సర్వీస్ అండ్ కేడర్)లో ఉన్న రూల్ 5.3 7(ఐ)లను పిటిషనర్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. తెలుగు లేదా ఉర్దూ భాషలో నైపుణ్యం ఉండాలన్న నిబంధనపై తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. రాతపరీక్షల్లో ఇంగ్లీషు నుండి తెలుగులోకి ఇంగ్లీషు నుండి ఉర్దూలోకి తర్జుమాలు చేయాలన్న నిబంధనను వ్యతిరేకించారు. తెలంగాణలో ఉర్దూభాషను రెండో అధికారభాషగా ప్రభుత్వం గుర్తించింది. ఐతే ఈ పిటిషన్‌పై విచారణ లేకుండా కోర్టు కొట్టివేసింది.

## ప్రతి అంశంపైనా వెంటాడుతాం: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే తగిన సమయం ఇచ్చామని, ఇకపై ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని వెంటాడుతామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ప్రజలను చైతన్యపరిచేందుకు, ప్రభుత్వ వైఫల్యాలను, దోపిడీ చర్యలను మీడియా ద్వారా ఎండగట్టాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ జిల్లాల్లో జరిగిన బిఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసినందుకు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే అరాచకాలను, వారి ప్రచా రాలను ఎక్కడికక్కడ ఎదుర్కొని ప్రజల్లో స్పష్టత తీసుకురావాలని, మరింత చురుకుగా ముందుకు సాగాలని కెటిఆర్ సూచించారు.

**కెటిఆర్‌కు వెన్నులో గాయం ....**

జిమ్ వర్క్ అవుట్ చేస్తుండగా వెన్నులో గాయపడినట్లు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు కెటిఆర్ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు.

## కెటిఆర్‌పై కేసు కొట్టేసిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన రూ.2500 కోట్లను దిల్లీకి పంపారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారని పేర్కొంటూ బంజారాహిల్స్ పీఎస్‌లో నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది. గత ఏడాది మార్చి 27న చేసిన కేటీఆర్ చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయంటూ బి.శ్రీనివాసరావు ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ దాఖలైంది. దీనిని కొట్టేయాలని కెటిఆర్ వేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ జస్టిస్ లక్ష్మ ణ్ సోమవారం తీర్పు చెప్పారు. మూడు రోజులు ఆలస్యంగా ఫిర్యాదు చేయడానికి కారణాలు పేర్కొనలేదని, ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని, ఎలాంటి ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలు చెల్లవని, దీనిపై విచారణను కొనసాగిస్తే అది న్యాయప్రక్రియను దుర్వినియోగం చేసినట్లు అవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## లేఔట్ రూపాన్ని మార్చితే చర్యలు

### ఆక్రమణలు తొలగించాలన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లేఔట్ రూపాన్ని మార్చవద్దని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాత్ సూచించారు. ఎవరికి వారు వారికి అనుగుణంగా లేఔట్ రూపాన్ని మార్చేసి, రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 63 ఫిర్యాదులు అందాయి. లేఔట్లలో రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాలపై చాలా వరకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంశంపై దృష్టి పెట్టాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలిలోని సర్వే నెంబరు 124, 125లో 20 ఎకరాల పరిధిలో ఫెర్టిలైజర్ కార్పొరేషన్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ కాలనీ లేఔట్ ఉంది. 162 ప్లాట్లు కాగా రహదారులు, పార్కుల హద్దులు చెరిపేసి షెడ్డులు, నిర్మాణాలు చేపట్టి మొత్తం వాణిజ్య పరంగా సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు వినియోగించుకుంటున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమ లేఔట్‌లోని ప్లాట్లు, రహదారులు చూపాలని, వాటిని పునరుద్ధరించాలని అభ్యర్థించారు. పోచారం మున్సిపాలిటీలోని దివ్యానగర్ లేఔట్‌లో కూడా రహదారులను ఆక్రమించి షెడ్డులు, నిర్మాణాలు నల్లమల్లా రెడ్డి చేపట్టారని కొంతమంది ప్లాట్ యజమానులు ఫిర్యాదు చేశారు. తనకు అనుకూలంగా దివ్యానగర్ లేఔట్‌ను మార్చుకుని ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టారని వాపోయారు. 200 ఎకరాల దివ్యానగర్ లేఔట్ చుట్టూ ఉన్న ప్రహరీని తొలగించి, రహదారుల్లో ఆంక్షలు లేకుండా చేసిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. 2 వేలకు పైగా ఉన్న దివ్యానగర్ లేఔట్‌లో హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన స్థలాన్ని తామిస్తామని అక్కడి భూ యజమానులు హనుమంత రెడ్డి, జైపాల్ రెడ్డితో పాటు పలువురు కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు.

శేరిలింగంపల్లి పరిధిలోని కొండాపూర్, మజీద్ బండ సిఎంసి ఎన్‌క్లేవ్‌లో కూడా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ఆసిఫ్ పటేల్ అనే వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఎన్‌క్లేవ్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మున్సిపాలిటీలోని తౌతానికుంటలో మట్టి నింపి, భగీరథమ్మ చెరువుకు వెళ్లే వరద కాలువలు మూసేయడంతో తమ నివాస ప్రాంతాలను వర్షపు నీరు ముంచెత్తుతోందని రెసిడెంట్స్ సొసైటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ గ్రామం సర్వే నంబరు 9,10లోని పది ఎకరాల లే ఔట్‌లో పార్కుకు ఎకరం కేటాయించగా, ఇప్పుడు అక్కడ కూడా ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. అక్రమ నిర్మాణాలకు అనుమతులు న్నాయా లేదా పరిశీలించి వెంటనే వాటిని తొలగించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలి :మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** తెలంగాణ ప్రజాప్రభుత్వం తీసుకొచ్చిన 'భూభారతి' దేశానికే రోల్ మోడల్ అని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం మంత్రి సురే ఖ ఎంపి రఘునందన్ రావు , పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు లతో కలసి ఇక్కడ నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా రెండు నిముషాలపాటు మౌనం పాటించారు. మంత్రి తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును ప్రారంభించారు. భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలన్నారు. దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వానికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఎంపి రఘునందన్‌రావుకు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూ భారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి స్థారకత ఏర్పడుతుందన్నారు. రైతులు , ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భూ భారతి దేశానికి రోల్ మోడల్ అన్ని అన్నారు.ఇంటి స్థలాకు అబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారాన్ని కూడా పొందుపరిచారని తెలిపారు.

# గ్రూప్–1 భర్తీ కోసం కమిషన్ అప్పీల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో గ్రూప్–1 పోస్టుల భర్తీ నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఈ నెల 17న హైకోర్టు సింగిల్ జడ్జి జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) డివిజన్ బెంచ్ ఎదుట అప్పీలు పిటిషన్ దాఖలు చేసింది. దీనిని యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ నేతృత్వంలోని ద్విసభ్యౌ ధర్మాసనం మంగళవారం విచారణ చేయనుంది. గ్రూప్–1 మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ ఎం. పరమేశ్ మరో 20 మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ఈ నెల 17న నియామకాలు చేపట్టరాదని మధ్యంతర ఆదేశాలు ఇచారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని తాము అప్పీల్ దాఖలు చేసినట్లు సర్వీస్ కమిషన్ లాయర్ చెప్పారు మంగళవారం అప్పీల్ విచారణకు రానుందని చెప్పడంతో 21 మంది అభ్యర్థుల పిటిషన్లపై విచారణను బుధవారానికి వాయిదా పడింది. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్షా కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్ల వాదన. ఈ కేసులో వెలువడిన మధ్యంతర ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని సర్వీస్ కమిషన్ సోమవారం అప్పీల్ దాఖలు చేసింది.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సస్పెండ్ చేయడం ద్వారా నియామకాల ప్రక్రియ పూర్తయ్యేలా చేయాలని కోరింది. టీజీపీఎస్సీ తరపున అదనపు కార్యదర్శి, నోడల్ అధికారి ఆర్.సుమతి అప్పీలు దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని మూడు పోలీస్ కమిషనరేట్‌ల పరిధిలో పరీక్షలు జరిగాయని. మొదట 45 సెంటర్లను గుర్తించామని తెలిపారు. సీవీఆర్ కాలేజీలో



మొదట 984 ప్రతిపాదించామని, మహిళా విశ్వవిద్యాలయంలో పరీక్ష కేంద్రంలో గ్రౌండ్ ఫ్లోర్ ఎత్తు ఎక్కువగా ఉండటంతో దివ్యాంగులు మెట్లు ఎక్కడం కష్టమని గుర్తించామన్నారు. అందువల్ల ఇక్కడ నుంచి 87 మందిని సీవీఆర్ కాలేజీకి కేటాయించామన్నారు. అదేవిధంగా సెయిట్ పీటర్స్ ఇంజనీరింగ్ కాలేజీలో 504 నుంచి 358 మందికి తగ్గిందన్నారు. 24 మంది సామర్థ్యం ఉన్న గదిలో దివ్యాంగులకు తోడుగా పరీక్ష రాయడానికి వస్తుంటారని, అందువల్ల గదికి ఆరుగురినే కేటాయించాల్సి ఉందన్నారు. అందువల్ల అభ్యర్థుల సర్దుబాటు, నిష్పత్తి, వికలాంగులు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అదనంగా మరో కేంద్రాన్ని చేశామన్నారు. మొదట 45 సెంటర్లుగా పేర్కొన్నప్పటికీ 46 సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షకు హాజరైన సంఖ్యపై వివాదం లేవనెత్తుతున్నారని, సూపరింటెండెంట్‌ల సమాచారం మేరకు హాజరైన వారి సంఖ్య 21075గా ప్రకటించామన్నారు. అనంతరం ఉపయోగించిన, ఉపయోగించని జవాబు పత్రాలు, ఓఎంఆర్, నామినల్ రోల్స్ అన్నీ సరిచూసుకుని వాస్తవ సంఖ్యగా 21085 ప్రకటించామన్నారు. దీనిపై హైకోర్టు విచారణ చేయనుంది.

### గ్రూప్–1 అభ్యర్థులకు భారీ ఫైన్

**అఫిడవిట్లలో అవాస్తవాలపై హైకోర్టు ఆగ్రహం**

గ్రూప్–1 మూ ల్యాంకనంలో అవకతవకలు జరిగాయని తప్పుడు వివరాలతో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. తప్పుడు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసిన అభ్యర్థులకు రూ.20 వేల జరిమానా వేసింది. వారిపై తగిన చర్యలు చేపట్టాలంటూ జ్యుడిషియల్ రిజిస్ట్రార్‌కు ఆదేశించింది. గ్రూప్–1 మెయిన్ పరీక్షల వాల్యుయేషన్, ఫలితాల విడుదల చేసిన విధానం లోపభూయిష్టంగా ఉందని, తాజాగా రీవాల్యుయేషన్ జరిపి ఫలితాలు వెల్లడించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ముత్తయ్య ఇతరులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ నగేశ్ భీమపాక విచారించారు. టీజీపీఎస్సీ తరపు న్యాయవాది కల్పించుకుని నకిలీ పత్రాలతో పిటిషన్ వేశారని చెప్పారు పిటిషనర్లు చెబుతున్న ఎం. రాహుల్‌కు చెందిన హాల్‌టిక్కెట్‌లో సబ్జెక్ట్‌లు వారీగా మార్కులు సమర్పించామని, మొత్తం 192.5 మార్కులు రాగా, పిటిషనర్ల ప్రకారం 392.5 మార్కులు వచ్చాయన్నారు. 392.5 మార్కుల నుంచి 192.5 మార్కులకు తగ్గితే ఆ అభ్యర్థి ప్రశ్నించకుండా ఉండరన్నారు. ప్రస్తు త పిటిషన్‌లో మార్కులు తక్కువ వచ్చాయని చెబుతున్న రాహుల్ పిటిషనర్‌గా లేరన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేయడమే కాకుండా జరిమానా విధించారు.

# పరువుహత్యలకు కఠినశిక్ష పడాల్సిందే

### మద్రాసు హైకోర్టు తీర్పుకు సుప్రీం సమర్థన

**న్యూఢిల్లీ :** పరువు హత్యలకు పాల్పడేవారికి తప్పనిసరిగా కఠినశిక్ష పడాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మద్రాసు హైకోర్టు ఒక కేసులో 2022లో ఇచ్చిన తీర్పును జస్టిస్ సుధాంషు ధూలియా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రలతో కూడిన ధర్మాసనం సోమవారంనాడు సమర్థించింది. మృతురాలి తండ్రి సోదరులే ఈ పరువుహత్యకు పాల్పడ్డారు. వారితోపాటు మరో తొమ్మిది మంది దోషులుగా తేలారు. మద్రాసు హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు తిరస్కరించింది. పరువు హత్య కేసులో 11 మందికి శిక్ష పడింది. 2003 మే నెలలో ఒక జంట పెద్దలకు తెలియకుండా కులాంతర వివాహం చేసుకుంది. గ్రామస్తులందరి సమక్షంలో వారంతా చూస్తుండగానే ఈ జంటకు విషం ఇచ్చి చంపారు. మరణిం



చిన జంట మురుగేశన్, కన్నగి కుటుంబం తరపున సుప్రీంకోర్టులో న్యాయవాది ప్రియదర్శిని రాహుల్ వాదించారు. బాధిత మురుగేశన్ కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని, ఈ పరిహారం తమిళనాడు ప్రభుత్వమే చెల్లించాలని ధర్మాసనం పేర్కొంది. ఇరవైఏళ్ళ వయసులో ఈ జంట కులాలకు అతీతంగా కుటుంబాలను ఎదిరించి రహస్యంగా వివాహం చేసుకుంది. కన్నగి వన్నియార్ కులానికి చెందినదికాగా, మురేగేశన్ దళిత కుటుంబానికి చెందినవాడు. కడలూరు జిల్లాలో వీరిద్దరూ ఒకే గ్రామానికి చెందినవారు. భారతదేశంలో వేళ్ళూనుకుపోయిన కులవ్యవస్థ కారణంగా ఈ నేరం జరిగిందని సుప్రీంకోర్టు పేర్కొంది.ఇదెంతమాత్రం సమ్మతించదగినది కాదనీ, దీనిని పరువుహత్యగానే పరిగణించాలని తన 73 పేజీల తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ కేసులో ఐపిసి సెక్షన్ 217 కింద పొఒలీసు అధికారులు తమ విధులను నిర్లక్ష్యం చేశారని పేర్కొంది. చట్టాన్ని గౌరవించలేదని పేర్కొంది. 2004లో మురుగేశన్ కుటుంబం హైకోర్టు వెళ్ళగా ఈ కేసును న్యాయస్థానం సిబిఐకి అప్పగించింది. ఎఫ్ఐఆర్ దాఖలు చేయడానికి కూడా చాలా ఆలస్యం జరిగింది. తీవ్ర నిర్లక్ష్యం ఈ కేసులో జరిగిందని, అధికారులు తమ బాధ్యతలు పాటించలేదని కోర్టు పేర్కొంది. ఈ కేసులో తీర్పు రావడానికి 18 సంవత్సరాలు జాప్యం జరగడం తీవ్ర దురదృష్టకరమైన విషయమని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది.

# అవినీతి నిరోధక శాఖకు చిక్కిన ఎస్‌ఐ

### శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రూ.22 వేలు లంచం
### రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎసిబి అధికారులు
### లంచం డబ్బును డస్ట్‌బిన్‌లో వేయాలని బాధితుడికి సూచించిన ఎస్‌ఐ పరుశరామ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో లంచం తీసుకుంటుండగా ఎస్‌ఐ పరుశరామ్‌ను అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) అధికారులు సోమవారం మధ్యాహ్నం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ వివరాలు వెల్లడించారు. నగర శివారు ఉప్పల్ ప్రాంతంలోని ఓ ఆయిల్ కంపెనీ గోదాం నుంచి నూనె విక్రయించే క్రమంలో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదైంది. చీటింగ్ చేసిన వ్యక్తిని ఆ కేసు నుంచి తప్పించేందుకు బెయిల్ మంజూరు చేసేందుకు సదరు ఎస్‌ఐ పరుశరామ్ లంచంగా రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. ఆ డబ్బులను ఎస్‌ఐ పరుశరామ్ తన కారులో పెట్టాలని బాధితుడికి చెప్పగా కారులో రెండు లక్షలు పెట్టాడు. తిరిగి అందులో డబ్బులు తక్కువగా ఉన్నాయని రూ.25 వేలు డిమాండ్ చేయగా బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. ఎసిబి అధికారుల సూచనల మేరకు సోమవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న బాధితుడు మధ్యాహ్నం సమయంలో ఎస్‌ఐ పరుశరామ్‌ను కలువగా తన సీటు పక్కన డస్ట్ బిన్ ఉంటుందని అందులో రూ.22 వేయాలని బాధితుడికి సూచించారు. దీంతో బాధితుడు ఆ డబ్బులను డస్ట్‌బిన్‌లో వేసి ఎసిబి అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడే




కాపు కాసిన ఎసిబి అధికారులు ఎస్‌ఐ పరుశరామ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో తాను డబ్బులు డిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ ఒప్పుకున్నారు. ఇందులో ఇంకా ఎవరి ప్రమేయం ఉందనే కోణంలో ఎసిబి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రేపు కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఎవరైన అధికారులు లంచం డిమాండ్ చేస్తే 1064కు సమాచారం ఇవ్వాలని అందరి సహకారంతో అవినీతిని అరికడుదామని ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు.

### క్షేత్రస్థాయిలో చట్టాల అమలు

# బాధ్యత అధికారులదే

### రెవెన్యూ, హౌసింగ్, సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించామని, దేశానికి రోల్ మోడల్ గా భూభారతి చట్టాన్ని రాష్ట్రంలో అమల్లోకి తీసుకు వచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన భూభారత్ చట్టం అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ అవగాహన సదస్సులో ముందు గా రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా అందులోని అంశాలను గురించి హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ చదివి వినిపించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు తమ తమ భూ సమస్యలకు సంబంధించి ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురాగా వాటికి భూభారతి చట్టం ద్వారా ఉన్న పరిష్కారం మార్గాలను ఆర్డీవో రాథోడ్ రమేష్, స్థానిక తహసిల్దార్ జగత్ సింగ్ తెలియజేశారు. రైతులు ఈ చట్టానికి సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. పలువురు రైతులు ధరణి పోర్టల్ ద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులు, భూ సమస్యల పరిష్కారం కోసం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా లభించనున్న పరిష్కారం గురించి సభా వేదిక వద్ద మంత్రుల సమక్షంలో వివరించారు. ఈ సందర్భం గా ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని భూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చామని, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే విధంగా చట్టాలను అమల్లోకి తీసుకువస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ చట్టాలను అందులోని అంశాలను పరి



శీలించి, రాష్ట్రవ్యాప్తం గా మేధావులు, రైతులు సలహాలు సూచనలతో రూపొందించిన మార్గదర్శకాలతో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్న మీ ఇంటి వద్దకే రెవెన్యూ అధికారులను పంపించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి వాటిని పరిష్కరిస్తారన్నారు.

సాదా బైనమా అంశాలను ధరణిలో పొందు పరచలేదన్నారు. ధరణి విషయమై భూ సమస్యల పరిష్కారం కోసం కోర్టుల వరకు వెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఈనెల 30వ తేదీ నాటికి అన్ని మండలాల్లో భూభారతి చట్టంపై రైతు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో పైలెట్‌గా ఒక మండలాన్ని ఎంపిక చేసుకొని భూ భారతి చట్టం ద్వారా పరిష్కార మార్గాలను అధికారులు తెలియజేస్తారన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ప్రభుత్వం మండలాల్లో భూభారతి చట్టం సదస్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ మూడవ తేదీన ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రతి భూ సమస్యల పరిష్కారానికి చట్టం ద్వారా అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చట్టాలను అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. అధికారులు ఎక్కడైనా తప్పు చేసినట్లయితే చర్యలు ఉంటాయన్నారు. సాదా బైనామా దరఖాస్తులను కూడా భూభారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. పేదవాడి ప్రభుత్వము. సన్న బియ్యం మాదిరిగానే భూభారతి చట్టంతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని ఎన్ని ఇబ్బందులు ఉన్నా చిత్తశుద్ధితో ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు ను ప్రారంభించగా గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని, తమ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టులు పూర్తి చేస్తుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతుకు భూమికి విడదీయని బంధం ఉంటుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం ఎంతో మంది మేధావులు, రైతులు, ఎన్నో వర్గాల అభిప్రాయాలు, ఆలోచనల మేరకు చేసినదే ఈ చట్టం అని అన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సబ్సిడీ రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లింగమూర్తి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులతో పాటు రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెరగాలి : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలని మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి అంగన్‌వాడి కేంద్రాలతో పాటు వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖను నెంబర్ 1గా తీర్చిదిద్దేలా అధికారులంతా పనిచేయాలన్నారు. చిన్నారులు, మహిళలు, వయో వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్‌ల సంక్షేమ శాఖ మనదని, యాంత్రికంగా, మొక్కుబడిగా కాకుండా మానవత్వంతో పని చేయాలని సూచించారు. శాఖకు సంబంధించిన కార్పొరేషన్లు, కమిషన్‌లతో కలిసి పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలోని అన్ని విభాగాలు నిర్దిష్ట గడువును నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సూచించాలన్నారు. చివరి నిమిషంలో ప్రణాళికలు రూపొందించడం వల్ల బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని, అందుకే ఎప్పటికప్పుడు బడ్జెట్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్ధేశం చేశారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి స్థాయిలో చేరుకునేలా పనిచేయాలన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులంతా అంగన్‌వాడి కేంద్రాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. దత్తత ఇచ్చేలోపు, పిల్లల సంరక్షణ బాధ్యత కు స్వీకరించేందుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలన్నారు. ఆ చిన్నారుల సంరక్షణ బాధ్యతలు చూసుకునే వారికి ఆర్థిక చేయుత ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి చెప్పారు. దివ్యాంగులకు అత్యవసరమైన సర్జరీలను ప్రభుత్వమే చేయిస్తుందన్నారు. దివ్యాంగులను గుర్తించి, అధికారులు సర్జరీ ఏర్పాట్లు చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు ఐదు శాతం కేటాయిస్తున్నామన్నారు. కుటుంబంలో దివ్యాంగులుంటే, వారి పేరు మీదే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే అంశం పరిశీలనలో ఉందన్నారు. అంగన్‌వాడిలకు సరఫరా అయ్యే ఆహార నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు, మరింత రుచి కరంగా మార్చేందుకు ఎన్ఐఎన్, యూనిసెఫ్ వంటి సంస్థలు, నిపుణులతో కమిటీ ఏర్పాట చేశామన్నారు. వారి నివేదిక ఆధారంగా అంగన్‌వాడిలకు సరఫరా అవుతున్న ఆహారంలో మార్పులు చేర్పులు చేస్తామన్నారు.

## రైల్వే స్టేషన్లు- రైళ్లలో భద్రతను పటిష్ఠం చేయండి

### ద.మ.రైల్వే జిఎం అరుణ్‌కుమార్ జైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే స్టేషన్లు, రైళ్లలో భద్రతను మరింత పటిష్టంగా ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. దక్షిణ మధ్య జోన్‌లో స్టేషన్‌లు, రైళ్లలో భద్రత, రక్షణపై అధికారులతో అరుణ్‌కుమార్ జైన్ సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ , వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డిఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రత, రక్షణపై అరుణ్ కుమార్ జైన్ వివరణాత్మక సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్లు, రైళ్లలో భద్రతా సిబ్బందిని రైల్వే రక్షణ దళం ,రైల్వే పోలీసులను మోహరించి పటిష్టం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైలు ప్రయాణీకుల భద్రత కోసం అవసరమైన ప్రదేశాలలో సిసిటివిలను ఏర్పాటు చేయడం యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన వివరించారు. జోన్ అంతటా భద్రతను పటిష్టం చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైల్వే ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతకు సంబంధించి జోన్లో నిర్వహిస్తున్న వివిధ భద్రతా డ్రైవ్‌ల పురోగతిని కూడా అరుణ్ కుమార్ జైన్ సమీక్షించారు. జోన్ మీదుగా ఉన్న అన్ని క్రాసింగ్‌లు, ట్రాక్‌లపై ఉన్న పాయింట్ల వద్ద అనుసరించాల్సిన భద్రతా జాగ్రత్తలపై అరుణ్ కుమార్ జైన్ చర్చించారు. ఎసి కోచ్‌లలో పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక యంత్రాలు భద్రతా వస్తువుల లభ్యతపై అధికారులు వివరించారు.

## మే 3న సింగపూర్ పార్లమెంటు ఎన్నికలు

**సింగపూర్:** సింగపూర్ పార్లమెంటు ఎన్నికలు మే మూడో తేదీన జరుగుతాయి. ప్రధానమంత్రి లారెన్స్ వోంగ్ సారథ్యంలోని ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని మరోసారి రుజువు చేసుకుని పదవిలో కొనసాగాలని గాఢంగా కోరుకుంటున్నది. దీర్ఘకాలంగా దేశాన్ని పాలిస్తున్న పీపుల్స్ యాక్షన్ పార్టీ ప్రజాతీర్పు ద్వారా తన పునాదులను మరింత పటిష్టం చేసుకోవాలని కోరుకుంటున్నది. గత ఏడాది మే నెలలో సింగపూర్ నాలుగో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన లారెన్స్ ఆకస్మికంగా పార్లమెంటును రద్దుచేశారు. పార్టీకి పునరుజ్జీవం కల్పించేందుకు, సంస్కరించేందుకు 30 మంది కొత్తవారిని ఎన్నికల బరిలోకి ఆయన దించుతున్నారు.

1965లో సింగపూర్ స్వాతంత్ర్యం సాధించినప్పటినుండీ ఆ దేశానికి పీపుల్స్ యాక్షన్ పార్టీ (పాప్) పరిపాలిస్తున్నది. ఐతే 2020 లో జరిగిన ఎన్నికల్లో పాప్ పార్టీకి ఎదురుదెబ్బలు తగిలాయి. ప్రభుత్వంపై అసమ్మతి పెరిగింది. రెండు దశాబ్దాలపాటు ప్రధానమంత్రిగా అధికారం చెలాయించిన లీ హీజియన్ లూంగ్ రాజీనామా చేయడంతో లారెన్స్ ఆ బాధ్యతలు చేపట్టారు. లీ హీజియన్ లూంగ్ రాజీనామాతో సింగపూర్‌లో ప్రధానమంత్రి పదవికిలో కుటుంబ పరిపాలనకు తెరపడింది. కరోనా సమయంలో జరిగిన ఎన్నికల్లో పాప్ పార్టీకి 93 స్థానాలకుగాను 83 స్థానాలు పార్లమెంటులో సంపాదించినప్పటికీ ప్రతిపక్షం బలం ఆరు నుండి పదిసీట్లకు పెరిగింది.

## ప్రజావాణిలో 68 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రజావాణిలో వచ్చే అర్జీలను ప్రాధాన్యతా పరంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ ఆదేశించారు. తమ స్థాయిలో పరిష్కరించలేని వాటి గురించి ధరఖాస్తుదారులతో పాటు సవివరంగా ఉన్నతాధికారులకు తెలియ పరుస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇతర జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులతో కల్సి ప్రజావాణిలో 68 అర్జీలను స్వీకరించారు. కింది స్థాయిలో పరిష్కారం కాక పోతేనే సుదూర ప్రాంతాల నుండి గంపెడాశతో ప్రజావాణిలో పాల్గొనే జిల్లా ఉన్నతాధికారుల ద్వారా పరిష్కృతమవుతాయని దూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసల కోర్చి వస్తుంటారన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరశీలించి పరిష్కరించాలన్నారు.

## చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో తనిఖీలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లో దాడులు జరిగిన నేపథ్యంలో చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో రైల్వే ఆర్‌పిఎఫ్ అధికారులు భద్రత దృష్ట్యా తనిఖీలు నిర్వహించారు.రెడ్ అలర్ట్‌లో భాగంగా ఆర్‌పిఎఫ్ సిఐ ఆర్ కె మీనా,ఎస్ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యలో సిబ్బందితో కలసి ప్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అదేవిధంగా రైల్వే స్టేషన్‌లోని వెయిటింగ్‌హాలు, ప్లాట్‌పారాలు, పార్సిల్ కార్యాలయాలు, రైళ్లను తనిఖీ చేశారు. పేలుడు, ఇతర ప్రమాదకర వస్తువులు కనగొనబడలేదని వారు తెలిపారు. తనిఖీలలో గోపి,ఆర్‌పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జెవివి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సైన్స్ శిక్షణ శిబిరంలో భాగంగా 5వ రోజు మహేంద్రం జీవ శాస్త్రాన్ని చిన్న చిన్న ప్రయోగాల ద్వారా వివరాత్మకంగా విద్యార్థులకు బోధించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి ఏర్పడిన నుండి భూమి మీద జీవం ఎలా ఏర్పడింది.వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటు ఏ విధంగా తనకు తాను ప్రకృతికి అనుగుణంగా మార్పులను చేసుకుంటూ అభివృద్ధి చెందాయో జీవ పరిణామ క్రమ సిద్ధాంతం ప్రయోగాత్మకంగా నిరూపించడం జరిగింది.అడవులను నరకడం వల్ల అడవుల్లో నివసించే జాతులు ప్రాణులు నేడు నివాస ప్రాంతాల్లోకి వచ్చి విధ్వంసం చేస్తూ సమస్యలు సృష్టిస్తున్నామని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు పిట్టల నాగరాజు,శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పంచ్‌లలో అద్భుత ప్రతిభ



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ, చర్లపల్లికి చెందిన ఛాంపియన్స్ షోటోకన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. హైదారాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇండోనేపాల్ ఇంటర్నేషనల్ ఆల్‌స్టైల్స్ హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో కుషాయిగూడ విద్యార్థులు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు అత్యధిక ఎయిర్ పంచెస్ (45,808)కొట్టి చోటు సాధించారని అకాడమీ ఫౌండర్,డైరెక్టర్ కరాటే కోచ్ బుడిగే రవికుమార్‌గౌడ్ తెలిపారు.విద్యార్థులకు సర్టిఫికెట్లు,పతకాలు,ట్రోఫిలను అందజేశారు.

## ఫూలే సినిమా హర్షణీయం




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** సంఘ సంస్కర్త పూలే సినిమా అన్ని అడ్డంకులను అధిగమించి ప్రేక్షకుల ముందుకు రావటం హర్షించ దగిందని బిసి హక్కుల సాధన సమితి పేర్కొన్నారు. సోమవారం నాగోల్‌లోని డాంగే భవన్ ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమారస్వామిలు మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘాల అభ్యంతారాలను అధిగమించిన పూలే సినిమా అద్భుతమే కాక ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఉందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే ప్రారంభించిన సంఘ సంస్కరణ చరిత్ర, అణగారిన వర్గాల అభ్యున్నతికి సేవలు ఆదర్శనీయంగా చిత్రీకరించారన్నారు.

## మేడే గోడపత్రిక విడుదల




**ప్రజాపక్షం/అల్వాల్:** యాప్రాల్ చౌరస్తాలో ఎఐటియుసి ఆధ్వర్యంలో 139 వ మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిచంద్రన్ సూచించారు. గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అరుణ పతాకాలు ఎగరేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి సహదేవ్ మాట్లాడుతూ భవన నిర్మాణ, ఆటో, మున్సిపల్ కార్మికులకు నిర్ణీత సమయంలో జీతాలివ్వాలన్నారు.జిల్లాభవననిర్మాణకార్మికులు వై వెంకటేష్, రమేష్ సింగ్, సిపిఐ కార్యదర్శి చంద్రయ్య, బాబు సాయిలు, గణేష్, మల్లేష్, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల కోసం పోరాటం



**ప్రజాపక్షం/మేడ్చల్‌ప్రతినిధి :** జవహర్‌నగర్‌లోని గిరిప్రసాద్ సిపిఐ కార్యాలయంలో 139వ మేడే దినోత్సవ సందర్భంగా రూపొందించిన గోడ పత్రికలను సిపిఐ, ఏఐటియుసిలు సోమవారం ఆవిష్కరించారు. భవన కార్మిక సంఘం కాప్రా మండల అధ్యక్షుడు కొండ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ అనంతరం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికులందరూ జరుపుకొనేదే మేడే దినోత్సవమన్నారు.మేడ్చల్ జిల్లా భవన కార్మిక సంఘం సహాయ కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ రాజు నాయక్, ఏఐటియుసి గిరిప్రసాద్‌నగర్ నాయకులు ఎల్లయ్య, శ్యామ్‌దాస్, నాని, కొండ సూర్యం పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సాయినాథపురం ప్రాంతంలో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన వజ్రమ్మ, పోచయ్యల కుమార్తె వివాహానికి గాను ఆర్థిక సాయంగా కాంగ్రెస్ నేత పిట్టల నాగరాజు అందించిన పుస్తె మట్టలు, పట్టు చీరలను మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు సోమవారం వారి ఇంటికి వెళ్లి ఇచ్చారు. నాగరాజు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆయన తెలిపారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

**ప్రజాపక్షం/దోమ :**దోమ మండల పరిధిలోని అయినాపూర్‌కుచెందిన గుడ్ల నర్సిములు కూతురు శిరీష అనారోగ్యంతో చికిత్స పొందింది. అశన్నగౌడ్ సహకారంతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంజురు చేయించిన 60వేల చెక్కును బాధితుని ఇంటి దగ్గరకు వెళ్లి చిన ఇందిరామ్మ కమిటి అధ్యక్షులు ఆశన్నగౌడ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి నర్సింలు అందించారు. నల్ల సాయిలు , వెంకటయ్య,అంజిలయ్య, రాములు, రవికుమార్‌గౌడ్ , కృష్ణ , నర్సిములు , రాములు , వెంకటయ్య, దస్తాయ్య, తదితరులు పాల్గోన్నారు.

# భూ భారతిలో 'అప్పీలు' కీలకం

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/కోట్‌పల్లి / పెద్దెముల్ :** భూ భారతి చట్టం 2025 ద్వారా రైతు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తెలిపారు.సోమవారం కోట్‌పల్లి మండలంలోని బుగ్గాపూర్ డిఎంఆర్ పంక్షన్ హాల్‌లో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ భూ భారతి చట్టంలో అప్పీలు, వ్యవస్థ చాలా కీలకమైందన్నారు.తాండూర్ ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి, ప్రభుత్వ వీప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, లక్ష్మారెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు నర్సింగ్‌నాయక్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు అంజయ్య, నాయకులు బందెయ్య,మాజీ సర్పంచులు జ్ఞానేశ్వర్, నక్కల విజయలక్ష్మి , మాజీ ఉప సర్పంచ్ సంగయ్య, నాయకులు, రైతులు, అధికారులు ఉన్నారు.

**కందనెల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ**

సోమవారం తాండూర్ నియోజకవర్గంలోని కందనెల్లిలో నూతన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అథితులుగా హాజరయ్యారు.వారు మాట్లా డుతూ సన్న రకం వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని అన్నారు.

**ధారూర్ మండల కేంద్రంలో..**

భూ భారతి నూతన చట్టం వంద శాతం భద్రత ఉంటుందని శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలోమాట్లాడారు. రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్ మార్పులు, చేర్పులు, సాదాబైనామాల వంటి సేవలు సులభతరం అవుతాయన్నారు. ఉద్యాన పంటలు వేసిన 155మంది రైతులకు స్పింకలర్ పైపులు, కళ్యాణలక్ష్మి ,షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరీ, తహసీల్దారు సాజిదా బేగం ఉన్నారు.

## శ్రమదోపిడీని అడ్డుకుందాం



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:**శ్రమదోపిడికి వ్యతిరేకంగా పోరాటాలే మార్గమని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. మే డే సందర్భంగా సోమవారం జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మిక అడ్డా వద్ద భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షులు హరినాథ్ ఆధ్వర్యంలో 139వ మే డే పోస్టర్ ను భవన నిర్మాణ కార్మికులతో కలిసి వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలోని 29 చట్టాలను పూర్తిగా తొలగించి 4 కోడ్స్‌గా విభజించి అమలు చేయాలని చూస్తున్నారన్నారు. అదాని, అంబాని లాంటి బడా బాబులకు కొమ్ము కాస్తున్నారని, కార్మిక వర్గం తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ముసలయ్య, సామియల్, ఉషయా, దుర్గయ్య, వెంకటేష్, జంబూ అడ్డా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణలో ప్రతిభ చాటిన విద్యార్థులు



**ప్రజాపక్షం/నిజాంపేట్:**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి వివిఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐదురోజుల పాటు రహదారుల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జియోసింథటిక్స్ వినియోగం పేరిట నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం సోమవారం ముగిసింది. న్యూ ఢిల్లీలోని సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మరియుభారతప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖలోని నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్ మిషన్ సంయుక్తంగా నిర్వహించినఈ శిక్షణా కార్యక్రమంలో రహదారుల మౌలిక సదుపాయాల కల్పనలో జియోసింథెటిక్‌పదార్థాల రూపకల్పన, పరీక్ష, వినియోగం,పనితీరు అంచనాకి సంబంధించిన వివిధ అంశాలను సమగ్రంగా చర్చించారు. 118 మంది బిటెక్, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. సిఎస్ఐఆర్ సిఆర్ఆర్ఐ నుండి ప్రముఖ శాస్త్రవేత్తలు, ఐఐటి హైదరాబాద్, ఎన్ఐటి వరంగల్, ఇతర ప్రఖ్యాత విద్యాసంస్థల నుండి అధ్యాపకులు, జియోటెక్స్‌టైల్ పరిశ్రమ నిపుణులు తమతమ అనుభవాలను ఉటంకిస్తూ వెలువరించిన పాఠాల ద్వారా ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని తమకందించారని విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాదిపతి డాక్టర్ కె.రామూజీ, సమన్వయకర్త రమేష్, కళాశాల సంచాలకులు చెన్నకేశవ రావు, కళాశాల ప్రిన్సిపల్ సిడి నాయుడు, విజ్ఞాన్ జ్యోతి సంస్థ ప్రధాన కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్, చీఫ్ సైంటిస్ట్ కె.రవిందర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ భరత్, చీఫ్ సైంటిస్ట్ పిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు.

## క్రీడలతోనే మానసిక దృఢత్వం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** పిల్లలు మొబైల్‌ని వీడి క్రీడల్లో ప్రతిభను కనబరచాలని తెలంగాణ రాష్ట్ర శాసన సభ బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ ఆర్ నాయక్ నగర్‌లో సుమారు రూ. 2.90 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్ట్స్ క్రీడా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. వివేక్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ధృఢత్వాన్నిపెంపొందించడంతో పాటు మానసిక రుగ్మతలు తొలగిపోతాయని అన్నారు. ఇటీవల పిల్లలు అత్యధికంగా ఫోన్లకు లీనమవుతున్నారని, వాటిని దూరంగా పెట్టి క్రీడల పై మక్కువను పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో ప్రోత్సహించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఇండోర్ షటిల్ కోర్ట్ క్రీడా ప్రాంగణం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. స్థానిక యువత, పిల్లలు ఈ షటిల్ కోర్ట్‌ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, నాయకులు మన్నెరాజు, శ్రీకాంత్, గుబ్బల లక్ష్మి నారాయణ, శేషాచారి, దుర్గారావు, భాస్కర్, హరిబాబు, నర్సింగ రావు, శ్యామ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, పద్మ, అనిల్, శ్రీదేవి, సరిత, ఉమా, స్వర్ణ, శ్రీనివాస్, సదానంద చారి, ప్రభాకర్, జనప్రియ పాల్గొన్నారు.

# కెసిఆర్ పదేళ్ల పాలనలో ఒరిగిందేమీ లేదు..



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** తెలంగాణ రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పాలించిన మాజీ సీఎం కేసీఆర్ బ్యాగరులకు ఎలాంటి ఉపయోగం లేదని మాల బ్యాగరి కాటి కాపరి సంఘం జాతీయ అధ్యక్షులు ఎతేపు కేశవులు అన్నారు. జగద్గిరి గుట్ట డివిజన్ పరిధిలోని నల్లమల్ల గిరి ప్రసాద్ విజ్ఞాన కేంద్రం (సీపీఐ) కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ మాల బ్యాగరి కాటి కాపరి సంఘం సమావేశం సోమవారం కత్తుల దుర్గయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరోన సమయంలో ప్రాణాలకు తెగించి కాస్త పడితే కనీస గౌరవం కూడా దక్కలేదన్నారు. ఎలాంటి రోగాలోచిన శవాలనైనా తాము ఖననం చేస్తామని, విష వాయువులు పీల్చి రోగాల భారీన పడి ఆసుపత్రి బిల్లులు కట్టాలంటే మా జేబులకు చిల్లులు పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బ్యాగరి పని చేసే వారిని గుర్తించి ఇల్లు లేని వారికి బేషరత్తుగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. సంఘం నగర కార్యదర్శి శ్రీను, రాష్ట్ర నాయకులు వెంకటస్వామి, పోచయ్య, రవి, లక్ష్మమ్మ, నాగరాజు, జల్లా వెంకటేష్, కొంగరి నరహరి, మోహన్, కత్తుల సోమనాథ్,సంఘంసభ్యులు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో సత్వర న్యాయం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఫిర్యాదస్తులకు త్వరిత న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కులాల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. రాచకొండ కమిషనరేట్‌లో సోమవారం ఎస్సీ, ఎస్టీ నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతంగా విచారణ పూర్తి చేసి నిందితులకు శిక్షలు పడేలా చేయాలన్నారు. ఈ కేసుల్లో అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ తమ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ప్రత్యేక శ్రద్ద తీసుకొంటున్నామన్నారు. న్యాయ ప్రక్రియలో ఎటాంటి జాప్యం లేకుండా బాధితులకు న్యాయం చేకూరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, కొంకటి లక్ష్మి నారాయణ, జిల్లా శంకర్, డిసిపిలు పద్మజ, ప్రవీణ్‌కుమార్, అరవింద్‌బాబు, నరసింహారెడ్డి, సునీతా రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాపాడుకుందాం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడే ఉత్సవాల సందర్భంగా ఆల్వాల్ మున్సిపాలిటీ ముందు జరుగనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి చందర్ పిలుపిచ్చారు. యాప్రాల్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడుకొనేందుకు పోరాటం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. సిపిఐ మండల కార్యదర్శి కె.సహదేవ్, భవన నిర్మాణ కార్మికులు వై.వెంకటేష్, రమేష్, సింగ్, సిపిఐ పార్టీ సాయి కార్యదర్శి చంద్రయ్య, బాబు, సాయిలు, గణేష్, మల్లేష్ పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం /కొడంగల్:** కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 179 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి , కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సీఎంఆర్ ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కొడంగల్‌లో 23 మందికి గాను, బోంరాస్‌పేట 28, దౌల్తాబాద్ 38, దుద్యాల్ 19, కోస్గి 23, మద్దూర్ 29, గుండుమాల్ 19, కొత్తపల్లి 6 మొత్తం 179 మందికి అందజేశారు. నారాయణపేట జిల్లా గ్రంథాలయ చైర్మెన్ వార్ల విజయ్‌కుమార్, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజేష్‌రెడ్డి, కొడంగల్ మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, బోంరాస్‌పేట పిఎసిఎస్ చైర్మెన్ జయకృష్ణ, నర్సిములు గౌడ్, యూత్ కాంగ్రెస్ కృష్ణంరాజు, ధాము పాల్గోన్నారు.

## విద్యార్థులకు అభినందన



**ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి:** ఎసీఆర్ బృంగి జూనియర్ కళాశాల విద్యార్థుల కు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు వచ్చిన సందర్భంగా మాజీ మంత్రి డా .ఏ. చంద్రశేఖర్ విద్యార్థులను అభినందించారు. అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం కళాశాలను ప్రారంభించి 11సంవత్సరాలు నుంచి రాష్ట స్థాయి ర్యాంకులు సాధిస్తున్న ఈ ప్రాంత విద్యార్థుల కు నాణ్యమైనయిన విద్యానందించడం మాలక్ష్యం అన్నారు. శివప్రసాద్, కుమారస్వామి, వినోద్,రమాదేవి, మహేందర్ తదితరులు పాల్గోన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం



### కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/పెద్దముల్ :** ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. సోమవారం పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలసి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్ , ఏఎంసీ ,మందుల నిల్వ తదితరులతో పాటు ఔట్ పేషెంట్,ఎఎంసి తదతర రిజిష్టర్‌లను కలెక్టర్ పరిశీలించారు. భవన పరిసరలను పరిశీలించి మరమ్మతుల పనులను త్వరితగతిన చేపట్టాలని ,ఆసుపత్రి పరిసరలను పరిశుభ్రాంగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రికి అవసరమైన ఫాన్లు లైట్లు , సమకూర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ పరీక్షలు గర్భిణీలకు అందిస్తున్న వైద్యసేవలు,ప్రసవాలవివరాలపైఆరాతీశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని అవసరమైయితే మందులను సరఫర చేయిస్తానాన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, డాక్టర్ శ్వేత, ఎంపిడిఓ ,తదితరులు పాల్గోన్నారు.

# భద్రత, శుభ్రతలపై ప్రత్యేక దృష్టి

### జిల్లా ఎస్పి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా ఎస్పి నారాయణరెడ్డి వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న ఉమేన్స్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి,భద్రత ,శుభ్రత పై సమీక్షించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి నిర్వహణలో అవసరమైన సూచనలు అందించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను గమనించి వేగవంతమైన పరిష్కారం అందించాలంటే సంబంధిత అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మహిళల భద్రత ప్రభుత్వనికి ఆత్యంత ప్రాధాన్యమని ,పిర్యాదులపై త్వరగతిన స్పదించి బాధితులకు న్యాయం కల్పించడం పోలీస్ శాఖ ప్రదాన లక్ష్యమని అయన పేర్కోన్నారు. స్టేసన్ స్బింబందికి తీసుకోవల్సీన జగ్రత్తలు చేయకూడానిక పనుల గురించి వివరించారు. ప్రజలతో స్నేహంగా వ్యవహరించి మహిళల సంబంధిత సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో విచారించి నిబంధనల ప్రకారం చట్టబద్దమైన చర్యలు తీసుకోవాలని ,విధి నిర్వహణలో క్రమశిక్షణ ,సమయపాలన ,ఖచ్చితంగా పాటించాలరి పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో ఉమేన్స్ సీఐ శివచంద్ర ,రాణి ,శ్రవంతి ,సిబ్బంది పాల్గోన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికి భూభారతి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**ప్రజాపక్షం/గండిపేట :** భూభారతి చట్టంతో రైతు తన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు ప్రవేశపెట్టడం జరిగిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం శంషాబాద్ మండలంలోని కావేలిగూడ ఎంఎం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ భూభారతి ఆర్ఓఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ భూభారతి చట్టంతో ప్రజల వద్దకే అధికారులు వెళ్లి రైతుల సమస్యలను, వారు పడుతున్న ఇబ్బందులు పరిష్కారం అవుతాయని తెలిపారు. గతంలో కేవలం ఉన్నతాధికారులు కోర్టు ద్వారానే రెవెన్యూ సమస్యల పరిష్కారం జరిగే పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యే వారని, ఆర్ఓఆర్ చట్టం ద్వారా ప్రజల వద్దకే అధికారులు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట్ రెడ్డి, శంషాబాద్ మండల తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంపిడిఒ మున్ని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, సంబంధిత అధికారులు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ కోచింగ్ శిబిరాలు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుండి జూన్ 6 వరకు 33 జిల్లాలలో స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనరెడ్డి తెలిపారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు 2025 పోస్టర్ రిలీజ్, క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి , వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవితో కలిసి శివసేనరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడాకారులు విద్యార్థులు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేస్తోందన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా ఈ వేసవి శిబిరాలు ఉన్న నిర్వహిస్తున్నామని తెలిపారు.

## గాడితప్పిన జిహెచ్ఎంసి పాలన

ఏడాదిలోనే
నలుగురు కమిషనర్ల మార్పు

అక్రమార్కులపై విజిలెన్స్ అస్త్రం..
పైస్థాయి సిఫార్సులతోనే ఇలంబర్తి
బదిలీ అయ్యారనే ప్రచారం

కొత్త కమిషనర్ ఆర్‌వి కర్ణన్








**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి బదిలీ అయ్యారు. కొత్త కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్‌ను ప్రభుత్వం నియామకం చేసింది. గత సంవత్సరంలోనే నలుగురు కమిషనర్లు మారడం గమనార్హం. 2024 జూన్‌లో రోనాల్డ్ రోస్‌ని పక్కన పెట్టి జిహెచ్ఎంసి కమిషనర్‌గా అమ్రాపాలికి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఐదు నెలల పాటు పనిచేయగానే అమ్రాపాలి కోర్టు తీర్పు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లారు. దీంతో 2024 అక్టోబర్‌లో బల్దియా బాస్‌గా ఇలంబర్తిని ప్రభుత్వం నియమించింది. ఆరు నెలలు పనిచేయగానే ఐఏఎస్ బదిలీల్లో భాగంగా ఇలంబర్తిని మున్సిపల్‌శాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. ఇలంబర్తి స్థానంలో జిహెచ్ఎంసి కమిషనర్‌గా 2012 బ్యాచ్‌కి చెందిన కర్ణన్‌ను ప్రభుత్వం నియమించడంతో అధికార వర్గాల్లో విస్మయం వ్యక్తం అవుతోంది. సంవత్సరకాలంలోనే నాలుగురు కమిషనర్లు మారడంతో జిహెచ్ఎంసి పాలనగాడి తప్పిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆరునెలల్లో యంత్రాంగంపై ఇలంబర్తి పట్టు తెచ్చుకున్నలోపే బదిలీ చేయడం పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

### రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూళ్లు..

ఎక్కడ పని చేసినా ఇలంబర్తి తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. మాటల్లో దూకుడు లేకపోయినా చేసే పనిలో మాత్రం ఎక్కడా తగ్గదే లేదన్నట్లు ఆయన పని విధానం ఉంటుందని పలువురు చెప్పారు. జిహెచ్ఎంసిలో 2024–25 ఆస్తిపన్ను వసూళ్లలో రూ.2038 కోట్ల మైలురాయిని దాటించి, రికార్డు సాధించారు. జిహెచ్ఎంసిలో అవినీతికి చెక్ పెడుతూ, ఇప్పుడిప్పుడే యంత్రాంగంపై పట్టు సాధించారు. పైరవీ కారులను పట్టించుకోకపోవడం.. అవినీతి పరులను లెక్కచేయపోవడంతోనే ఇలంబర్తిపై బదిలీ వేటు పడినట్లు ప్రచారం జరుగుతోంది. గత అక్టోబర్ నెలలో అప్పటి జిహెచ్ఎంసి కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమ్రపాలి కాటా ఆంధ్రప్రదేశ్ క్యాడర్ అంశం లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వాలని న్యాయం స్థానం ఆదేశాలు జారీ చేయడంతో అప్పటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఇలంబర్తికి జిహెచ్ఎంసి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. ఆ తర్వాత నెలరోజుల్లోనే జిహెచ్ఎంసి కమిషనర్‌గా పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించింది.

### పలు విభాగాలపై విజెలెన్స్ విచారణలు..

జిహెచ్ఎంసి కమిషనర్‌గా పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఇలంబర్తి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న అన్ని విభాగాలపై తక్కువ సమయంలోనే పూర్తి స్థాయి సమాచారం సేకరించారు. అందులో భాగంగానే పారిశుద్ధ్య విభాగంలో భారీగా అవినీతి జరిగినట్లు గుర్తించి సంబంధిత అధికారులపై వేటు వేయడంతో బల్దియా వర్గాల్లో గుబులు తెప్పించారు. ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్‌లతో పాటు వివిధ విభాగాలపై కూడా అవినీతి జలగలను భారత పట్టేందుకు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ విజిలెన్స్ విచారణలో భాగంగా ఇప్పటికే పలు కీలక వ్యక్తులు చేసిన అవినీతి చిట్టాను ఆధారాలతో సహా సంపాదించి, ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్ళాలని రంగం సిద్ధం చేశాడని తెలిసింది. ఈ విజిలెన్స్ నివేదిక బయటకు వస్తే వారి ఉద్యోగాలు పోవడమే కాకుండా, జైలు పాలయ్యే అవకాశం ఉండటంతో ఆయా అధికారులు వారి పేర్లు బయట పెట్టకుండా ప్రభుత్వ పెద్దలతో చెప్పించే ప్రయత్నం చేస్తుంటే, కమిషనర్ మాత్రం ససేమీరా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. విజిలెన్స్ విచారణ నేపథ్యంలో పలువురు అక్రమార్కులను కలవర పెట్టింది. జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఇలంబర్తి కొనసాగితే తమ ఆటలు సాగవని కొందరు కావాలనే బాధ్యతల నుండి తప్పించారనే ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లో బల్దియాను చక్కదిద్దేందుకు అనేక చర్యలు చేపట్టిన ఇలంబర్తిని బదిలీ చేయడంపై జిహెచ్ఎంసిలో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.

## ఇళ్లు లేని పేదలకు 100 గజాల స్థలం ఇవ్వాలి

ఇందిరాపార్కు వద్ద ధర్నాలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నివాసముండే ఇళ్లు లేని పేదలకు 100 గజాల స్థలం, పట్టాలు ఇవ్వాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అమ్మొద్దని, వాటిల్లో ఇళ్ల స్థలాలు చేసి, పేదలకు పంచాలని కోరారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది గుడిసెవాసులు సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టారు. తెలంగాణ గుడిసెవాసుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బాకీ రవి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. గతంలో హైదరాబాద్‌లోని కాచువాని సింగారంలో, తట్టిఅన్నారం, ఆర్కేనగర్‌లో ఇళ్ల పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం స్థలాలు కేటాయించకుండా పొజిషన్ ఇవ్వకుండా 4వేలమందికి మొండి చేయి చూపారని తెలిపారు. వీరికి వెంటనే స్థలాలు చూపించి పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. కుంట్లూరులో గుడిసెలు కాలిపోయిన వారికి రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. పేదలకు ఇళ్ల పట్టాలివ్వకపోతే పెద్ద ఎత్తున పోరాడుతామని కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ దక్షిణాది రాష్ట్రాల చైర్మన్ బి.ఎన్.రమేశ్ మాదిగ, బిసి సంఘం నేతలు సి.రాజేందర కుశల్, చిరంజీవి, దుర్గామల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 30న హోమియో ఫెస్ట్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** హోమియో వైద్య పితామహుడు డా.శామ్యూల్ హానిమన్ 270వ జయంతి సందర్భంగా ఈ నెల 30న హోమియో ఫెస్ట్ కార్యక్రమం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించనున్నట్టు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (హెచ్ఎంఎటి) అధ్యక్షులు డా.కె.గోపాలకృష్ణ, ప్రధానకార్యదర్శి డా.జి.దుర్గాప్రసాద్ తెలిపారు. హోమియోపతి వైద్య విద్యార్థుల్లో క్లినికల్ సామర్థ్యాలతోపాటు, సృజనాత్మక శక్తిని పోటీతత్వాన్ని అలవాటు చేయడమే ఈ హోమియో ఫెస్ట్ ముఖ్య ఉద్దేశమన్నారు. సమావేశంలో డాక్టర్ వేణుగోపాల్ గౌరి, డాక్టర్ మధు వారణాసి, డాక్టర్ గౌతమ్, డాక్టర్ చాముండేశ్వరి పాల్గొన్నారు.

## ఆలయాలపై దుష్ప్రచారం తగదు

వనస్థలిపురం దేవాలయాల కమిటీ చైర్మన్లు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఆలయాలపై ఆరోపణలు, దుష్ప్రచారాలు చేయడం తగదని వనస్థలిపురం డివిజన్‌లోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయం చైర్మన్ అశోక్‌గౌడ్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ లక్ష్మయ్య, రామాలయం చైర్మన్ లక్ష్మణరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీలక్ష్మీ గణపతి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వనస్థలిపురంలోని లక్ష్మీ గణపతి దేవాలయ అభివృద్ధికి 40 సంవత్సరాలుగా నిరంతర కృషి కొనసాగుతుందన్నారు. వారం రోజులుగా దేవాలయ వాణిజ్య సముదాయంపై కొందరు ఆరోపణలు చేస్తున్న తీరు వారి అనాలోచిత అలోచన విధానానికి నిదర్శనమన్నారు. రాజకీయ కుట్రలో భాగంగా లక్ష్మీ గణపతి దేవాలయ అభివృద్ధిని, ఆలయ కీర్తిని అపహాస్యం చేసే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. దేవాలయంలో ఖర్చు పెట్టే ప్రతి రూపాయికి, దాతలు ఇచ్చే విరాళాలు, వస్తు సామగ్రి, హుండీ ఆదాయం, ఖర్చులు, పూజర్ల జీతభత్యాలు, సిబ్బంది జీతభత్యాలు, దేవుళ్ల దీప దూప నైవేద్యాలు అన్ని విధాల ఆదాయ వసరులకు సంబంధించి ప్రతి రూపాయికి ఖచ్చితమైన లెక్కలు ఉన్నాయని వారు స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించాల్సిన వ్యక్తులు అనవసర ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిలో బలైన వారికి నివాళి




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** పర్యాకులపై ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని, ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోని కఠినంగా శిక్షించాలని గాయత్రి టవర్స్ వ్యాపారస్తులు అన్నారు. సోమవారం ఆర్‌కెపురం డివిజన్ గ్రీన్‌హిల్స్‌కాలనీలోని గాయత్రి టవర్స్‌లో వ్యాపారం చేసే ప్రతినిధులు ఎడ్ల జంగారెడ్డి, రెబ్బ శంకర్‌రావు ఆధ్వర్యంలో పహల్గామ్‌లో జరిగిన అమనూష ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తూ వందలాది మందితో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దాడి అమాయకులు ఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అమరులైన వారికి ఘనంగా నివాళులు అర్పిస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు. ర్యక్రమంలో పగిళ్ల భూపాల్‌రెడ్డి, వెంకన్న, మాదవరెడిడ, కె.జంగారెడ్డి, కృష్ణారెడ్డి, సంపత్, రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి




మున్సిపల్ కార్మిక సంఘం (ఎఐటియుసి)
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం

**ప్రజాపక్షం/దుండిగల్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుద్ధ్య, ఇతర కార్మికుల రెండు నెలల పెండింగ్ వేతనాల కొరకు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసి నాయకులు పాలబిందెల శ్రీనివాస్, సిఐటియు ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రగతి నగర్ లోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు విధులు బహిష్కరించి నిరవధికంగా మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ.అశోక్, మాట్లాడుతూ రెండు మాసాలుగా జీతాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా మున్సిపల్ కమిషనర్ సాబీర్‌అలీ ఆదేశాలతో మేనేజర్ పవన్ కుమార్ కార్మికులతో మాట్లాడారు. వేతనాలు ట్రెజరీ ద్వారా కాకుండా జనరల్ ఫండ్ నుంచి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్మికులకు ఐడి కార్డ్స్ తయారుచేసి ఇస్తామన్నారు. మిగిలిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శ కె.శ్రీనివాస్, మున్సిపల్ నాయకులు హరినాథ్, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరామయ్య, సిఐటియు నాయకులు జి.వెంకటరాజ్యం, యూనియన్ ఉపాధ్యక్షులు పి.పెంటయ్య, నర్సమ్మ, యాదమ్మ, మహేష్, నరసింహ శ్రీను, నరసమ్మ, పుష్పమ్మ, నారాయణ,మనీ,మహిపాల్ వెంకన్న, మద్దిలేటి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



చిత్రకారుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కావూరి హిల్స్ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, పెయింటింగ్స్‌ను పరిశీలించారు.



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కె.శశాంక హెచ్‌జిసిఎల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్ట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న శశాంక ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమీషనర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

## ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ శివకుమార్‌నాయుడు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ శివ కుమార్ నాయుడు అధికారులకు సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలోఅదనపు కమిషనర్లు చంద్రకాంత్‌రెడ్డి, సరోజ , వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ యాదగిరి రావు, గీతా రాధిక, సత్యనారాయణ, అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్‌కుమార్, గంగాధర్, రజిత్ కుమార్, వెంకన్న, ఉమాదేవి, జాయింట్ కమిషనర్(రెవెన్యూ) మహేశ్ కులకర్ణి, ముఖ్యవైద్యాధికారి పద్మజ, జాయింట్ కమిషనర్(అడ్వటైజ్‌మెంట్) వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## పనస పండ్ల చాటున గంజాయి

ఇద్దరి అరెస్టు-..లారీ స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పలాసా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన పనస పండ్ల లారీని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేయగా పండ్ల కింద రూ.2.5 కోట్ల విలువైన 410 కిలోల గంజాయితో పాటు లారీని స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి అబ్కారీ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఒడిషా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పలాస, విశాఖపట్నం విజయవాడ మీదుగా రాష్ట్రానికి రూ.2.5కోట్ల విలువ చేసే గంజాయిని లారీలో రవాణా చేస్తున్నారనే సమాచారంతో అప్రమత్తమైన స్టేట్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ ఎస్‌పి భాస్కర్‌అలీతో పాటు డిఎస్‌పి శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ కె.వెంకటేశ్వర్లు, టీం‘ డి‘ డిఎస్‌పి తిరుపతి యాదవ్, ఇన్‌స్పెక్టర్ నాగరాజులు రంగంలోకి దిగి ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో లారీని పట్టుకున్నారు. నిందితులు గణేష్ రామస్వామి, విజయ్ శంకర్‌క కులకర్ణిలను అరెస్టు చేసి, లారీని స్వాధీనం చేసుకున్నారు.

## ఓదెలు -2 సినిమాలో అభ్యంతరకర వ్యాఖ్యలు తొలగిస్తాం

ప్రాంతీయ సైన్సార్ బోర్డు అధికారి రాహుల్ గౌలీకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓదెలు2 సినిమాలో పిచ్చకుంట్ల కులం పేరును అభ్యంతరకరంగా చిత్రీకరించడం పట్ల బిసి కమిషన్ అభ్యంతరం తెలుపుతూ ఈ నెల 25వ తేదిన ప్రాంతీయ సెన్సార్ బోర్డు అధికారికి లేఖ రాసిన విషయం తెల్సిందే. ఈ లేఖపై స్పందిస్తూ ఆ సినిమాలో నాలుగు సందర్భాలలో ఉపయోగించిన పిచ్చకుంట్ల పదాన్ని తొలగించి, ప్రదర్శించడం జరుగుతుందని ప్రాంతీయ సెన్సార్ బోర్డు అధికారి రాహుల్ గౌలీకర్ బిసి కమిషన్‌కు సమాచారం అందించారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

చల్లా నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూభారతి చట్టం ఎంతగానో దోహద పడుతుందని తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి తెలిపారు. సోమవారం కందుకూర్‌లోని టంకరీ రాంరెడ్డి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి నర్సింహ్మారెడ్డి విచ్చేసిన పాల్గొన్నారు. అవగాహన సదస్సులో ముందుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించగా ఆ వివరాలను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి రైతులకు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తొలగించి, జవాబుదారుతనాన్ని పెంచేందుకు ప్రభుత్వం భూ భారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామా వంటి సేవలు సులభతరం అవుతుందని తెలిపారు.( ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కందుకూర్ ఆర్‌డిఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్, అధికారులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు


రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డిఆర్ఓ సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూధార్ సంఖ్యతో భూ వివాదాలకు అడ్డుకట్ట

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** భూకమతాల వారీగా భూధార్‌సంఖ్య కేటాయించడంతో భూవివాదాలకు, ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని తార కన్వెన్షన్‌లో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. అవగాహన సదస్సులో రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ధరణి చట్టం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని తెలిపారు. ఈ నూతన ఆర్ఓఆర్ చట్టం ద్వారా రైతులు సెక్షన్ 4లోని సబ్ సెక్షన్లు 4,5 ప్రకారం భూ రికార్డులను సవరణ చేసుకునే అవకాశం కల్పించారన్నారు. భూవిస్తీర్ణంలో మార్పులు, రికార్డులలో నమోదు కాని విస్తీర్ణాన్ని నమోదు చేయడం వంటి వాటిని తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలలో పరిశీలన జరిపి చేసేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా అధికారాలు కల్పించిందన్నారు. ఫలితంగా రైతులు తమ భూముల రికార్డులకు సంబంధించిన పొరపాట్లను స్థానికంగానే సరి చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలంలోపు రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ సామాన్య రైతుకు అర్థమయ్యేలా, రైతాంగానికి భరోసానిస్తూ, భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. సదస్సుల్లో నెదర్లాండ్ ఎక్స్ మినిస్టర్ జాన్ పోర్ట్, ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంత్‌రెడ్డి, మాజీజెడ్పిటిసి బింగి దేవదాస్‌గౌడ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ఫోకస్

# యువతరంగం

## యువత ముందు ఎన్నో సవాళ్లు





నేటి ఆధునిక యుగంలో యువత ఎన్నో సవాళ్లను, సమస్యలను ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగిత ప్రధాన సమస్యల్లోనే అత్యంత కీలకమైనది. చదువులు పూర్తిచేసిన తర్వాత అనేక మంది యువత ఉద్యోగం లేక నిరుద్యోగంగా ఉండిపోతున్నారు. ఇది నిరాశను కలిగిస్తుంది. ఆర్థిక ఒత్తిడి కూడా యువతను నిస్సహాయులను చేస్తున్నది. చదువు, జీవన ఖర్చులు, కుటుంబ బాధ్యతలు వంటివి యువతపై ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయి. తత్ఫలితంగా మానసిక ఆరోగ్యం దెబ్బతింటున్నది. ఒత్తిడి, నిరుత్సాహం, డిప్రెషన్ లాంటి మానసిక సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది నిషేధిత పదార్థాలకు బానిసలవుతున్నారు. వ్యసన పరురులుగా మారుతున్నారు. మత్తు పదార్థాలు, మద్యం, సిగరెట్లు వంటివి యువతను వ్యసనాల బారిన పడేలా చేస్తున్నాయి. సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కూడా యువతపై ఎక్కువగా ఉంది. సోషల్ మీడియా ద్వారా యువతలో తప్పుడు అభిప్రాయాలు, ఆకాంక్షలు పెరుగుతున్నాయి. ఇది ఆత్మనూన్యత భావన కలిగిస్తున్నది. విద్యా వ్యవస్థ లోపాలు సైతం యువతను ఇక్కట్లకిక్కిరి చేస్తున్నాయి. ప్రాక్టికల్ నైపుణ్యలకన్నా సాంప్రదాయ విద్యపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల, యువత నైపుణ్యాల్లో వెనుకబడుతున్నారు. యువతలో కొంతమంది స్వయంగా రాజకీయ వ్యవస్థను అర్థం చేసుకోలేకపోతున్నారు లేదా దానిపై నమ్మకాన్ని కోల్పోతున్నారు. రాజకీయ పరమైన మార్పులు రాకపోవడానికి, కుటుంబ పాలనలు కొనసాగడానికి ఇదో ప్రధాన కారణం. ఇలాంటి సవాళ్ల సమస్యలతో యువత నిరంతరం పోరాడుతునే ఉంది.

## మార్గదర్శకులు..

యువ్వనంలో ఉన్న నాయకులు లేదా మార్గనిర్దేశం చేసే వ్యక్తులే యువ మార్గదర్శకులు. వీరు తమ తోటివారికి లేదా చిన్నవారికి ఆదర్శంగా నిలుస్తూ, వారికి సహాయం చేస్తారు మరియు సరైన దిశలో నడిపిస్తారు. యువ మార్గదర్శకులు వివిధ రంగాల్లో ఉండవచ్చు. పాఠశాలల్లో లేదా కళాశాలల్లో తమ సహచరులకు చదువులో సహాయం చేసే వారు, మంచి అలవాట్లు నేర్పే వారు.. క్రీడా జట్లలో తమ జట్టు సభ్యులను ప్రోత్సహించేవారు.. వ్యూహాలు పంచుకునే వారు... సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేసేవారు.. ఇతరులను ప్రేరేపించేవారు. ఇలా ఎన్నో రకాలుగా యువకులు అనేకులు భావితరాలకు మార్గదర్శకం చేస్తున్నారు. తమ కళ ద్వారా ఇతరులకు స్ఫూర్తినిచ్చే యువ కళాకారులు. సాంకేతికత, ఆవిష్కరణలు: కొత్త ఆలోచనలతో ఇతరులను ఆకర్షించే యువ శాస్త్రవేత్తలు లేదా ఆవిష్కర్తలు.. వీరంతా స్ఫూర్తిప్రదాతలే. తమ విజయాలు మరియు ప్రయత్నాల ద్వారా ఇతరులను ప్రోత్సహించేవారే. ఇలాంటి యువతీ యువకులు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తారు. తమ చర్యల ద్వారా ఇతరులకు నాయకత్వం వహించడం నేర్పుతారు. సానుకూల మార్పును తీసుకువస్తారు: తమ చొరవ, కృషి ద్వారా సమాజంలో మంచిని పెంపొందిస్తారు. నమ్మకాన్ని పెంచుతారు. తమ మద్దతు, ప్రోత్సాహంతో ఇతరులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి సహాయం చేస్తారు. మీరు కూడా ఒక యువ మార్గదర్శకులు కావచ్చు, మీ చుట్టూ ఉన్నవారికి సహాయం చేయడం, వారిని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవచ్చు.

### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిపతాకను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



## ఉపాధికి ఎన్నో పథకాలు..

NATS — National Apprenticeship Training Scheme

Skill India — कौशल भारत - कुशल भारत

పది ఆలోచనలకంటే ఒక ప్రయత్నం మంచిది. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతున్న నేపథ్యంలో, ఉపాధి పొందడానికి మార్గాలు అన్వేషించడం మేలు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉపాధి అశకాశాలను అందిపుచ్చుకోవాలి.

ప్రభుత్వ పథకాలు

**ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై):** పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి ఈ పథకం ఉద్దేశించబడింది.

**దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియు-జికెవై):** గ్రామీణ ప్రాంతాల్లోని పేద యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం దీని లక్ష్యం.

**ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన (పిఎంఆర్‌వై):** విద్యావంతులైన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందిస్తుంది.

**ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పిఎంఇజిపి):** గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో కొత్త స్వయం ఉపాధి వెంచర్‌లను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను సృష్టించడం దీని లక్ష్యం.

**నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (ఎన్ఎటిఎస్):** సాంకేతికంగా అర్హత కలిగిన యువతకు వారి పని రంగంలో ఆచరణాత్మక జ్ఞానం మరియు నైపుణ్యాలను అందించే ఒక సంవత్సరం శిక్షణా కార్యక్రమం ఇది.

**నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (ఎన్ఎపిఎస్):** అప్రెంటిస్‌షిప్‌ను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం యొక్క కొత్త పథకం.

**సీఖో ఔర్ కమావో (నేర్చుకో... సంపాదించుకో):** మైనారిటీ యువతకు వారి విద్యార్హతలు, ప్రస్తుత ఆర్థిక పోకడలు, మార్కెట్ సామర్థ్యం ఆధారంగా వివిధ ఆధునిక/సాంప్రదాయ నైపుణ్యాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యం.

**స్టార్టప్ ఇండియా:** యువతలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి, కొత్త వ్యాపారాలను ప్రారంభించడానికి సహాయం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. స్టార్టప్‌లు వాటిలో ఒక భాగం.

### ఉపాధి కల్పించే ముఖ్య రంగాలు..

సేవల రంగం భారతదేశంలో యువతకు అతిపెద్ద ఉపాధి కల్పించే రంగాలలో ఒకటిగా ఉంది.

వ్యవసాయ రంగం ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది యువకులకు ప్రధాన ఉపాధి వనరుగా ఉంది. అయితే ఈ రంగంలో యువత నిశ్చితార్థం తగ్గుతోంది.

తయారీ రంగం కూడా ఉపాధి కల్పనలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది.

నిర్మాణ రంగం కూడా గణనీయమైన సంఖ్యలో యువకులకు ఉపాధిని అందిస్తోంది.

ఐటి, డిజిటల్ సేవల రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తోంది.

గిగ్ ఎకానమీ కూడా అభివృద్ధి చెందుతోంది, ఇది యువతకు మరింత అనువైన ఉపాధి అవకాశాలను అందిస్తోంది.

PMKVY — प्रधानमंत्री कौशल विकास योजना

### ఉపాధికి ఎదురవుతున్న సవాళ్లు..

అధిక నిరుద్యోగిత రేటు, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మరియు విద్యావంతులైన యువతలో ఒక పెద్ద సవాలుగా ఉంది. చాలా మంది యువతకు సరైన నైపుణ్యాలు లేకపోవడం వల్ల ఉద్యోగాలు పొందడం కష్టమవుతోంది .స్త్రీలలో శ్రామిక శక్తి భాగస్వామ్యం తక్కువగా ఉంది. అనేక ఉద్యోగాలు తక్కువ వేతనాలు మరియు అసంఘటిత రంగంలో ఉండటం కూడా ఒక సమస్య.

### తీసుకోవాల్సిన చర్యలు..

విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల నాణ్యతను మెరుగుపరచడం చాలా ముఖ్యం. పరిశ్రమ మరియు విద్యా సంస్థల మధ్య సహకారాన్ని పెంచడం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించవచ్చు. వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, కొత్త వ్యాపారాల ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం ద్వారా మరిన్ని ఉద్యోగాలను సృష్టించవచ్చు. మహిళల కోసం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఉద్యోగ భద్రత, మంచి పని పరిస్థితులను నిర్ధారించడం చాలా అవసరం. భారతదేశ యువ జనాభా దేశాభివృద్ధికి ఒక గొప్ప వరం. సరైన విద్య, నైపుణ్యం, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఈ యువ శక్తిని పూర్తిగా ఉపయోగించుకోవచ్చు.






## ఉద్యమిస్తున్న యువత

ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో, వేరువేరు అంశాలపై యువతరం ఉద్యమాలను నిర్వహిస్తోంది. యువత తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, మార్పు తీసుకురావడానికి ఉద్యమాల్లో ఎలా పాల్గొంటున్నారో చూడటం ఎంతో స్ఫూర్తిదాయకం. ప్రపంచ యువజన ఉద్యమాలు చాలా వైవిధ్యమైనవి. అనేక రకాల కారణాల కోసం ఏర్పడ్డాయి. నిజానికి యువజన ఉద్యమాలకు చారిత్రక ప్రాముఖ్యత ఉంది. చరిత్రను తరచిచూస్తే యువత ఉద్యమాలు ముఖ్యమైన పాత్ర పోషించడం కనిపిస్తుంది. పాత తరం వారి ఆలోచనలను సవాలు చేస్తూ, సామాజిక మరియు రాజకీయ మార్పులకు వారు తరచుగా ముందున్నారు. ఈ ఉద్యమాలు శాంతి, పర్యావరణం, పౌర హక్కులు, విద్య, ఆర్థిక న్యాయం, అనేక ఇతర సమస్యలపై దృష్టి సారించాయి. నేటి యువత ఉద్యమాలు సాంఘిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ సాధనాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి, తద్వారా వారు వేగంగా సమీకరించగలుగుతున్నారు. తమ సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయగలుగుతున్నారు. ఈ ఉద్యమాలు కొన్నిసార్లు గణనీయమైన సామాజిక, రాజకీయ మార్పులకు దారితీస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో యువత ఉద్యమమే, ప్రధాని షేక్ హసీనాను పదవి కోల్పోయి, దేశం నుంచి పలాయనం చిత్తగించేలా చేసింది. అనేక దేశాల్లో యువజన ఉద్యమాలు ఆయా దేశాల్లో నెలకొన్న రాజకీయ, ఆర్థిక విధానాలను మార్చాయి ప్రజల ఆలోచనలను ప్రభావితం చేశాయి. ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ (Fridays for Future): గ్రెటా థన్‌బర్గ్ (Greta Thunberg) ప్రారంభించిన ఉద్యమం వాతావరణ మార్పులపై తక్షణ చర్య తీసుకోవాలని ప్రపంచ నాయకులను డిమాండ్ చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది యువకులు ఇందులో పాల్గొన్నారు. ఎర్త్ ఫస్ట్! (Earth First!)అనేది మరింత తీవ్రమైన పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యక్ష చర్యను నమ్మే ఉద్యమం.

### పౌర హక్కులు, సామాజిక న్యాయ ఉద్యమాలు..

**అమెరికా పౌర హక్కుల ఉద్యమంలో విద్యార్థులు:** 1960లలో, నల్లజాతి విద్యార్థులు వివక్షకు వ్యతిరేకంగా నిరసనలు, సిట్‌ఇన్‌లు, ఇతర ప్రత్యక్ష చర్యలలో కీలక పాత్ర పోషించారు.

**బ్లాక్ లైవ్స్ మ్యాటర్ (Black Lives Matter):** పోలీసుల దుష్ప్రవర్తన, జాతి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఈ ఉద్యమంలో యువకులు ముందున్నారు.

### రాజకీయ మార్పు కోసం ఉద్యమాలు..

**అరబ్ స్ప్రింగ్ (Arab Spring):** 2010 దశకం ప్రారంభంలో మధ్య ప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికాలో జరిగిన ఈ ఉద్యమాలలో నిరంకుశ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా యువకులు ముఖ్యమైన పాత్ర పోషించారు.

**హాంగ్‌కాంగ్ నిరసనలు (Hong Kong Protests):** వివిధ రాజకీయ మరియు సామాజిక సమస్యలపై జరిగిన ఈ నిరసనలలో విద్యార్థులు, యువకులు ప్రముఖంగా పాల్గొన్నారు.

**విద్యార్థి ఉద్యమాలు:** ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు విద్య యొక్క నాణ్యత, అందుబాటు, ఇతర సమస్యలపై తరచుగా ఉద్యమాలు చేస్తున్నారు.


**శాంతి ఉద్యమాలు:** యుద్ధం, హింసకు వ్యతిరేకంగా యువకులు నిరంతరం గళం విప్పుతునే ఉన్నారు.

### ప్రస్తుత పోకడలు..

నేడు, సాంఘిక మాధ్యమాలు యువతను సమీకరించడానికి, వారి సమస్యలను ప్రపంచ దృష్టికి తీసుకురావడానికి శక్తివంతమైన సాధనంగా మారాయి. వాతావరణ మార్పులు, సామాజిక న్యాయం, మానసిక ఆరోగ్యం వంటి సమస్యలపై యువత ఎక్కువగా దృష్టి సారిస్తోంది. అంతర్జాతీయ సహకారం పెరుగుతోంది. వివిధ దేశాల యువకులు ఒకే సమస్యలపై కలిసి పనిచేస్తున్నారు. ఇది ఆహ్వానించదగిన మంచి పరిణామం.

## నేషనల్ హైవే భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐకెఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి



**ప్రజాపక్షం/చింతకాని :** నాగపూర్–అమరావతి నేషనల్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వందనం , కొదుమూరు గ్రామ రైతుల తో కలిసి నేషనల్ హైవే అధికారులు, జిల్లా కలెక్టర్‌ని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండపర్తి మాట్లాడుతూ రైతులు పంట పొలాలకు వెళ్ళేందుకు అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు ఇవ్వాలని, రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్న వ్యవసాయ బావులకు, హార్టికల్చర్ పంటలైన పామాయిల్ , సుబాబుల్ దీర్ఘకాలిక పంటలకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎకరానికి నష్టపరిహారం బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం రూ.25 లక్షల నుంచి రూ.30లక్షలుకు పెంచాలని డిమాండ్ చేశారు. స్పందించిన కలెక్టర్ అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు పంట నష్టపరిహారం ఇచ్చేందు అంగీకారం తెలిపారు. మిగతా సమస్యలు ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఐకెఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపుడి రవి, జిల్లా కోశాధికారి దొబ్బల వెంగళరావు, జిల్లా నాయకులు కొల్లి సీతయ్య , పెంట్యాల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంట్యాల అప్పారావు, రైతులు రేగళ్ల వెంకటేశ్వర్లు, మధుసూధన్ రెడ్డి, జనగాం వెంకటేశ్వర్లు, నీరుడు గోవిందరావు, వేముల సతీష్, చిట్టిమోదు లింగయ్య, కంసాని కిరణ్, కూచిపుడి వెంకటేశ్వర్లు, ఆవుల సైదులు, నారపోగు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

సిపిఐ నేతలు మొహ్మద్ మౌలానా, దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతూ సిపిఐకి పూర్వ వైభవం తీసుకువద్దామని పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని జలగంనగర్‌లో అక్కడి సిపిఐ ఆధ్వర్యంలో వార్డుశాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. గతంలో ఈ ప్రాంతం సిపిఐకి పెట్టని కోటగా నిలుస్తూ ప్రజల పక్షాన పోరాడిందన్నారు. కార్పొరేట్ రాజకీయాలతో వన్నె తగ్గినప్పటికీ నిఖార్సైన కామ్రేడ్స్ పార్టీకి రక్షణ కవచంలా ఉన్నారన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలో ఆ ఒరవడిని కొనసాగిస్తూ ప్రజలకు ఎర్రజెండా సాక్షిగా అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఐక్యంగా సంఘటితమై బలీయమైన శక్తిగా అవతరించాలని పిలుపునిచ్చారు. అనంతరం 16మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా రావూరి రామచంద్రయ్య, సహాయకార్యదర్శిగా ఎన్ నాగేశ్వర రావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ గద్ద నాయక్, రావుల శ్రీనివాస్, దేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు

# మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం దేశవ్యాప్తంగా మే 20 జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఎఐటియుసి కార్యకర్తల సమావేశం కందిక చెన్నకేశవులు అధ్యక్షతన సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం తన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తుందన్నారు. 2025–26 బడ్జెట్‌లో కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసిందని, సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందన్నారు. సామాన్యులపై భారాలు మోపి కార్పొరేట్, పెట్టుబడిదారీ సంస్థలకు వేలకోట్ల రాయితీలు ప్రకటించిందన్నారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకపోగా ఈ సమస్యలు మరింత తీవ్ర రూపం దాల్చే ఆర్థిక విధానాలను విచక్షణారహితంగా అమలు చేస్తుందన్నారు. వీటికి వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్స్ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించారన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ కార్మిక దినోత్సవం మే 1న జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు తమ యూనియన్ అడ్డాల వద్ద జెండాలు ఆవిష్కరించుకొని మేడే అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు అనస ప్రసాద్, సంఘీ ఏలేందర్, తాళ్లపల్లి జాన్ పాల్ గోవర్ధన్, ఎండి యాకూబ్, ఉప్పుల రవి, కలకోట రాజు, నాగవెల్లి శంకర్, యుగానందు చారి, నల్ల తీగల కుమార్, జన్ను రాజు తదితరులు పాల్గొన్నారు

## అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత

ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధానకార్యదర్శి దాసు

**ప్రజాపక్షం/వేమనపల్లి/మంచిర్యాల :** అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా సోమవారం వేమనపల్లిలో మేడు ఉత్సవాఆల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని, ఎన్‌హెచ్‌ఎం వర్కర్లు, 2వ ఎఎన్ఎం, స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక దినోత్సవం మే 1న జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు తమ యూనియన్ అడ్డాల వద్ద కార్మిక జెండాలు ఆవిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు దేవనబోయిన బాపు, అందే పురుషోత్తం, చిన్న శంకర్, నాగయ్య, మంజుల, కళావతి, శ్రీవాణి, తేజస్విని, మల్లేష్, తిరుపతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.



## హక్కుల రక్షణకు ఉద్యమాలు

ఎఐటియుసి నేతలు సత్యనారాయణ, రాములు, ఇమ్రాన్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** హక్కుల రక్షణకు ఉద్యమాలు చేయాలని ఎఐటియుసి యాదాద్రి జిల్లా గౌరవ అధ్యక్షుడు బోలగాని సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేటువరం చేస్తూ, కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల మెప్పు కోసమే కార్మిక చట్టాలను కుదించాలని ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను మానుకోవాలని దేశవ్యాప్తంగా కేంద్ర కార్మికసంఘాల ఆధ్వర్యంలో జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సహాయ కార్యదర్శులు కూరేళ్ల మచ్చగిరి, గనబోయిన వెంకటేష్, గోపగాని రాజు, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, పల్లె శ్రీనివాస్, పుట్ట రమేష్, కౌన్సిల్ సభ్యులు చొప్పరి సత్తయ్య, దుబ్బాక సంజీవ, దాసరి లక్ష్మయ్య, పాపగళ్ల శంకరయ్య, ముదిగొండ బస్వయ్య, గౌరవంతల శ్రీనివాస్, పురుగుల రవి, ఎస్‌కె మన్సూర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక చట్టాల రద్దుకు పోరాడదాం





ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు నల్ల కార్మిక చట్టాల రద్దుకు ఐక్యంగా పోరాడుదామని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ పెన్షనర్ల భవన్‌లో ఐక్య కార్మిక సంఘాల జిల్లా సన్నాహాక సదస్సు బొమ్మెన సురేష్ సిఐటియు, టియుసిఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి హరిత అధ్యక్షతన సోమవారం జరిగింది. సదస్సుకు ఎస్.విలాస్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాల అమలును తీవ్రతరం చేసిందన్నారు. స్కీం వర్కర్లయిన ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజన కార్మికులు, అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైంది. ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని పోరాటాలు చేస్తున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలని మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అన్నిరంగాల ఉద్యోగ, కార్మికులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌చారి, టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి రాజన్న, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జయలక్ష్మి, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి సూర్యశివాజీ, ఎఐసిసిటియు రాష్ట్ర నాయకులు ఖాజామొయినుద్దీన్ హాజరై మాట్లాడారు.

**కాగజ్ నగర్ :** కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశాయి. మే 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సోమవారం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లోని రిటైర్మెంట్ ఎంప్లాయిస్ భవన్‌లో కార్మిక సంఘాల జిల్లా సదస్సు జరిగింది. సమావేశంలో బోగే ఉపేందర్ మాట్లాతేడూ కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని కోరారు. స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఐఎఫ్‌టియు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చాంద్‌పాషా, కార్మిక సంఘాల నాయకులు సత్యనారాయణ, సుధాకర్, కృష్ణమాచారి, తిరుపతి, పొచ్చన్న, భీమ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** బాలానగర్ మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సిఎచ్‌ఎస్) జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రం లో రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ఓ.పి.ఎంత మంది రోగులు వస్తున్నారు. ఏ సమస్యలతో వస్తున్నారు. డాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందులు సరిపడ ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు.



## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తిప్పికొట్టండి

**ప్రజాపక్షం/మక్తల్ :** 139 మే డే ను కార్మిక అమరవీరుల ఆశయాల సాధనలో భాగంగా కార్మిక హక్కులను సాధించే దిశలో మేడే జరుపుకోవాలని టియుసిఐ కార్మిక వర్గానికి పిలుపు స్థానిక మున్సిపాలిటీ దగ్గర 139 వ మే డే గోడ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా కోశాధికారి కొలిమి రాములు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి బడా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మిక వర్గాన్ని వెట్టి బానిసరిగా మార్చే ప్రయత్నాలను తిప్పిగొట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేస్తున్నాను. మోడీ ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉంది 139 వ మే డే సందర్భంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ కై పిఎఫ్, ఈఎస్ఐ సంక్షేమ బోర్డుల కై పోరాడాలని ఉద్యోగ సామాజిక భద్రతకై జీవించడానికి సరిపడే లివింగ్ వేతనాలకై సమన పనికి సమన వేతనం కై సంఘటిత అసంఘటిత రంగ కార్మిక వర్గం. లోని భవన నిర్మాణరంగం మోటార్ రంగం వర్తక వాణిజ్య రంగం కార్మికులకు 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు 9,000 పింఛన్ పథకం ఇవ్వాలని భవన ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డు కు ప్రమాద బీమా 10 లక్షలు ఇవ్వాలని. అసంఘటిత రంగ కార్మిక వర్గానికి ప్రమాద బీమా వర్తింప చేయాలని కార్మికులకు పకడ్బందీగా అమలు చేస్తూ నాలుగుకోడ్లను రద్దు చేయాలని ఈ మే డే సందర్భంగా కార్మిక వర్గం కార్మిక హక్కులు సాధించే దిశలో మే డే పోరాట దినంగా జరుపుకోవాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా. టియుసిఐ కార్మిక వర్గానికి పిలుపు. ఈ కార్యక్రమంలో ఆశన్న నరసింహ, శంకరమ్మ, మహేశ్వరమ్మ, రాయకోడ్ అంజి, కొలిబి హరి, ఆకాష్, నరసింహ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 86 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయం సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించి ప్రజావాణి కార్యక్రమానికి 86 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ కు అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## నాగర్ కర్నూల్‌లో 21 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 21 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు అందజేసిన వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి వెంటనే దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## భూ భారతి సద్వినియోగం
## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన భూ భారతి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. సోమవారం నాడు జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన భూవరధి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. భూ భారతి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఇందులో ఎలాంటి అపోహలో పోవద్దని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అనేక అవకతవకలు జరిగాయని వాడన్నింటిని సర్దితే ఎందుకు భూపతి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల కేంద్రానికి చెందిన అధికారులు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికీ ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం / కొత్తకోట:** దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తకోట మున్సిపాల్టీలో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు కొత్తకోట మున్సిపాల్టీ కమిషనర్, మార్కెట్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ , కొత్తకోట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మేస్త్రీ శ్రీను అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ ఇందిరమ్మ ఇండ్లను ప్రతి పేద కుటుంబానికి అందిస్తామని చెప్పారు. 200 ఇండ్లు కొత్తకోట పట్టణానికి మంజూరు చేశామని అదేవిధంగా విడతల వారిగా అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని అన్నారు. ఇలాంటి ఇబ్బంది ఉన్న ఇందిరమ్మ కమిటీ వార్డు ఆఫీసర్లకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు కలిసి మీ సమస్యని తెలుసుకోగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు వాడా ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భూ భారతితో రైతుకు భరోసా, భద్రత

### కలెక్టర్ సిక్తా పట్నాయక్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/నారాయణపేట్:** రైతులు కొత్త చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తీసుకువచ్చిన భూ భారతి చట్టం ద్వారా ప్రతి రైతుకు భరోసా భద్రత కల్పించబడుతుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. రైతుల మేలు కొసమే ధరణి స్థానం లో సిఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని, రైతులందరూ చట్టం పై అవగాహన పెంచుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని వారు సూచించారు. భూ భారతి చట్టం పై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా సోమవారం మక్తల్ నియోజకవర్గం లోని కృష్ణా, మాగనూర్ మండల కేంద్రాలలో గల రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు కలెక్టర్ ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ధరణి లో ఉన్న అనేక లోటు పాట్లు, అస్పష్టత గల మ్యాడుల్స్ వల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కానీ భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన అన్ని భూ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారికి భూధార్ కార్డును ఇవ్వడం జరుగుతుందన్నారు. ధరణిలో అధికారులకు అధికారాలను తొలగించడం వల్ల భూ సమస్యల పరిష్కారం నిమిత్తం రైతులు, సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, భూ భారతిలో అలాంటి అవసరం లేదని తెలిపారు. కింది స్థాయి అధికారుల వద్ద పొరపాట్లు జరిగితే లేదా పని కాకపోయినా పై స్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం భూ భారతిలో ఉందన్నారు. ధరణి లో సాదా బైనామా ల పరిష్కారానికి ప్రొవిజన్ లేకపోయిందని, కానీ కొత్త చట్టం లో సాదా బైనామా లకు కూడా పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అంతే కాక భూ భారతి లో ప్రతి సంవత్సరం రికార్డులను అప్డేట్ చేయడమే కాకుండా, భద్రపరచడం జరుగుతుందన్నారు.

అధికారులు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అలాగే రైతులు సైతం భూ భారతి చట్టం అమలులో అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్॥ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ. రైతుకు తన జీవితంలో తనకు తెలియకుండా ముడిపడిన అంశము తన భూమి అని, ఆ భూమి ఎంత ఉందో తెలిపేది పాసు బుక్ అని గతంలో ఆ పాస్ బుక్ కి రైతుకి మధ్య బంధాన్ని తెంచేసి ఆ దరిద్రానికి పార్ట్ బి. అని పేరు పెట్టి ఎందరో రైతుల ఉసురు పోసుకున్నారనీ గత ప్రభుత్వాన్ని విమర్శించారు. గతంలో ఎవరైనా రైతులు గత పాలకులకు అడ్డుపడితే వారి భూములను ధరణి పార్ట్ బి లో పెట్టించి వారి భూములను అడ్డీకి పావుసెరులా కొట్టేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయనీ ఆరోపంచారు. పీసీసీ అధ్యక్షులుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనాడు పాదయాత్ర చేస్తున్న సమయంలో భూ సమస్యల గురించే రైతులు ఎక్కవ వినతులు ఇవ్వడంతో రైతుల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలని ఉద్దేశంతో భూ భారతి చట్టాన్ని రూపొందించారని ఆయన తెలిపారు. ఒక్కప్పుడు రైతులే తహాసిల్దార్ వద్దకు వెళ్లాల్సి ఉండేదని, కానీ ఇప్పుడు తహాసిల్దార్, మిగతా రెవెన్యూ అధికారులే రైతుల వద్దకే వచ్చి సమస్యల పై దరఖాస్తులు తీసుకుంటారని ఆయన తెలిపారు.
ఏదో సమస్యల దరఖాస్తులు తీసుకుని తర్వాత చేద్దాం, చూద్దాం అని అధికారులు దాట వేయటానికి ఈ చట్టంలో ఆస్కారమే లేదని, 30 రోజుల్లోపు సమస్యకు పరిష్కారం చూపకపోతే పోర్టల్ లోనే సమస్య కు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. చదువుకున్న యువత తమ తమ గ్రామాలలో రచ్చబండ వద్ద రైతులను కూర్చోబెట్టుకుని వారికి కొత్త చట్టం గురించి క్లుప్తంగా వివరించి చెప్పాలని ఎమ్మెల్యే కోరారు.
ధరణి భూతాన్ని బంగాళ ఖాతంలో కలిపి కొత్త భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

ఆయా కార్యక్రమంలో శిక్షణా కలెక్టర్ ప్రణయ్ కుమార్, కృష్ణా, మాగనూర్ మండలాల తహాసిల్దార్లు, ఎంపీడీవో లు, సురేష్, వెంకటేష్, జానయ్య, రహమతుద్దీన్, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పూర్తి అవగాహనా సదస్సులు

### ఇన్‌చార్జి కలెక్టర్ విజయేందిరబోయి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రైతులకు భూభారతిచట్టంతో మేలు జరుగుతుందని, రైతుల భూసమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా ఇంచార్జి కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలకేంద్రంలోగల రైతువేదికలో సోమవారం ఏర్పాటు చేసిన భూభారతిచట్టం 2025 అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతిచట్టం భూసమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. పారదర్శకత జవాబుదారీతనంతో పనిచేసేలా ఈచట్టాన్ని రూపొందించిందన్నారు. భూభారతిచట్టం ద్వారా పక్కాగా భూసరిహద్దులు నిర్ణయిస్తారని, రైతులకు ,భూహక్కుదారులకు ఉచిత న్యాయసాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30రోజుల లోగా మ్యూటేషన్ పూర్తిచేయకుంటే ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమిసర్వే జరిపించి మ్యాప్ తయారుచేయాల్సి ఉంటుందన్నారు. పెండింగ్ సాదా బైనామాల పరిష్కారంకోసం భూభారతిచట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జిల్లాలో ఒక మండలాన్ని పైలట్‌ప్రాజెక్టుగా తీసుకోనున్నట్లు, తద్వారా భూభారతిచట్టం అమలుతీరును పర్యవేక్షించనున్నట్లు, గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్య దరఖాస్తులు స్వీకరించడమేకాకుండా సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తారన్నారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్‌డిఓ సురేష్, మండలస్పెషల్ ఆఫీసర్ జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.


## ఉచితవైద్య శిబిరం అభినందనీయం




**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచితవైద్య శిబిరం ఏర్పాటుచేయడం అభినందనీయమని మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, డాక్టర్ దామోదర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మహిత మల్టీస్పెషాలిటి ఆస్పత్రి వార్షికోత్సవం సందర్భంగా గైనకాలజిస్టు డాక్టర్ యశోదబాయ్ ఉచితవైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని డాక్టర్ దామోదర్‌రెడ్డి, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.

డాక్టర్ యశోదబాయ్, డాక్టర్ రాజు 200లమందికి పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివరాం, పరుషరాములు, సిఐటియు ఆంజనేయులు, శేఖర్, ఆస్పత్రి సిబ్బంది, కిరణ్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీకౌన్సిలర్ ఎజాజ్, కెవిపిఎస్ పోలే వెంకటయ్య పాల్గొన్నారు.

## ప్రజాప్రభుత్వంలో గ్రామీణ క్రీడాకారులకు మంచి రోజులు : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ప్రజాప్రభుత్వంలో గ్రామీణ క్రీడాకారులకు మంచి రోజులు వచ్చాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మే 16,17,18 తేదీల యందు మహబూబ్‌నగర్ పట్టణం లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జాంగ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ (జెపిఎల్) సీజన్ 3 జాంగ్ర కమ్యూనిటీ హాల్‌లో చెస్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జెపిఎల్ సీజన్ 3 క్రికెట్ చేస్ చాంపియన్ షిప్ టోర్నమెంట్ గ్రామీణ క్రీడాకారులకు మంచి అవకాశం అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రికెట్ చెస్ క్రీడాకారులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అచ్చుగట్ల అంజయ్య, సద్దె పవన్‌కుమార్, పి.అనిల్ కుమార్, చెన్నవీరయ్య, మద్దూరి రాఘవేందర్, సద్దె శివ, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల్లో మాదక ద్రవ్యాల వాడకం నిరోధించేలా అవగాహన కార్యక్రమాలు

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** ప్రతి కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం నిరోధించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్॥ కె. కృష్ణ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో



మాట్లాడుతూ యాంటీ డ్రగ్ కమిటీ ప్రతి కళాశాలలో విద్యార్థులను పర్యవేక్షించాలని, కళాశాలలో ఎవరైనా డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడిన వారిని గుర్తించాలని, విద్యార్థులకు డ్రగ్స్ బారిన పడకుండా వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సంబంధిత అధికారులకు, కళాశాలల ప్రిన్సిపల్ లకు తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1908కు సమాచారం అందించవచ్చని, వివరాలు అందించిన వారి వివరాలు సీక్రెట్‌గా ఉంచబడుతుందరిని అన్నారు. అనంతరం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డిఎస్పీ పి.బుచ్చయ్య, డిసిఆర్‌బి డీఎస్పీ వెంకటరమణా రెడ్డి, డీఎస్పీ వేంకటేశ్వర్లు, ఇన్చార్జి ఇంటర్మీడియట్ విద్య అధికారి రామ లింగం, ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డా॥ రాజ్ కుమార్, జిల్లా వెల్ఫేర్ అధికారి జరీనా బేగం, కళాశాలల ప్రిన్సిపల్స్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవానికి ఆహ్వానం

**ప్రజాపక్షం/వెల్దండ:** దక్షిణకాశిగా పేరుగాంచిన శ్రీగుండాల అంబరామలింగేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం దాత చిలువేరు రామస్వామి అలివేలు మంగ దంపతులు నిర్మాణంచేపట్టిన ముఖ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆలయ నిర్వాహకులు సోమవారం ఆహ్వానించారు. మండలకేంద్రంలో ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిశారు. ఈనెల 30న నిర్వహించే ఆలయ ముఖద్వార ప్రవేశ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రావాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా ఎంపి మల్లురవి పాల్గొనున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు మెంబర్ బాలాజిసింగ్, మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్టవెంకటయ్య గౌడ్, సంజీవ్‌కుమార్‌లను ఆహ్వానించారు. కార్యక్రమంలో ముఖద్వార నిర్మాణదాత రామస్వామిగౌడ్, మల్లెపల్లి పర్వత్‌రెడ్డి, అర్చకులు ఉన్నారు.




## తప్పల సవరణ చేపట్టి క్రమబద్ధీకరించే అవకాశం

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా భూవివరాల్లో దొర్లిన తప్పుల సవరణచేపట్టి క్రమబద్ధీకరించే అవకాశం ఉందని నాగర్‌కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అమరేందర్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం తహసీల్దార్ శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన భూభారతిచట్టంపై అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ధరణిచట్టం 2020లో భూవివరాల నమోదు తొలగింపులకు తహసీల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్‌తోపాటు ఏ అధికారికి అధికారం లేకపోవడంతో చాలావరకు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతిచట్టంలో సవరణ, తొలగింపు, చేర్పుటకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అందుకు అవసరమైన రికార్డులతోపాటు మోక పంచనామా సర్టిఫైడ్ సర్వేయర్‌తో చేయించి ధృవీకరణ ఇవ్వాలని తెలిపారు. సాదాబైనమాలను పరిశీలించి నిజమైన హక్కుదారుడికి చట్టంలో పేర్కొన్న విధంగా క్రమబద్ధీకరణ చేపట్టి పాసుపుస్తకాలు మంజూరు చేయవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ సురేష్, తహసీల్దార్ శ్రీరాములు, తహసీల్దార్ చిక్కుడు రవికుమార్, ఏఓ నీతిరెడ్డి, ఇంచార్జీ ఎంపిఓ మహేష్‌నాయక్, రికార్డు అసిస్టెంట్ భగవంతుసాగర్, ఏఈవోలు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి కార్యకర్తలు, రేషన్‌డీలర్లు, ఆశ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## నృత్యసంగీత శిక్షణ శిబిరం ప్రారంభం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో స్థానిక న్యూ ఎరా కళాశాలలో వేసవినృత్య సంగీత శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని బృంగి ఆనంద్‌కుమార్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నెలరోజులపాటు జరిగే ఈశిబిరంలో కూచిపూడి, జానపద, పాశ్చాత్య నృత్యాలతోపాటు లలిత, జానపద సంగీతం, సంగీత వాయిద్యాల్లో శిక్షణ ఇవ్వబడుతుందని శిబిరం ముగింపు ఉత్సవాలలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారని ఆసక్తికలిగిన విద్యార్థులు శిబిరంలో చేరాలని సంస్థ నిర్వాహణ బాధ్యులు నారోజు మోహన్ తెలిపారు. కార్యక్రమంలో సింగంవిజయ్‌గౌడ్, న్యూ ఎరాకాలేజి ప్రిన్సిపాల్ సత్యం, మాస్టర్ రాజు, మాస్టర్ అంజి, నరేష్, శేఖర్, రమేష్, అరుణ్, రాధాకృష్ణ, జీవిత పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లలో అవకతవకలు

### ఎంపిడిఒకు గ్రామస్థుల వినతి

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలైన నిరుపేదలకు ఇల్లు అందించాలని ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పు న ఇందిరమ్మ పథకం కింద అందివ్వడమైనది. మొదటి విడతగా నిరుపేదలైన అసలు ఉండడానికి ఇల్లులేని వారు అర్హులా గుర్తించి మొదటగా వారికి అందించాలని రాజకీయ పార్టీలకు అతీతంగా ఇవ్వాలని గ్రామ సభ లో చెప్పడం జరిగింది. అయితే ఉట్కూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు రాకపోగా తక్షణమే ఎంపిడిఒ కు, అధికారులు స్పందించి కొత్తపల్లి లో రివెరిఫికేషన్ చేయాలని ఎంపిడిఒ కు వినతిపత్రం ఇచ్చారు. అసలు ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వాళ్లకు అర్హులుగా ప్రకటించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధా న కార్యదర్శి భాస్కర్, ఆర్.నర్సిములు, వై. బలరాం, తదితరులు పాల్గొన్నారు.





## కండక్టర్ నిజాయితీకి ప్రశంస

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఆర్‌టిసి కండక్టర్ నిజాయితికి ఆర్‌టిసి ఎండి సజ్జనార్ ప్రశంసించిన సంఘటన అచ్చంపేట డిపోలో చోటుచేసుకుంది. అచ్చంపేటడిపోనుండి హైదరాబాద్ వెళుతున్న ఆర్‌టిసిబస్సులో సుమారు రూ.13లక్షలు విలువచేసే బంగారం, వెండి, కొంతనగదు ప్రయాణికుడు పొగొట్టుకున్నాడు. అట్టిబ్యాగును అచ్చంపేట డిపోకు చెందిన కండక్టర్ వెంకటేశ్వర్లు గమనించి బ్యాగును ఆర్‌టిసి డిఎంకు అందజేశారు. విషయం తెలుసుకొని విచారించి లబ్దిదారుడికి అట్టి వస్తువులను అందించారు. అనంతరం సమాచారంకొరకు ఆర్‌టిసి ఎండి సజ్జనార్‌కు తెలియజేయడంతో ఆయన కండక్టర్ వెంకటేశ్వర్లును ప్రశంసించి ఆర్‌టిసి బస్‌భవన్‌లో బహుమతి అందజేశారు.

## గుర్తుతెలియని యువకుడి శవం లభ్యం



**ప్రజాపక్షం/అచ్చంపేట :** శ్రీశైలం హైదరాబాద్ జాతీయరహదారిపై గుర్తుతెలియని యువకుడి శవం లభ్యమైనట్లు ఉప్పునుంతల పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం... శ్రీశైలం హైదరాబాద్ జాతీయరహదారిపై లత్తిపూర్ స్టేజివద్ద సోమవారం యువకుడి శవం లభించినట్లు తెలిపారు. పచ్చచొక్క, నీలికలర్‌ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. అతని వయసు 35నుండి45 ఉంటుందని అభిప్రాయపడ్డారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వివరాలకు 8712657738 , 9603214603, 9491486313కి సమాచారం తెలపగలరన్నారు.

# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## కార్మికుల హక్కులను సాధించుకుందాం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రపంచ కార్మికుల పర్వదినం మేడేను జయప్రదం చేయాలని, మండలంలోని అన్ని గ్రామాల్లో ఎర్రజెండాలను ఎగురవేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, ఎఐటియుసి మండల అధ్యక్షులు బెజ్జం రమేష్‌లు కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన అనుబంధ సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆనందరావు, నందిపాటి కనకయ్య, పిట్టా రామకృష్ణ, మాచర్ల రవి, సతీష్, వినోద్, సాహెబ్, యడ్ల అంజిరెడ్డి, ప్రతాని సైదులు పాల్గొన్నారు.






## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను హెచ్చరించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం అని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల తీరును పర్యవేక్షించేందుకు భువనగిరి మండలం నందనం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలను జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. వసతుల కల్పనపై రైతులను అడిగి తెలుసుకుంటూ, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. రైతులు అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా ముందస్తుగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఆనంతరం అధికారులతో మాట్లాడుతూ రైతుల తెచ్చిన ధాన్యాన్ని ప్రతిరోజు తేమ శాతాన్ని పరిశీలించి రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. రిజిస్టర్‌లో రైతు పేరు ధాన్యం వివరాలు సెల్ నెంబరు తప్పనిసరిగా ఉండి తీరాలన్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తూ అదేరోజు రవాణా చేపట్టి మిల్లర్లకు తరలించాలన్నారు. కలెక్టర్ వెంట అధికారులు కొనుగోలు కేంద్రం నిర్వహణ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలకు పరిష్కారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : సమస్యల పరిష్కారానికి వచ్చిన బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజల సౌకర్యార్థం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 28 మంది అర్జీదారులతో జిల్లా ఎస్‌పి నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చి న ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కటినంగా వ్యవహరించాలని అన్నారు.

## ఇంటి నిర్మాణాన్ని అక్రమంగా కూల్చడం అన్యాయం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లోని 2014 సంవత్సరంలో తాను పుండరీకం ద్వారా 30.2 చదరపు గజాలను గుండా వెంకన్నకు విక్రయించినట్లు అనంతుల మల్లీశ్వరి తెలిపారు. సోమవారం ఆమె ఇంటి కూల్చివేసిన ప్రదేశంలో విలేకరులతో మాట్లాడారు. ఇంటి స్థలాన్ని డాక్యూమెంట్ నెంబర్ 12698, 2017 సంవత్సరంలో గుండా వెంకన్న, రుద్రంగి కిరణ్ కుమార్ తండ్రి సత్యనారాయణకు విక్రయించినట్లు తెలిపారు. గుండా వెంకన్న, అనంతుల మల్లీశ్వరి నుండి ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసేసమయంలో విద్యానగర్‌కు చెందిన ఆంగోతు భావ్‌సింగ్ సాక్షిగా డాక్యూమెంట్‌పై సంతకం చేశారని తెలిపారు. కానీ ఇటీవల అదే స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా భావ్‌సింగ్ ఫిర్యాదుతో రోడ్డు వైపు నిర్మాణం చేస్తున్నారని ఉద్దేశ్యంతో మున్సిపాలిటి అధికారులు దౌర్జన్యంగా కూల్చివేశారని వాపోయారు. మున్సిపాలిటి మాస్టర్ ప్లాన్ ప్రకారం 50ఫీట్ల రోడ్డు ఉండగా 40ఫీట్ల రోడ్డు వైపున కడుతున్నారనే అక్రమంగా కూల్చివేశారని తమకు న్యాయం చేసి బాధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండా వెంకన్న, రుద్రంగి సత్యనారాయణ ఉన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్** : నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసేది ప్రజలను పోరాటాలలో పాల్గొనేలా చైతన్యం చేసేది ఒక్క ఎర్రజెండా తప్ప ఇతర పార్టీలు కాదని సిపిఎం మాజీ ఎమ్మెల్సీ, మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సోమవారం భువనగిరిలోని సుందరయ్య భవనం నుండి వందలాది మందితో ప్రారంభమైన ప్రజా సమస్యల పాదయాత్ర జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో పరిపాలించిన బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయక ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన పరిస్థితి అందరు గమనించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒకటి రెండు తప్ప మిగతా అమలు చేయడంలో విఫలమయ్యారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, జెల్లెల పెంటయ్య పాల్గొన్నారు.



# రాచకొండ భూములను కాపాడాలి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : శివన్నగూడెం రిజర్వాయర్ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రాచకొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చౌటుప్పల్ నారాయణపురం మండలంలోని ప్రతి ఎకరానికి సాగునీరు తీసుకొచ్చి ఈ ప్రాంత రైతుల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో రెవిన్యూ శాఖ నిర్వహించిన తెలంగాణ భూభారతి చట్టం ( భూమి హక్కుల రికార్డు) 2025 మండల స్థాయి అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సత్యం, జిల్లా కలెక్టర్ హనుమంతరావుస్వాగతం పలికి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆరోజు జిల్లాల విభజన శాస్త్రీయ పద్ధతిలో జరగలేదనీ రాజకీయ అవసరాల కోసం జిల్లాలను కెసిఆర్ విభజించి రాష్ట్రాన్ని 33 ముక్కలు చేసి రాజ్య పరిపాలన చేశారనీ విమర్శించారు. పేద రైతుల భూములు పోవద్దు, పేదలు భూముల సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగొద్దనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ధరణిలో మ్యూటేషన్ చేయడానికి సవాలక్ష సమస్యలు రాచకొండ ప్రాంతంలో ఎన్నో రకాల భూ సమస్యలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులకు పోలీసులు అటవీ అధికారులతో వేధింపులు ఎక్కువయ్యాయిగతంలో మన ప్రభుత్వం లేకపోవడం వల్ల ఏమి చేయలేకపోయాము ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చింది. భూమి ని నమ్ముకున్న ఏ ఒక్క రైతుకు అధికారుల నుండి వేధింపులు ఉండకూడదని ఇక్కడ ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని ప్రజల పక్షాన రెవిన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

# కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు



**ప్రజాపక్షం/హాలియా:** పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త తన గుండెల్లో ఉంటాడని పార్టీకి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుంచుకుంటామని మాజీ సీఎల్పీ నేత ఏఐసీసీ సభ్యుడు కుందూరు జానారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన కేతావత్ శంకర్ నాయక్ కు ఆదివారం రాత్రి హాలియాలో ఆల్ ఇండియా బంజారా సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా శంకర్ నాయక్ పార్టీకి ఎనలేని కృషి చేశారని శంకర్ నాయక్ లాంటి వాళ్లను పదుల సంఖ్యలో అత్యున్నత స్థాయికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నేటి యువత నీతివంతమైన పాలనకు శ్రీకారం చుట్టాలని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిది అన్నారు. శంకర్ నాయక్ లాంటి నాయకులే ఇందుకు నిదర్శనం అన్నారు. ప్రతి కార్యకర్తను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని గౌరవించాలని సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం శంకర్ నాయక్ ను కుందూరు జానారెడ్డి ఎంపీ రఘువీర్ రెడ్డి ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. బంజారా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బంజారా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంగోతు భగవాన్ నాయక్,కోశాధికారి సక్రు నాయక్,కర్నాటి లింగారెడ్డి,కొండేటి మల్లయ్య, గోపగాని మాధవి ,మేరెడ్డి వెంకట్ రాహుల్, కుందూరు వెంకట్ రెడ్డి, కాల్ సాని చంద్రశేఖర్, కృష్ణా నాయక్, నరేందర్ రెడ్డి చంద్రా రెడ్డి, గౌని రాజా రమేష్ యాదవ్, పాండు నాయక్, సర్దార్ నాయక్, ముని నాయక్‌లు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** అకాల వర్షాల వల్ల పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో అకాల వర్షం కారణంగా రైతులకు పెద్ద ఎత్తున నష్టం జరగడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పర్యటించి రైతుల యొక్క మామిడి తోటకు వెళ్లి తోట లో పరిశీలించడం జరిగింది. అదేవిధంగా వరి కల్లాలను వానకు తడిసిన వరి ధాన్యమును ఎమ్మెల్యే పరిశీలించడం జరిగింది. అనంతరం ధరూర్ మండల కేంద్రము వరి ధాన్యము కొనుగోలు సెంటర్ ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సందర్శించి ధాన్యమును పరిశీలించడం జరిగింది. ముఖ్యమంత్రి దృష్టికి వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రతి ప్రతి ఒక రైతును ఆదుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కురువ హనుమంతు, జిల్లా సీనియర్ నేత గద్దం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి పవర్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్ 1లో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాల ప్రకారం ప్లాంట్‌లోని యూనిట్2ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా యూనిట్ 1ను(800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం) మే నెలలో ప్రారంభించేందుకు అధికారులు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. కాగా బాయిలర్‌కు ఆయిల్ సరఫరా అవుతున్న క్రమంలో పైపులైన్‌కు ఏర్పాటు చేసిన గ్యాస్ వద్ద లీకేజీ ఏర్పడడంతో ఆయిల్ కింద ఉన్న మెటీరియల్స్‌పై పడడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఉద్యోగులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించడంతో వారుక అక్కడికి చేరుకోని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో సంఘటన జరిగిన ప్రాంతంలో ప్రాణ నష్టం సంభవించలేదు కాని కేబుల్స్ కాలిపోవడంతో లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది. దీంతో ట్రయల్ రన్ పనులు పూర్తి కావాలంటే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. విషయం తెలుసుకున్న బ త్తుల లక్ష్మారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఈ ప్రమాదంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క టీజెన్‌కో సీఎం సం దీప్‌కుమార్ సుల్తానియా, బీహెచ్‌ఈఎల్ సీఎండీ సదాశివమూర్తి, వైటీపీఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.





## అమరవీరుల స్మారక భవనాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా పోలీస్ కార్యాలయంలో కోమటి రెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో అమరవీరుల స్మారక భవన పునర్నిర్మాణం ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యం.యల్.సి శంకర్ నాయక్ , జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి,కోమటి రెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో అమరవీరుల స్మారక భవనాన్నీ నూతన హంగులతో తీర్చి దిద్దినందుకు జిల్లా పోలీస్ శాఖ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈవో గోనా రెడ్డి,నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి ఏ.ఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు,మాజీ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, సిఐలు రాఘవ రావు, రాజశేఖర్ రెడ్డి, ఆది రెడ్డి,రాజశేఖర్,కొండల్ రెడ్డి,ఆర్.ఐ సంతోష్, ఎస్.ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## మేడే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్నటువంటి కార్మిక సంఘాల మేడే సన్నాహక కమిటీ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ హాజరై మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే కార్మిక దినోత్సవ మేడేను యాదగిరిగుట్ట పట్టణంలో అన్ని కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా మేడే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, తాపీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పబ్బాల రాజు, పబ్బాల శ్రీరాములు, నాగపురి శ్రీను, ఆటో కార్మిక సంఘం కళ్లెం సిద్దులు, మన్సూర్ పాషా, నాగరాజు, ఆకుల శ్రీను మున్సిపల్ సంఘం పేరబోయిన స్వామి,జహంగీర్ చిన్న వ్యాపారస్తుల సంఘం చందు నాయక్, శ్రీను, ఉంగరాల సంఘం మునుకుంట్ల నరసమ్మ, కోనేరు శ్రీను, లైట్ మోటార్ వెహికల్స్ సంఘం ఒంటెద్దు సంజీవ, పొన్నాల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం



జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అధికారులను అదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 80 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అత్యధికంగా భూ సమస్యలపై, హౌజింగ్‌పై దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. తాహసిల్దార్లు పరిశీలించాలని పేర్కొన్నారు. వివిద శాఖలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నవని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యలపై 32, హౌజింగ్ 10, మున్సిపాలిటి 6, డిఆర్‌డిఎ 4, డిడబ్ల్యూఓ 3, ఇతర శాఖలకు సంబంధించినవి 25 మొత్తం 80 దరఖాస్తులు వచ్చినవని వీటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి డిప్యూటి సిఇవో శిరిష, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరిండెంట్ శ్రీనివాసరాజు, డిఎస్‌వో రాజేశ్వరరావు, డిఎంహెచ్‌వో కోటాచలం, నర్సింహరావు, లత, బాపూజీ, డిఎవో శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

# భూ భారతితో సమస్యలు పరిష్కారం

భూ భారతిపై అవగాహన సదస్సు
జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** భూ భారతితో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమౌతాయని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని స్వర్ణవేధిక ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన భూ భారతి చట్టం 2025 అవగాహన సదస్సును కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో రైతులు ఎక్కడికి వెళ్ళాల్సిన అవసరం లేదని, అధికారులే తమ గ్రామాలకు వచ్చి రైతుల సమస్యలు పరిష్కరిస్తారన్నారు. నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టడం జరిగిందని,తదుపరి జిల్లా కి ఒక్కో మండలం తర్వాత జూన్ 2 నుండి రాష్ట్రంలోని ప్రతిగ్రామంలో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి చిన్న సమస్యకు రైతులు జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంకు రావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని గుర్తుచేశారు. అంతకుముందు హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు పిపిడి ద్వారా భూ భారతి చట్టం 2025ను గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్‌పిడిఓ లావణ్య,ఇంచార్జ్ తహశీల్ధార్ రాజేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక అరుణ్‌కుమార్ ధేశ్‌ముఖ్,పిఎసిఎస్ చైర్మన్‌లు దొంగరి వెంకటేశ్వర్లు, నరేందర్ పాల్గొన్నారు.



అన్ని భూ సమస్యలకు పరిష్కారం
కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/మోటకొండూర్** : భూ భారతి చట్టం ద్వారా భూముల అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆయన సోమవారం మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంలో 23 సెక్షన్లు 19 రూల్స్ మొత్తం 42 అంశాలను పొందుపరిచినట్లు వాటి ద్వారా భూముల పూర్తి సమస్యలు తాసిల్దార్ కార్యాలయంలో పరిష్కారం అవుతాయని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం రైతులకు చుట్టమని, ఈ చట్టంతో గెట్టు సమస్యలు, పౌతి విరాసత్, సాదాబైనామా, మ్యూటేషన్, వారసత్వం లాంటి ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. ఆర్డీవో కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, తహసిల్దార్ నాగ దివ్య, ఎంపీడీవో ఇందిర, ఏవో రమాదేవి, డిప్యూటీ తహసిల్దార్ జయలక్ష్మి, ఆర్ ఐలు ఆసిఫ్, రామారావు పాల్గొన్నారు.





## బాలకృష్ణ చారి సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/డిండి:** సిపిఐ తౌక్లాపూర్ గ్రామశాఖ సినియర్ నాయకులు తంగెల్లపల్లి బాలకృష్ణ చారి సిపిఐ కి చేసిన సేవలు చిరస్మరణీయం ఆదివారం రాత్రి బాలకృష్ణచారి వర్ధంతి సందర్భంగా తౌక్లాపూర్ గ్రామంలోని ఆయన స్మారక స్థూపం వద్ద సిపిఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, సహాయ కార్యదర్శులు బయ్యా శ్రీను, ఎనమల్ల నవీన్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్షులు నరేష్, మహిళ సమాఖ్య గ్రామశాఖ కార్యదర్శి అనిత, ఏఐవైఎఫ్ గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు మహేష్, ఆదిల్, మల్లేష్, వెంకటేష్, శ్రీను, గోపాల్, శ్రీశైలం, రాములు పాల్గొన్నారు.

# క్రీడ

## వైభవ్ శతకం..

### గుజరాత్‌ను చిత్తుగా ఓడించిన రాజస్థాన్



ఐపిఎల్ 18వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన రాజస్థాన్ రాయల్స్ భారీ విజయం సాధించింది. 210 పరుగుల లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే ఛేదించింది. 14 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(101) విధ్వంసక సెంచరీతో కదంతొక్కగా.. యశస్వీ జైస్వల్(70 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. తొలి వికెట్‌కు 166 రన్స్ జోడించి రాజస్థాన్ విజయానికి పునాది వేశారిద్దరు. వైభవ్ ఔటయ్యాక రియాన్ పరాగ్(32 నాటౌట్) ధనాధన్ ఆడి లాంఛనం ముగించాడు. దాంతో, 18వ ఎడిషన్‌లో మూడో విజయం సాధించిన రాజస్థాన్ పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్‌ను కిందికి నెట్టేసి 8వ స్థానానికి ఎగబాకింది.
ఐపీఎల్ చరిత్రలో రాజస్థాన్ రాయల్స్‌కు కలకాలం గుర్తిండిపోయే రోజు ఇది. రికార్డు పుస్తకాల్లో 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ(101) పేరు నిక్షిప్తమైంది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లను ఉతికారేస్తూ సిక్సర్లతో రెచ్చిపోయిన ఈ చిచ్చరపిడుగు మెరుపు శతకంతో చెలరేగాడు. దాంతో, రాజస్థాన్ కొండంత లక్ష్యాన్ని అలవోకగా కరిగించి 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. గుజరాత్ నిర్దేశించిన 210 పరుగుల ఛేదనలో రాజస్థాన్ ఓపెనర్లు దూకుడుగా ఆడారు. జోస్ బట్లర్ క్యాచ్ వదిలేయడంతో 2 పరుగులు వద్ద యశస్వీ జైస్వాల్(31)కు లైఫ్ లభించింది. తొలి మ్యాచ్‌లోనే ఆకట్టుకున్న వైభవ్.. సిరాజ్ వేసిన మొదటి ఓవర్లో సిక్సర్ బాదేశాడు. ఆ తర్వాత ఇషాంత్‌కు చుక్కలు చూపిస్తూ.. వరుసగా 6, 6, 4.. ఆ తర్వాత 6, 4 బాదాడు. వాషింగ్టన్ సుందర్ వేసిన 4వ ఓవర్లో 6, 6, 4 కొట్టి ఐపీఎల్‌లో తొలి అర్ధ శతకం సాధించాడీ 14 ఏళ్ల కుర్రాడు.

**గిల్, బట్లర్ మెరుపులతో**

జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు తేలిపోయారు. గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు చెలరేగగా భారీగా పరుగులిచ్చారు. టాస్ ఓడిన గుజరాత్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(84), సాయి సుదర్శన్(39) ఎప్పటిలానే శుభారంభం ఇచ్చారు. పవర్ ప్లేలో రాజస్థాన్ బౌలర్లను చీల్చి చెండాడుతూ స్కోర్ బోర్డును ఉరికించారు. దాంతో, గుజరాత్ పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 53 పరుగులు చేసింది. 6వ ఓవర్ తర్వాత జోరు పెంచిన గిల్ హసరంగ ఓవర్లో సింగిల్ తీసి అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో సుదర్శన్ సైతం దంచేయగసాగాడు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని ఎట్టకేలకు థీక్షణ విడదీశాడు. అతడి బౌలింగ్‌లో సుదర్శన్ పెద్ద షాట్ ఆడబోగా.. రియాన్ పరాగ్ క్యాచ్ సూపర్‌గా అందుకున్నాడు. దాంతో, 93 వద్ద గుజరాత్ తొలి వికెట్ పడింది.

## 2028 నుంచి ఐపిఎల్‌లో 94 మ్యాచ్‌లు?



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌ను మరో 20 మ్యాచ్‌లకు విస్తరించాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు యోచిస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించారు. అయితే, ఇప్పట్లో కొత్త ఫ్రాంఛైజీలను ప్రవేశపెట్టే ఆలోచన లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎల్ మీడియా హక్కుల కాలపరిమితి 2027 వరకు ఉంది. తదుపరి (2028) ఐపిఎల్ మీడియా హక్కుల సైకిల్ ప్రారంభంకానుంది. అప్పటి నుంచి 94 మ్యాచ్‌లు నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నాయని ఐపీఎల్ ఛైర్మన్ తెలిపారు. 'దీని గురించి ఐసీసీలో చర్చిస్తున్నాం. బీసీసీఐలోనూ అంతర్గత చర్చ జరుగుతోంది. ఫ్రాంఛైజీ క్రికెట్, టీ20 క్రికెట్, ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ ఈవెంట్‌లకు సంబంధించి అభిమానుల ఆసక్తి ఎలా మారుతోంది అనే విషయాలపై మేం మరింత లోతుగా చర్చించాల్సిన అవసరముంది. టోర్నీని విస్తరించాలంటే మ్యాచ్‌లను 74 నుంచి 84 లేదా 94కి పెంచాలి. ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో రెండేసి మ్యాచ్‌లు (సొంత మైదానంలో ఒకటి, ప్రత్యర్థి మైదానంలో ఒకటి) 94 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది' అని అరుణ్ ధుమాల్ వివరించారు.

**ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ఇది**

ప్రస్తుతం ప్రతి సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా జట్లు గెలిచిన టైటిళ్ల సంఖ్య, ఫైనల్, ప్లే ఆఫ్స్ చేరిన సంఖ్య ఆధారంగా 10 జట్లకు సీడింగ్ ఇచ్చి రెండు గ్రూప్‌లుగా విభజించారు. ఒకే గ్రూప్‌లో ఉన్న జట్ల మధ్య రెండేసి మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ప్రత్యర్థి గ్రూప్‌లో తమతో సమానంగా ఉన్న జట్టుతో రెండుసార్లు... మిగతా జట్లతో ఒకసారి తలపడుతున్నాయి. ఉదాహరణకు ఈ సారి ముంబయి ఇండియన్స్, ఆర్సీబీ వేర్వేరు గ్రూప్‌ల్లో ఉండటంతో ఒకే సారి తలపడ్డాయి. ముంబయి, సీఎస్కే వేర్వేరు గ్రూప్‌ల్లో ఉన్నా.. సేమ్ సీడింగ్ (ర్యాంకు) ఉండటంతో రెండు మ్యాచ్‌ల్లో తలపడ్డాయి.

## జింబాబ్వేకు తైజుల్ షాక్



స్వదేశంలో జింబాబ్వేతో జరగుతున్నరెండో టెస్టులో బంగ్లాదేశ్ పట్టుబిగిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి నుంచి తేరుకున్న బంగ్లా.. తైజుల్ ఇస్లాం(560) విజృంభణతో జింబాబ్వేను సమర్థంగా కట్టడి చేసింది. టాస్ గెలిచిన పర్యటక జట్టుకు ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(21), బెన్ కర్రాన్(21)లు శుభారంభం ఇవ్వగా.. జింబాబ్వే స్కోర్ దూసుకెళ్లింది. అయితే.. బెన్నెట్‌ను ఔట్ చేసిన తంజిమ్ హసన్ బంగ్లాకు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత నిక్ వెల్చ్(54), సీన్ విలియమ్స్(67)లు అర్ధ శతకాలతో చెలరేగి ఆతిథ్య జట్టు బౌలర్లను అలిసిపోయేలా చేశారు. దాంతో, టీ సమయానికి 2 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసిన పర్యాటక జట్టు పటిష్ట స్థితిలో ఉంది. అయితే.. ఆ తర్వాత సీన్ మారిపోయింది. టీ సెషన్ తర్వాత మళ్లీ బంతి అందుకున్న తైజుల్ ఇస్లాం(560) జింబాబ్వేను గట్టి దెబ్బకొట్టాడు. ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ విజృంభణతో ఆఖరి సెషన్‌లో అనూహ్యంగా 7 వికెట్లు కోల్పోయింది. ప్రధాన ఆటగాళ్లు పెవిలియన్ చేరిన వేళ వికెట్ కీపర్ తఫజ్వా స్సిగా(18 నాటౌట్), బ్లెస్సింగ్ ముజరబని(2 నాటౌట్)లు ఆలౌట్ ప్రమాదాన్ని తప్పించారు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్లు కోల్పోయి 227 రన్స్ చేసింది. బంగ్లా బౌలర్లలో నయీం హసన్ రెండు వికెట్లు పడగొట్టాడు.

## 'మెగాస్టార్'కి సిస్టర్‌గా సీనియర్ హీరోయిన్?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ఫుల్ కామెడీ ఎంటర్ టైనర్ రాబోతుంది. ఐతే, ఈ మూవీలో స్టార్ హీరోయిన్ నయనతార నటించనున్నట్లు, ఆమె భారీ రెమ్యునరేషన్ డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా మరో క్రేజీ రూమర్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగాస్టార్ కి సిస్టర్ రోల్ ఉందని.. ఈ పాత్ర చాలా ఎంటర్టైనింగ్ టోన్‌లో సాగుతుందని.. ఈ పాత్రలో సీనియర్ హీరోయిన్ జ్యోతిక నటించబోతుందని టాక్ నడుస్తోంది. మరి ఈ వార్తలో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి. కాగా ప్రస్తుతం వైజాగ్‌లో అనిల్ రావిపూడి తన టీమ్‌తో సెకండ్ హాఫ్ స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నాడు. సెకండ్ హాఫ్ లో చిరంజీవి పాత్రకి ప్రత్యేకమైన యాస మరియు బాడీ లాంగ్వేజ్‌ను అనిల్ రావిపూడి డిజైన్ చేస్తున్నారట. అదేవిధంగా సినిమాలో పూర్తిగా కామెడీపై దృష్టి సారిస్తున్నారు. ఇక ఈ సినిమా గురించి మెగాస్టార్ ఆ మధ్య మాట్లాడుతూ.. 'ఈ సినిమా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రమని.. ఈ మూవీ సెట్స్‌లో అడుగుపెట్టేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అని చిరు ఆల్ రెడీ చెప్పారు. అన్నట్టు, అనిల్ రావిపూడి చెప్పే సీన్స్ గురించి కూడా మెగాస్టార్ చెబుతూ.. 'సినిమాలో ఆయా సన్నివేశాల గురించి అనిల్ రావిపూడి నాకు చెబుతుంటే కడుపుబ్బా నవ్వుతున్నాను. ఈ సినిమా కచ్చితంగా అభిమానులకు నచ్చుతుంది' అని మెగాస్టార్ చిరంజీవి తెలిపారు. ఇక సాహు గారపాటి, సుస్మిత (చిరంజీవి కుమార్తె) సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తారని చిరు తెలిపారు.

# రీల్

## అప్పట్లో నా ఎత్తు అతి పెద్ద సమస్య

– మీనాక్షి చౌదరి



టాల్ బ్యూటీ మీనాక్షి చౌదరి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో సాలిడ్ హిట్ కొట్టింది. ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో కలిసి 'అనగనగా ఒక రాజు' సినిమాలో నటిస్తోంది. ఐతే, మీనాక్షి.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు చెప్పింది. ఇంతకీ, మీనాక్షి చౌదరి ఏం చెప్పింది అంటే 'నా చిన్నతనంలో ఇతరులతో మాట్లాడడానికి నేను చాలా ఇబ్బంది పడేదాన్ని. ఎందుకంటే కాలేజ్ రోజుల్లోనే నా ఎత్తు 6.2 ఉండేది. ఈ కారణంగా నాతో చాలా మంది డిస్టెన్స్ మెయింటైన్ చేసేవారు' అంటూ చెప్పుకొచ్చింది. మీనాక్షి చౌదరి ఇంకా మాట్లాడుతూ.. 'నిజానికి అప్పట్లో నా ఎత్తు నాకు అతి పెద్ద సమస్య. ఆ సమయంలో నాకు చాలా బాధగా కూడా అనిపించేది. ఇక ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్నకు ఆ విషయం గురించి చెప్తే నీ సమస్యను నువ్వే పరీక్షించుకో అని సలహా ఇచ్చారు. దీంతో అందాల పోటీల్లో పాల్గొన్నాను. ఇండస్ట్రీకి వచ్చాను. ఇక్కడ వచ్చిన ప్రతి ఆఫర్ సద్వినియోగం చేసుకున్నాను' అని మీనాక్షి చౌదరి చెప్పుకొచ్చింది.

## ఆయనతో మాట్లాడనిదే ఏమీ తోచదు

– మోహన్ లాల్



హీరో మోహన్‌లాల్ వైవిధ్యమైన పాత్రలతో ఆకట్టుకుంటూ ఇటు తెలుగు ప్రేక్షకుల్నీ సైతం మెప్పిస్తున్నారు. అయితే, తాజాగా ఆయన కొన్ని ఆసక్తికర విశేషాలు చెప్పుకొచ్చారు. తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. 'నలభై ఎనిమిదేళ్ల కెరీర్‌లో నేను సినిమాను ప్రేమించినంతగా దేన్నీ ప్రేమించలేదు. ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే నాలుగైదు చిత్రాలకు ఓకే చెబుతుంటా. నిజానికి నాకు విశ్రాంతి తీసుకోవడం, ఖాళీగా ఉండటమంటే అస్సలు నచ్చదు. అందుకే, ఎప్పుడూ సినిమాల్లో బిజీగా ఉంటాను' అంటూ మోహన్ లాల్ చెప్పుకొచ్చారు. మోహన్ లాల్ తన కోరిక గురించి మాట్లాడుతూ.. 'మమ్ముట్టి నా ప్రాణ స్నేహితుడు. తనతో కలిసి దాదాపు యాభై సినిమాల్లో నటించాను . ఇంకా మరిన్ని చిత్రాల్లో కలిసి పని చేయాలనేదే నా కోరిక. రోజుకి ఒక్కసారైనా తనతో మాట్లాడనిదే నాకేమీ తోచదు. మా మధ్య పోటీ ఉంది అని అందరూ అనుకుంటారు. కానీ, మా మధ్య మంచి స్నేహం ఉంది' అని మోహన్ లాల్ చెప్పారు. అలాగే, తాను అయ్యప్ప స్వామి భక్తుణ్ని. అప్పుడప్పుడు మాల వేసుకుని.. కాలినడకన శబరిమల వెళ్లి ఇరుముడి సమర్పించి వస్తుంటా' అని మోహన్ లాల్ తెలిపారు.

## రాష్ట్రంలో 31 పట్టణాల మాస్టర్‌ప్లాన్‌ల రూపకల్పన

**ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్ తయారీ**

**తుది దశలో 11 పురపాలిక మాస్టర్‌ప్లాన్‌లు**

**మరో 20 పురపాలికల మాస్టర్‌ప్లాన్‌ల రూపకల్పనకు కసరత్తు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పట్టణ ప్రాంతాలలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు లేకుండా విస్తరిస్తున్న పట్టణాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులు తొలగించి, భవిష్యత్‌లో చేపట్టే అభివృద్ధి పనుల కోసం రాష్ట్రవ్యాప్తంగా దశల వారిగా పట్టణాలలో మాస్టర్ ప్లాన్‌లు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెల్సిందే. అందులో భాగంగా హెచ్‌ఎండిఏ వెలుపల ఉన్న 20 పట్టణాలలో ఈ మాస్టర్‌ప్లాన్ రూపకల్పన సాగుతోంది. మాస్టర్ ప్లాన్‌ల ముసాయిదాలను ఈ ఏడాది ఆగస్టు 15లోగా తుది రూపు ఇవ్వడానికి మున్సిపల్ శాఖలోని డిటిసిపి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా పట్టణాల జిఐఎస్ మ్యాపింగ్ కోసం డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నారు. దీనివల్ల నగర ప్రణాళిక, గ్రామీణ అభివృద్ధి సంచాలకులు (డిటిసిపి) మ్యాపింగ్ ద్వారా మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**ఎంపిక చేసిన 20 పురపాలికలు..**

అర్మూర్, బదేపల్లి, భైంసా, బోధన్, గద్వాల్, జనగాం, కాగజ్‌నగర్, కోదాడ, కోరుట్ల, ఖమ్మం, మంచిర్యాల్, మందమర్రి, మేదక్, మేట్‌పల్లి, పాల్వంచ, సిరిసిల్ల, తాండూరు, వికారాబాద్, వనపర్తి, జహీరాబాద్ ఉన్నాయి. ఈ మాస్టర్ ప్లాన్‌లను అటల్ మిషన్ ఫర్ రిజువినేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్(అమృత్) II ప్రణాళిక కింద రూపొందిస్తున్నారు. 2024 జూలైలో దీనికి పరిపాలనా అనుమతి లభించింది. 20 పురపాలికలలో 17కి ఇప్పటికే మాస్టర్ ప్లాన్‌లు సిద్ధమయ్యాయి. ఇందులో అర్మూర్, బదేపల్లి, కోదాడ నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలుగా ఉన్నాయి. 50,000 నుండి ఒక లక్ష జనాభా ఉన్న పురపాలికలను అమృత్ II ద్వారా మాస్టర్‌ప్లాన్‌లు రూపొందిస్తున్నారు. డ్రోన్ సాంకేతికత ద్వారా జియోడేటాబేస్ తయారీకి, బేస్ మ్యాప్ సిద్ధం చేయడానికి సర్వే ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. బేస్ మ్యాప్ తయారీ అనంతరం ప్రాథమిక, ద్వితీయ సర్వేల ద్వారా ప్రస్తుత మౌలిక సదుపాయాల వివరాలను సేకరిస్తారు.
అనంతరం ఈ డేటాను విశ్లేషించి, ప్రస్తుత భూ ఆధారితంగా మ్యాపింగ్ చేస్తారు. తదుపరి ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు వాటిపై సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నారు.

**చివరి దశలో మొదటి దశ మాస్టర్‌ప్లాన్ ప్రణాళికలు..**

అమృత్ I దశలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధి బయట ఉన్న 11 పట్టణాల కోసం మాస్టర్ ప్లాన్‌లను సిద్ధం చేశారు. వీటిలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్, సూర్యాపేట, మిర్యాలగూడ, సిద్దిపేట, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, రామగుండం ఉన్నాయి. ఇందులో నల్లగొండ, వరంగల్, నిజామాబాద్ మాస్టర్ ప్లాన్‌లు పూర్తి చేసి ఆమోదించారు. ఖమ్మం, మహబూబ్ నగర్, సూర్యాపేట, కరీంనగర్, మిర్యాలగూడలకు సంబంధించిన ప్లాన్‌ల రూపకల్పన చివరిదశలో ఉన్నాయి. మిగిలిన పట్టణాల మాస్టర్ ప్లాన్‌ల రూపకల్పనకు కసరత్తు చేస్తున్నారు.



నూతనంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. రామకృష్ణా రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రామకృష్ణారావుకి అభినందనలు తెలిపారు.
ప్రజాపక్షం/హైదరాబాద్ :

## బాధిత మహిళలకు జాతీయ కమిషన్ అండ

**జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహత్కార్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాధిత మహిళలకు మహిళా కమిషన్ అండగా నిలుస్తుందని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహత్కర్ అన్నారు. హైదరాబాద్ టూరిజం ప్లాజాలో సోమవారం ఏర్పాటు చేసిన మహిళా బహిరంగ విచారణలో ఆమె పాల్గొని కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లో మొదటి సారిగా బహిరంగ విచారణను ఏర్పాటు చేసి మహిళా బాధితుల నుండి 60 వరకు దరఖాస్తులు స్వీకరించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. కమిషన్ హైదరాబాద్ పరిధిలో 2022 నుండి 2024 ఉన్న కేసులలో సత్వరమే 30 కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేశామన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఎక్కడ కూడా అశ్రద్ధ, నిర్లక్ష్యం చూపకుండా మహిళా కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆమె అధికారులకు ఆదేశించారు. అన్ని రాష్ట్రాలలో నెలలో నాలుగు సార్లు కమిషన్ బాధిత మహిళల వద్దకు వెళ్లి సత్వర న్యాయం చేసి అండగా నిలుస్తున్నామని అన్నారు.
పెండింగ్ కేసుల అంశాలను నివేదిక రూపంలో సత్వరమే అందించాలని పోలీస్ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద నేరెళ్ల, మహిళా సంక్షేమ శాఖ సంచాలకులు క్రాంతి వెస్లీ, అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్స్ విశ్వ ప్రసాద్, అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి, డిసిపి లావణ్య, జిల్లా మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వర రావు, వయోవృద్ధుల శాఖ అధికారి రాజేందర్, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆశన్న, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, బాధిత మహిళా కుటుంబాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సస్యశ్యామలం చేస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

మునుగోడు ఎత్తిపోతల పథకానికి, 19.95కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నర్సింగ్ బట్ల ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. అంతేకాక 36 కోట్ల రూపాయల వ్యయంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్మించనున్న అదనపు బ్లాక్‌కు శంకుస్థాపన చేశారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ప్రదర్శనను తిలకించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాలో ఎలాంటి ఇరిగేషన్ పనులు చేపట్టలేదని తెలిపారు . ఎన్నో ఏళ్ల నుండి రైతులు ఎదురుచూస్తున్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఎదుల ద్వారా నీరు అందించేందుకు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 1800కోట్ల రూపాయలను మంజూరు చేసి పనులు మొదలుపెట్టామన్నారు. అలాగే హై లెవెల్ కెనాల్‌కు 442 కోట్లు మంజూరు చేశామని ,పిల్లయిపల్లి కాలువ,శివన్న గూడెం నుండి నారాయణపూర్, చౌటుప్పల్ మీదుగా సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ తప్పనిసరిగా మంజూరు చేస్తామని ప్రకటించారు. మూసీని పునరుద్ధరణ చేసి ఉమ్మడి జిల్లా రైతులకు మేలు చేస్తామన్నారు. తమ హయాంలోనే ఎస్ఎల్బిసిని పూర్తిచేస్తామని తెలిపారు.దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు, మరో నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తిచేస్తామని, అలాగే ఐటిపాముల లిఫ్ట్ పనులు కూడా వేగవంతం చేసి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి మేలు చేసే నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేసి అతి త్వరలోనే స్టేజి వన్ ద్వారా సాగు నీరు ఇస్తామన్నారు. అలాగే రాచకాలువ పనులు పూర్తి చేస్తామని, గంధమల్ల ప్రాజెక్టును తప్పనిసరిగా పూర్తి చేస్తామన్నారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నారాయణపూర్, చౌటుప్పల్‌కు కాల్వ విస్తరించి నిరందిస్తామన్నారు. పెల్లిపాకల, గాజుపేట లిఫ్ట్ ఇరిగేషన్ నుచేపట్టి పూర్తి చేస్తామని చెప్పారు. దేవాదుల నుండి తుంగతుర్తికి సాగునీరు తెస్తామని, ఎస్సారెస్పీ ప్రాజెక్టును పునరుద్ధరణ చేసి నీళ్లు పెంచుతామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 66.7 లక్షల ఎకరాలలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించామని, యాసంగి ధాన్యం కలుపుకుని మొత్తం 2,80,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి రికార్డు సృష్టించామని ,స్వతంత్ర భారతదేశంలో ఏ రాష్ట్రంలో పండించని విధంగా ధాన్యం పండించామని, అంతేకాక సన్న ధాన్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్‌ను ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టు వంటివి పూర్తి చేయలేదని, అలాగే ఏ ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ,రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం ఇచ్చారని, తాము సన్నధాన్యాన్ని ఉచితంగా 85 జనాభాకు ఆరు కేజీల చొప్పున ఇస్తున్నామని, ఎక్కువ శాతం జనాభాకు ఉపయోగపడే పథకం సన్న బియ్యం అని అన్నారు. రాష్ట్రంలో పండించిన బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని, నల్లగొండ నుండి ఫిలిప్పీన్స్‌కు బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 36 కోట్ల రూపాయలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం అదనపు బ్లాకుకు, సుమారు 50 కోట్ల రూపాయలతో ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేయడం సంతోషమని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కలెక్టర్ కార్యాలయం అయిందని, అయితే ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు పెరగడం, కార్యాలయాలు పెంపు వల్ల ప్రస్తుతం ఉన్న కలెక్టర్ సరిపోదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులకు మంచి వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఆర్ అండ్ బి శాఖ ద్వారా 36 కోట్లు రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, 9 నెలల్లో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, శాసనమండలి సభ్యులు నెల్లి కంటి సత్యం, శంకర్ నాయక్, దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయ వీర్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శామ్యూల్, డిసిసిబి అధ్యక్షులు కుంభం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవర్, ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, ఉదయ సముద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, జవహర్, ఇన్చార్జి డిఆర్‌ఓ అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఈ సందర్భంగా మంత్రులు 5 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మండ్ల కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున చెక్కులను అందజేశారు.

## 'శ్రీ చైతన్య' రాంగ్ రూట్

**(మొదటి పేజీ తరువాయి)**

ధ్యేయంగా వ్యాపారం చే స్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కరీంనగర్ పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన మేకల రోహిత్ అనే విద్యార్థి ఇంటర్మీడియట్ చదువుతూ జెఇఇ మెయిన్స్ ఫలితాలలో 18196వ ర్యాంకు, రిజర్వ్‌డ్ కోటా, శారీరక వైకల్యం రిజర్వేషన్ కోటాలో 17వ ర్యాంకు సాధించాడు. ఇంటర్మీడియట్ ఫలితాల అనంతరం ఇదే ర్యాంకును శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం బారీ హోర్డింగులు, ప్రకటనల ద్వారా ప్రచారం చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు తాము నాణ్యమైన విద్యనందిస్తున్నామంటూ మభ్య పెడుతున్నారు. కేవలం వ్యాపార దృష్టితో సాధారణ ర్యాంకులు కాకుండా రిజర్వేషన్ ర్యాంకులను చూపిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే సదరు మేకల్ రోహిత్ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి విభాగంలో రెండు సబ్జెక్టులు ఫెయిలయ్యాడు. అదీ కాకుండా ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఒక సబ్జెక్ట్ ఫెయిలయ్యాడు. ఈ మూడు సబ్జెక్టుల్లో సదరు విద్యార్థి ఫలితాల మీద దృష్టిసారించకుండా కేవలం అతని జేఈఈ మెయిన్స్ ఫలితమైన రిజర్వేషన్ 17 వ ర్యాంకును కళాశాల వాడుకోవడం విశేషం. ఇంటర్ మొదటి సంవత్సరం ఫెయిలయిన విద్యార్థి సప్లమెంటరీలో, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో కలిపి రెండు పర్యాయాలు ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉన్నప్పటికీ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం మూలంగా సదరు విద్యార్థి జేఈఈ 17 ర్యాంకు ప్రయోజనం పొందలేక పోతున్నాడు. శ్రీ చైతన్య కళాశాల కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించేంత విద్యాబోధన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. నాణ్యమైన విద్య.. ర్యాంకులు దేవుడెరుగు కానీ కేవలం పాస్ చేయించడమే కష్టమవుతోందని తెలుస్తోంది. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ సదరు ఎస్సీ విద్యార్థి ఉన్నతికి తోడ్పడితే..అదే విద్యార్థి భవిష్యత్తుపై దృష్టిసారించకుండా అతడు రిజర్వేషన్ కోటాల సాధించిన ర్యాంకును వాడుకుని అడ్మిషన్ల పేరుతో కళాశాల ప్రచారం చేసుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది. కళాశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ఆలోచన లేకుండా కేవలం ర్యాంకుల పేరుతో అడ్మిషన్లు పొంది లబ్దిపొందాలని యాజమాన్యం తహ తహలాడుతుంది. సదరు విద్యార్థి ఇంటర్‌లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణుడైతే జేఈఈ ఫలితాలలో వచ్చిన 17వ ర్యాంకుతో ఉన్నతస్థితిలో ఉండేవాడు..

**ప్రాక్టికల్స్‌లోనూ వింతలు!**

సాదారణంగా ఇంటర్మీడియట్‌లో ప్రాక్టికల్స్ అంతా కళాశాల యాజమాన్యం చేతిలో మార్కులుంటాయని అందరికీ తెలిసిన విషయమే.. అయితే సదరు జేఈఈ మెయిన్స్‌లో 17 ర్యాంకు సాధించిన మేకల రోహిత్‌కు ఇంటర్మీడియట్‌లో కెమిస్ట్రీలో 30 మార్కులకు గాను 15, ఫిజిక్స్‌లో 30 మార్కులకు గాను 20 మార్కులు వేసారు. సదరు విద్యార్థులకు ఐఐటి జేఈఈలో సీటు రావాలంటే 65 శాతం మార్కులుండాలి. అంటే 650 మార్కులపైన రావాలి... అయితే ఆ దృక్పదం సైతం లేకుండా సదరు విద్యార్థి ప్రాక్టికల్స్‌లో మార్కులు తగ్గించడం వారికే చెల్లింది. మరో విషయమేమిటంటే కళాశాలకు సంబంధం లేని విద్యార్థి సాధించిన ర్యాంకు ఫోటో పెట్టుకుని సైతం ప్రచారం చేశారు. ఖమ్మంకు చెందిన పి.ఈశ్వర్ ముకేష్ కుమార్ జేఈఈ అడ్వాన్స్‌లో 1275 వ ర్యాంకు సాధించారు. ఈ విషయాలపై శ్రీ చైతన్య కళాశాల డీన్ జగన్మోహన్ రెడ్డిని ప్రజాపక్షం ప్రతినిధి సంప్రదిస్తే మేకల్ రోహిత్ రెండు సబ్జెక్టులు ఫెయిలవ్వడం వాస్తవమేనని, అతడు స్లోలర్నర్ అని చెప్పడం విశేషం. ఈశ్వర్ ముకేష్ తమ లెక్చరర్ బందువు అని, అతడు షార్ట్ టర్మ్ కోచింగ్‌లో మెటీరియల్ తీసుకుని ఇంట్లో కూర్చుని చదివి ర్యాంకు సాధించాడని చెప్పడం మరో విశేషం. కాగా స్లో లర్నర్ అయిన అత్యంత పోటీ పరీక్ష జేఈఈ మెయిన్స్‌లో రోహిత్‌కు 18 వేల ర్యాంకు, రిజర్వేషన్ కోటాలో 17 వర్యాంకు ఎలా సాధ్యమైందనే ప్రశ్నకు సమాధానం లేదు. కేవలం వారి ఫోటోలు పెట్టుకుని ప్రచారం చేసుకుంటూ అడ్మిషన్లు పొందడం తప్ప విద్యార్థుల భవితకు బాటలు వేయడంలో పూర్తిగా విఫలమైందంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com